దిక్రైమ్ న్యూస్ Crime News
తెలుగు దినపత్రిక
శుక్రవారం, ఆగస్టు 14, 2026 | సంపుటి - 20 | సంచిక 317 | వెల - 4రూ | పేజీలు - 12
Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.

## బిసి మహిళలకు స్వయం ఉపాధి

### ఉచిత కుట్టుమిషన్లు ప్రారంభించిన మంత్రి పొన్నం



హైదరాబాద్ : బీసీ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి స్వయం ఉపాధిని ప్రోత్సహించేందుకు ఉచిత కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమాన్ని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సచివాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజాపాలనలో బీసీ మహిళల స్వయం ఉపాధి, ఆర్థిక సాధికారతకు పెద్దపీట వేస్తున్నామని పొన్నం చెప్పారు.

తరువాయి 2లో

### మైనార్టీ రిజర్వేషన్లు కల్పించిన

# ఘనత కాంగ్రెస్‌దే

### కొందరు 4శాతం రిజర్వేషన్లపై కోర్టు మెట్లెక్కారు
### ఇంటింటికీ వెళ్లి ఓట్ల గల్లంతును పరిశీలించండి
### మైనార్టీల ప్రతిభా సదస్సులో సిఎం రేవంత్ రెడ్డి



**ముస్లిం మైనారిటీ రిజర్వేషన్లు అడ్డుకునేందుకు కొన్ని రాజకీయ పార్టీలు ప్రయత్నిస్తున్నాయని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. ముస్లింలకు కాంగ్రెస్ 4 శాతం రిజర్వేషన్లు కల్పించిందని, వీటిని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. రిజర్వేషన్ల రద్దు కోసం అత్యున్నత న్యాయస్థానాల వరకూ వెళ్లారని ముఖ్యమంత్రి విమర్శించారు. అయినా చిత్తశుద్ధితో కాంగ్రెస్ అమలు చేసిందన్నారు.**

హైదరాబాద్ : హైదరాబాద్‌లో నిర్వహించిన మైనారిటీల ప్రతిభా సదస్సుకు సీఎం రేవంత్ ముఖ్య అతిథిగా హాజర య్యారు. ఈ సందర్భంగా పలు రంగాల్లో ప్రతిభ కనబరిచిన పలువురు మైనారిటీలకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. మైనారిటీ రిజర్వేషన్లకు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యతిరేకమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ, సోనియా గాంధీ నేతృత్వంలోనే మైనారిటీలకు సంక్షేమం అందుతోందని చెప్పారు. కాంగ్రెస్ అంటేనే సెక్యులర్ పార్టీ అని, హిందూ, ముస్లింలను రెండుకళ్లలా చూస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంపైనా ముఖ్యమంత్రి విమర్శలు గుప్పించారు.

2లో



### పిల్లల ఆరోగ్యంపై

# ఆటలొద్దు

### ఆహార పదార్థాల ప్యాకెట్లపై లేబుల్ వేయాల్సిందే
### మీతో కాకపోతే మేమే ఆ పని చేస్తాం
### కేంద్రానికి సుప్రీం కోర్టు చురకలు

న్యూఢిల్లీ : అధిక మోతాదులో ఉప్పు, చక్కెర, సంతృప్త కొవ్వులు ఉండే ఆహార పదార్థాల ప్యాకెట్‌లపై లేబుల్స్ ఏర్పాటు చేసే విషయంలో కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు గురువారం గట్టి హెచ్చరిక చేసింది. 'మీరు చేయలేకపోతే మేమే చేస్తాం' అంటూ కేంద్రానికి తేల్చి చెప్పింది. ప్రజల ఆరోగ్యానికి, ముఖ్యంగా పిల్లల ఆరోగ్యానికి సంబంధించిన అంశాల్లో కార్పొరేట్ ఒత్తిళ్లకు తలొగ్గకూడదని స్పష్టం చేసింది. జస్టిస్ జేబీ పర్దీవాలా, జస్టిస్ కే వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనం ఈ అంశంపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని విచారించింది. ఆహార పదార్థాలపై హెచ్చరిక లేబుల్స్ విషయంలో కేంద్ర ప్రభుత్వం, భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ వ్యవహరిస్తున్న తీరుపై

2లో



## త్వరలో కోల్ ఎక్స్ఛేంజ్ ఏర్పాటు

### దేశవ్యాప్తంగా బొగ్గుకు ఒకే ధర
### కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా బొగ్గుకు ఒకే ధర ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. త్వరలో కోల్ ఎక్స్ఛేంజ్ ఏర్పాటు చేయ నున్నట్లు వెల్లడిం చారు. దీనివల్ల విద్యుత్ ఉత్పత్తి వ్యయం తగ్గి వినియోగ దారులకు తక్కువ ధరకు విద్యుత్ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 2018 నుంచి బొగ్గు ధరలను పెంచలేదని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. అదే విధంగా సిమెంట్, స్టీల్ వంటి రంగాలకు సంబంధించిన ధరల విషయంలోనూ

2లో

## వేలం వెర్రిగా భూముల అమ్మకం

### ప్రభుత్వ భూముల జాడలేకుండా మాయం
### రాయదుర్గం భూ వేలాన్ని వెంటనే ఆపాలి
### సిఎం రేవంత్‌కు హరీష్ రావు లేఖ




హైదరాబాద్ : రాష్ట్రంలో ఎక్కడ పడితే అక్కడ భూముల అమ్మకాలు చేస్తున్నారంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. భూముల అమ్మకాలపై ప్రశ్నలు సంధిస్తూ సీఎంకు హరీశ్ లేఖ రాశారు. 'ఎక్కడ ప్రభుత్వ భూములు కనిపిస్తే అక్కడ అమ్మకాలేనా? నాడు ప్రభుత్వ భూములు పెద్దలు ఇచ్చిన జాతి సంపద అని ఉపన్యాసాలు దంచిన నువ్వు.. నేడు ఎక్కడ భూములు కనిపిస్తే అక్కడ వేలం వేస్తూ, ప్రజల ఆస్తులను అమ్మకానికి పెడుతున్నావు' అంటూ ఫైర్ అయ్యారు. కంచ గచ్చిబౌలి, లగచర్ల, మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ నేడు రాయదుర్గ్ ఇలా ఎక్కడిక్కడ భూములు అమ్మే కుట్రలు చేస్తుండటం సిగ్గుచేటని మాజీ మంత్రి మండిపడ్డారు.

2లో

### అభివృద్ధి కోసమే

# కాంగ్రెస్‌కు మద్దతు

### ప్రభుత్వ మద్దతు లేకుంటే పనులు జరగవు
### మాజీ స్పీకర్ పోచారం మరోమారు హాట్ కామెంట్స్




కామారెడ్డి : అభివృద్ధి కోసమే ముఖ్యమంత్రి రేవంత్‌కి మద్దతు ఇచ్చానని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. అన్నం పెట్టిన వాళ్లను మరిచిపోతే పుట్టగతులుండవన్నారు. కేసీఆర్ చేశారు కాబట్టే.. చేశారని చెప్పానని.. రేవంత్ రెడ్డి ఇచ్చినవి కూడా చెబుతానని తెలిపారు. ఉన్నది ఉన్నట్లు చెప్పడం తన నైజమని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర దుమారాన్ని రేపిన విషయం తెలిసిందే. అభివృద్ధి నిధులకు సంబంధించి తనకు న్యాయం జరగలేదంటూ కామెంట్స్ చేశారు.

2లో

## అమరావతి రైతులది

# త్యాగమే కాదు.. స్ఫూర్తి కూడా

### వారే లేకుంటే అమరావతే లేదన్నది సత్యం
### రైతులను భాగస్వాములను చేసేందుకే ల్యాండ్ పూలింగ్
### గ్రాఫిక్స్ అన్నవారికి చెంపపెట్టులా నిర్మాణాలు
### సైబరాబాద్ స్ఫూర్తితో అమరావతి నిర్మాణానికి అడుగు
### అమరావతి నిర్మాణం రాష్ట్ర భవిష్యత్‌కు ప్రతీక
### స్టీల్ బ్రిడ్జ్ ప్రారంభంలో సిఎం చంద్రబాబు



అమరావతి : అమరావతి రైతులది త్యాగమే కాదు.. స్ఫూర్తి అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. వారు ముందుకు రాకుంటే ఇవాళ రాజధాని నిర్మాణాన్ని ఊహించలేమని అన్నారు. గత ప్రభుత్వం వారిని కేసులతో అనేక ఇబ్బందులకు గురిచేసినా, రాజధాని కోసం త్యాగాలకు వెరవలేదని అన్నారు. రాజధాని అమరావతిని కలిపే ప్రధాన రహదారి సీడ్ యాక్సెస్ రోడ్డు ఈ-3ని సీఎం చంద్రబాబు ప్రారంభించారు. సీడ్ యాక్సెస్ రోడ్డును అనుసంధానించే స్టీల్ బ్రిడ్జీల ప్రారంభానికి సూచికగా ఉండవల్లి వద్ద శిలాఫలకాన్ని చంద్రబాబు ఆవిష్కరించారు. అనంతరం కాలినడకన వెళ్లి స్టీల్ బ్రిడ్జిలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు హాజరైన రైతులు, స్థానికులను ఉద్దేశించి సీఎం మాట్లాడారు. రాష్ట్ర విభజన తర్వాత ఏమవుతుందో తెలియని స్థితిలో అందరం ఉన్నామని, రాజధాని ఎక్కడ నిర్మించాలో అర్థం కాని పరిస్థితి అన్నారు. శివరామకృష్ణ ఆధ్వర్యంలో కమిటీ వేశారు. మెజారిటీ ప్రజలు అమరావతినే సూచించారు.

2లో

## రాజధానితోనే రాష్ట్రానికి ఆదాయం



### అన్ని జిల్లాలకు మధ్యలో అమరావతి
### పురపాలక శాఖ మంత్రి నారాయణ

అమరావతి : రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ అవతరించిందని.. ఏపీకి ఆర్థిక రాజధాని కట్టాలని సీఎం చంద్రబాబు భావించారని మంత్రి నారాయణ తెలిపారు.

2



## రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోంది

### అక్రమాలపై నిలదీస్తే కేసులతో జైళ్లకు పంపుతున్నారు
### ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్టే ఇందుకు నిదర్శనం
### వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగ్రహం

కర్నూలు : రాష్ట్రంలో అమలువుతున్న 'రెడ్ బుక్ రాజ్యాంగం'పై మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్ట్, జైలుకు పంపిన తీరు రాష్ట్రంలో బాధితులే నిందితులుగా మారుతున్న దారుణ పరిస్థితికి అద్దం పడుతోందని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ అన్యాయాలను ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయిస్తూ, చివరకు ఎమ్మెల్యేల ఇళ్లను కూడా ధ్వంసం చేసి అరెస్టులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

2లో

## బిసి మహిళలకు స్వయం ఉపాధి

బీసీ మహిళలకు 100 శాతం సబ్సిడీపై ఆటోమేటిక్ కుట్టుమిషన్లు అందిస్తామని.. వారిని కేవలం లబ్ధిదారులుగా కాకుండా స్వయం ఉపాధి పొందే మహిళా పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 1,000 చొప్పున మొత్తం 1,19,000 కుట్టు మిషన్లను పంపిణీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఒక్కో దాని విలువ రూ.12,000 కాగా, లబ్ధిదారులపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా 100 శాతం సబ్సిడీపై అందజేస్తామని చెప్పారు. ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ 15 వరకు అర్హులైన బీసీ మహిళల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు మంత్రి వెల్లడించారు.

## పిల్లల ఆరోగ్యంపై ఆటలొద్దు

ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. అధిక చక్కెర, ఉప్పు, సంతృప్త కొవ్వుల గురించి అవగాహన కలిగించేందుకు ప్యాకెట్ల ముందు భాగంలో స్పష్టమైన హెచ్చరికలు ఉండాలని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. ఈ విషయంలో ఆహార పరిశ్రమ ప్రతినిధులను మాత్రమే ఎఫ్ఎస్ఎస్ఏఐ పరిగణనలోకి తీసుకుంటున్నారు. హార ప్యాకెట్లపై హెచ్చరిక గుర్తుకు బదులుగా అదనపు చక్కెర, సంతృప్త కొవ్వులు, ఉప్పు మొదలైన వాటిని రోజుకు ఎంతో తీసుకోవచ్చో పట్టిక రూపంలో చూపించే విధానాన్ని ఎఫ్ఎస్ఎస్ఏఐ సూచించింది. అయితే ఈ విధానం వినియోగదారులకు అవసరమైనంత అవగాహన అందించదనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో కేంద్రం తీసుకున్న చర్యలపై సుప్రీంకోర్టు ప్రశ్నలు సంధించింది. గతంలో కోర్టు ఇచ్చిన ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదని, ఇప్పటివరకు ప్రభుత్వం ఏ చర్యలు తీసుకుందని ధర్మాసనం ప్రశ్నించింది. హెచ్చరిక లేబుల్స్ వల్ల ఉత్పత్తుల విక్రయాలపై ప్రభావం పడుతుందని తయారీదారులు అభ్యంతరం వ్యక్తం చేయవచ్చని కోర్టు పేర్కొంది. అయితే తాము తినే ఆహారంలో ఎంత చక్కెర, ఉప్పు, సంతృప్త కొవ్వు ఉందో తెలుసుకునే హక్కు వినియోగదారులకు ఉందని స్పష్టం చేసింది. హెచ్చరిక ఉన్నప్పటికీ ఉత్పత్తిని కొనాలా, వద్దా అనే తుది నిర్ణయం వినియోగదారుడిదేనని తెలిపింది. హెచ్చరిక లేబుల్స్‌కు సంబంధించిన ప్రతిపాదనపై చర్యలు తీసుకునేందుకు కేంద్రానికి సుప్రీంకోర్టు రెండు వారాల గడువు ఇచ్చింది. తదుపరి విచారణ సమయంలో అవసరమైతే తుది ఆదేశాలు జారీ చేస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది.

## రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోంది

చంద్రబాబు డైరెక్షన్‌లోనే ఈ కుట్రల పాలన సాగుతోందని జగన్ విమర్శించారు. రాత్రి 2:45 గంటల సమయంలో వందల మంది పోలీసులు దొంగల్లా, బందిపోటు ముఠాలా వచ్చి ఎమ్మెల్యే విరూపాక్షి ఇంటి డోర్లు, సీసీ కెమెరాలను ధ్వంసం చేసి ఆయనను అపహరించుకుపోయారని ఆరోపించారు. పగటిపూట నోటీసులు ఇస్తే రాని ఉగ్రవాదా ఆయన అని ప్రశ్నించారు. గంటల వ్యవధిలోనే ఎమ్మెల్యేపై మూడు అక్రమ కేసులు పెట్టడమే కాకుండా ఆయన కుమారుడు, తమ్ముడు, తమ్ముడి కుమారుడిని కూడా ఈ కేసుల్లో ఇరికించారని మండిపడ్డారు. ఆగస్టు 1న సంగాల గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త గిరిపై దాడి జరుగుతుంటే, ఆయన రక్షణ కోసం ఎమ్మెల్యే విరూపాక్షి మానవత్వంతో అక్కడికి వెళ్లడమే నేరమన్నట్టు పోలీసులు వ్యవహరించారని జగన్ తెలిపారు. స్థానిక ఎస్సై, సీఐలకు ఫోన్ చేసినా పోలీసులు కాపాడక పోవడంతోనే ఎమ్మెల్యే స్వయంగా వెళ్లాల్సి వచ్చిందన్నారు. ఆ తర్వాత నెమలికల్లు వద్ద ఎమ్మెల్యేపై దాడి చేసి, ఆయన తమ్ముడి చెయ్యి విరగ్గొట్టారని వెల్లడించారు. ఈ నేరాన్ని కప్పిపుచ్చుకోవడానికి ఒక టీడీపీ కార్యకర్త తన భార్య బట్టలు తానే చించి, ఆ నెపం ఎమ్మెల్యేపై నెట్టి ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారని జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. దీనికి సంబంధించిన వీడియోలు కూడా బయటకు వచ్చాయని, సదరు మహిళతో తప్పుడు మాటలు చెప్పిస్తూ ప్రజాస్వామ్యాన్ని కూనీ చేస్తున్నారని, ఈ అక్రమాలపై ప్రజాస్వామ్యవాదులంతా ఆలోచించాలని జగన్ పిలుపునిచ్చారు.

## ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఆగిన కళ్యాణలక్ష్మి

### పేదింటి పిల్లలకు శాపంగా మారిన కాంగ్రెస్ తీరు

### ప్రభుత్వ తీరుపై మండిపడ్డ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

హైదరాబాద్,ఆగస్ట్13 : రేవంత్ రెడ్డి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి, సంక్షేమ పథకాల పట్ల అనుసరిస్తున్న దగాకోరు విధానాల వల్లే పేదింటి ఆడపిల్లలకు ఆసరాగా నిలిచే 'కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్' పథకాలపై హైకోర్టుస్టే విధించిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆరోపించారు. ఇది రాష్ట్ర ప్రభుత్వ అసమర్థతను రుజువు చేసిందని మండిపడ్డారు. పేద వర్గాలకు ఈ పథకాల ఫలాలు అందకూడదనే దుర్బుద్ధితో, నిధులను ఎగ్గొట్టే కుట్రతోనే కాంగ్రెస్ ప్రభుత్వం కావాలని కోర్టు వ్యవహారాల్లో అలసత్వం వహించిందని విమర్శించారు. హైకోర్టులో దాఖలైన పిటిషన్ పై కౌంటర్ దాఖలు చేస్తామని గతంలో అడ్వొకేట్ జనరల్ స్పష్టం చేసినప్పటికీ, న్యాయస్థానం పలుమార్లు అవకాశం ఇచ్చినా ప్రభుత్వం కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయకపోవడం బాధ్యతారాహిత్యానికి ప్రత్యక్ష నిదర్శనమని ధ్వజమెత్తారు. గత ఎన్నికల సమయంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్దిదారులకు ఆర్థిక సాయంతో పాటు అదనంగా తులం బంగారం ఇస్తామని రంగుల హామీలు ఇచ్చిందని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తరువాత తులం బంగారం ఇవ్వకపోగా పథకాన్ని కూడా ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన ప్రజాదరణ పొందిన పథకాలను పూర్తిగా రూపుమాపే కుట్రలో భాగంగానే ప్రభుత్వం ఇలాంటి నాటకాలకు తెరలేపుతోందని దుయ్యబట్టారు. 2014 నుంచి బీఆర్ఎస్ హయాంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీ వర్గాలకు రూ. 13 వేల కోట్లకు పైగా వెచ్చించి లక్షలాది మంది ఆడబిడ్డల పెళ్లిళ్లకు కొండంత అండగా నిలిచామని పేర్కొన్నారు. ?ప్రభుత్వం ఇప్పటికైనా నిద్రమత్తును వీడి, వచ్చే విచారణ గడువైన సెప్టెంబరు 9 లోగా ఉన్నత న్యాయస్థానంలో బలమైన కౌంటర్ పిటిషన్ దాఖలు చేయాలని డిమాండ్ చేశారు. అవసరమైతే చట్టసభల ద్వారా ప్రత్యేక చట్టబద్ధత కల్పించి స్టే ఎత్తివేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. లబ్దిదారులకు వెంటనే నిధులు విడుదలయ్యే వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజాక్షేత్రంలోనూ, చట్టసభల్లోనూ పోరాడుతుందని హెచ్చరించారు.

## అంత్యక్రియలకు వచ్చి.. చెరువులో దిగి ఇద్దరు మృత్యువాత

సంగారెడ్డి,ఆగస్ట్13 : జిల్లాలో విషాద ఘటన చోటుచేసుకుంది. జిన్నారం మండలం వావిలాల గ్రామంలో చెరువులో స్నానానికి వెళ్లిన ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. బంధువు అంత్యక్రియలకు హాజరయ్యేందుకు వచ్చిన గణెళిష్ (30), మునిరాజు (58) ప్రాణాలు కోల్పోయారు. అంత్యక్రియలు పూర్తయిన అనంతరం ఇద్దరూ చెరువులో స్నానం చేసేందుకు వెళ్లారు. ఈ క్రమంలో గణెళిష్‌కు ఒక్కసారిగా మూర్ఛ రావడంతో అదుపు తప్పి నీటిలో పడిపోయాడు. చెరువులో మునిగిపోతున్న గణెళిష్‌ను గమనించిన మునిరాజు.. కాపాడేందుకు వెంటనే నీటిలోకి వెళ్లాడు. అయితే గణెళిష్‌ను రక్షించే ప్రయత్నంలో మునిరాజు కూడా నీటిలో మునిగిపోయాడు. ఇద్దరూ చాలాసేపు బయటకు రాకపోవడంతో అక్కడ ఉన్నవారు ఆందోళనకు గురయ్యారు. వెంటనే సమాచారం అందడంతో స్థానికులు చెరువు వద్దకు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. చివరకు ఇద్దరి మృతదేహాలను బయటకు తీసినట్లు సమాచారం. అంత్యక్రియలకు హాజరైన కుటుంబాల్లో ఈ ఘటన మరో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

# మైనార్టీ రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్‌దే

గత ప్రభుత్వం గ్రూప్-1 పరీక్షలను నిర్వహించలేకపోయిందని ఎద్దేవా చేశారు. ఓ ఆర్ఎంపీ డాక్టర్‌ను టీజీపీఎస్సీ సభ్యుడిగా నియమించారని సీఎం ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఉన్నంతకాలం దేశంలో సెక్యులర్ వర్గాలకు మనుగడ ఉంటుందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. హిందూ, ముస్లింలను రెండు కళ్లలా కాంగ్రెస్ చూస్తోందని చెప్పారు. నగరంలోని కొమురం భీమ్ ఆదివాసీ భవన్‌లో మైనారిటీస్ ఎక్సలెన్స్ సమ్మిట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అజారుద్దీన్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో కలిసి సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్లను కాంగ్రెస్ ఇచ్చింది. వాటిని రద్దు చేయాలని కొందరు హైకోర్టు, సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గుజరాత్‌లో మైనార్టీ రిజర్వేషన్లు రద్దు చేసి చూపాలని సవాల్ విసిరాం. లౌకిక వర్గాల కోసం కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ పోరాడుతుంది. బాక్సింగ్ క్రీడాకారిణి నిఖత్ జరీన్‌కు గ్రూప్-1 ఉద్యోగం, రూ.3కోట్ల ప్రోత్సాహకం ఇచ్చాం. బీఆర్ఎస్ హయాంలో గ్రూప్-1 నియామకాల ఊసే లేదు. ఒకసారి నియామకాలు చేపట్టినా పల్లీ, బఠానీల్లా ప్రశ్నపత్రాలు అమ్మారు. మా ప్రభుత్వం వచ్చాక టీజీపీఎస్సీని ప్రక్షాళన చేశాం. అందులో విద్యావంతులను నియమించాం. టీజీపీఎస్సీ ద్వారా గ్రూప్-1 పోస్టులు భర్తీ చేశాం. గ్రూప్-1 రద్దు చేయాలని బీఆర్ఎస్ నేతలు సుప్రీంకోర్టు వరకు వెళ్లారు. అక్కడ మంచి న్యాయవాదిని పెట్టి వాదనలు వినిపించాం. తద్వారా నియామకాలు పూర్తిచేశాం. గ్రూప్ 2, 3, 4 పోస్టుల విషయంలోనూ కోర్టుల్లో పోరాడి ఉద్యోగాలు భర్తీ చేశాం'అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. యూపీఎస్సీ తరహాలో టీజీపీఎస్సీని బలోపేతం చేశామని ధీమా వ్యక్తం చేశారు. రిటైర్డ్ డీజీపీని టీజీపీఎస్సీ ఛైర్మన్‌గా నియమించామని చెప్పుకొచ్చారు. ఎంతో పారదర్శకంగా గ్రూప్-1 పరీక్షలు నిర్వహించామని తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన నిఖత్ జరీన్ కోసం నిబంధనలు పక్కనపెట్టి మరీ గ్రూప్-1 ఉద్యోగం ఇచ్చామని, అలాగే క్రికెటర్ సిరాజ్‌కు డీఎస్పీ ఉద్యోగం కల్పించామని సీఎం రేవంత్ గుర్తు చేశారు. మైనారిటీ యువత చదువుతో పాటు నైపుణ్యం సంపాదించాలని కోరారు. జర్మనీ, జపాన్ లాంటి దేశాల్లో ఎన్నో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేందుకు స్కిల్స్ యూనివర్సిటీ కూడా ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు. సందర్భంగా తాను అందరి సహకారంతోనే తెలంగాణ ముఖ్యమంత్రి స్థాయికి చేరుకున్నట్లు రేవంత్ చెప్పుకొచ్చారు. సర్ పేరుతో ఓట్లు తొలగించాలని కొందరు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. బెంగాల్‌లో గెలిచామని, ఇక తెలంగాణనే టార్గెట్ అని కొందరు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. అక్కడ మమతా బెనర్జీ వదిలేశారేమో కానీ, ఇక్కడ కాంగ్రెస్ కార్యకర్తలు వదిలిపెట్టరని హెచ్చరించారు. 'గల్లీ గల్లీ తిరగండి, ఇంటింటికీ వెళ్లండి.. ప్రతీ ఒక్కరి ఓటును చెక్ చేయండి' అంటూ కార్యకర్తలకు సీఎం పిలుపునిచ్చారు. ప్రతీ ఒక్కరూ ఒక రేవంత్ రెడ్డిలాగా మారి ప్రజల ఓటు హక్కును కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

# అమరావతి రైతులది త్యాగమే కాదు.. స్ఫూర్తి కూడా

రాజధాని లేకపోతే మనం ఏమీ చేయలేమని గ్రహించి నిర్మాణానికి సంకల్పించా.. కేవలం ఓ 50 ఎకరాల్లో భవనాలు నిర్మించవచ్చని, అయితే భవిష్యత్ ఏం కావాలన్న ప్రశ్న ఉదయించడంతో అమరావతి నిర్మాణానికి పూనుకున్నామని అన్నారు. అయితే ఇందుకోసం భూములు కావాలి కదా? మహానగరంగా ఎలా చేయాలని ఆలోచిస్తే.. ల్యాండ్‌పూలింగ్ కాన్సెప్ట్ వచ్చింది. రాజధాని నిర్మాణంలో రైతులను భాగస్వాములను చేస్తే బాగుంటుందని ఆలోచించా. ఒక్కమాట చెప్పగానే.. నన్ను నమ్మి భూములిచ్చేందుకు అన్నదాతలు ముందుకొచ్చారు. నోటిఫికేషన్ ఇచ్చిన 58 రోజుల్లోనే రైతుల నుంచి విశేష స్పందన వచ్చింది. 33వేల ఎకరాలు ఇచ్చేందుకు.. 29వేల మంది రైతులు ముందుకొచ్చారు. అమరావతి రైతాంగానికి శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నానని నాటి సంగతులను సీఎం చంద్రబాబు వివరించారు.సింగపూర్ మోడల్‌తో అమరావతిని నిర్మిస్తున్నామని చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. తనపై ఉన్న నమ్మకంతో ఆ ప్రభుత్వం ఉచితంగా ప్లాన్ ఇచ్చారని అన్నారు. సీడ్ యాక్సెస్ రోడ్డుతో అమరావతికి కనెక్టివిటీ పెరగనుందని పేర్కొన్నారు. రాజధాని లేకపోతే మనం ఏమీ చేయలేమని గ్రహించా నని తెలిపారు. రాజధాని కోసం భూములు ఇచ్చిన అమరావతి రైతులకు పాదాభివందనం చేస్తున్నానని అన్నారు. రైతులు లేకపోతే రాజధాని లేదని చెప్పుకొచ్చారు. ఆనాడు అమెరికాలో పర్యటించి.. సైబరాబాద్ రూపకల్పన చేశామని ప్రస్తావించారు. రూపాయి తీసుకోకుండా అమరావతి కోసం సింగపూర్ మాస్టర్ ప్లాన్ రూపొందించిందని సీఎం చంద్రబాబు కొనియాడారు. ఏపీకి గొప్ప చరిత్ర ఉందని తెలిపారు. అమరావతి రైతుల త్యాగమే కాదని.. స్ఫూర్తి కూడా చాలా గొప్పదని ప్రశంసించారు. నాడు రాజధాని ఎక్కడ కట్టాలనే సందిగ్ధత ఉండేదని తెలిపారు. శివరామకృష్ణ ఆధ్వర్యంలో ఇందుకోసం ఓ కమిటీ వేశారని ప్రస్తావించారు. రాజధానిగా అమరావతినే మెజార్టీ ప్రజలు కోరుకున్నారని ప్రస్తావించారు. ప్రజల నిర్ణయం మేరకే రాజధాని అమరావతి నిర్ణయం ఉంటుందని స్పష్టం చేశారు. ఆనాడు సైబరాబాద్‌ను నిర్మించామని చెప్పారు. హైదరాబాద్ ఆదాయం పెరగడానికి తాను చేసిన అభివృద్ధే కారణమని పేర్కొన్నారు. ప్రజల నిర్ణయం మేరకే రాజధాని అమరావతిని ఎంపిక చేశామని సీఎం చంద్రబాబు చెప్పారు. ఆనాడు హైటెక్‌సిటీ నిర్మిస్తే కొంతమంది ఎగతాళి చేశారని అన్నారు. తలసరి ఆదాయంలో తెలంగాణ నంబర్ వన్‌గా నిలిచిందని వెల్లడించారు. హైటెక్‌సిటీ నిర్మాణం దశలోనూ ఎన్నో విమర్శలు ఎదుర్కొన్నామని చెప్పారు. విమర్శలు పట్టించుకోకుండా సైబరాబాద్ నిర్మాణంపై దృష్టి పెట్టామని తెలిపారు. ఇప్పుడు హైదరాబాద్ ఎదుగుదల చూసి గర్వపడుతున్నామని అన్నారు. రాజధాని లేకపోతే మనం ఏమీ చేయలేమని గ్రహించానని చెప్పారు. హైదరాబాద్‌ను మించిన మహానగరాన్ని నిర్మించాలని తాము సంకల్పించామని అన్నారు. సింగపూర్ మోస్ట్‌లివబుల్ కంట్రీ.. అందుకే ఆ మోడల్ తీసుకున్నామని వెల్లడించారు. గ్రాఫిక్స్ అంటూ అమరావతిని వైసీపీ నేతలు ఎగతాళి చేశారని ధ్వజమెత్తారు. ఇప్పుడొచ్చి చూడండి.. అమరావతి ఎలా ఉందో అని ప్రశ్నించారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కూడా ఆనాడు అమరావతిని రాజధానిగా అంగీకరించారని ప్రస్తావించారు. 5,10 కాదు.. 40వేల ఎకరాలు కావాలని జగన్ చెప్పారన్నారు. ఆ తర్వాత రాజధాని పేరుతో జగన్ మూడు ముక్కలాట ఆడారని విమర్శించారు. జగన్ హయాంలో రాజధాని రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని అన్నారు. చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయేది.. అమరావతి ఉద్యమమని తెలిపారు. అమరావతి చరిత్రలో రైతులకు ప్రత్యేక స్థానం ఉంటుందని అన్నారు. దేవతల రాజధాని అమరావతి.. ఇక్కడ ఇబ్బందులు ఉండవని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. సీడ్ యాక్సెస్ రహదారి ద్వారా రాజధానికి రాజమార్గం ఏర్పాటు చేసుకున్నాం. అమరావతిని ఆపడం ఇక ఎవరితరం కాదు. నీటి సమస్యలేని ఏకైక రాజధాని అమరావతి. విద్యుత్ స్తంభాలు, వైర్లు కనిపించని ఆధునిక నగరమిది. గ్యాస్‌తో సహా అన్నీ భూగర్భం నుంచే వెళ్లే రాజధాని మన అమరావతి. ఇవాళ ప్రారంభించిన రోడ్డు చిన్న ట్రైలర్ మాత్రమే. రాష్ట్రాభివృద్ధి విజన్‌కు అమరావతి నగర నిర్మాణం మొట్ట మొదటి సక్సెస్. రాష్ట్రాభివృద్ధిలో మొదటి మెట్టు ఎక్కాం. రాజధానితో పాటు రాష్ట్రం అంతటా అభివృద్ధి కావాలన్నదే నా ఆకాంక్ష. హెల్తీ వెల్తీ హ్యాపీ కావాలన్నదే అందరి సంకల్పం కావాలి. అమరావతి నిర్మాణం చేసి చరిత్ర సృష్టిస్తున్నందుకు గర్వంగా ఉందని సీఎం అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రలుఉ పి.నారాయణ, నాదెండ్ల మనోహర్, తాడికొండ శాసనసభ్యుడు తెనాలి శ్రావణ్ కుమార్, ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్, ఎంపీ భాష్యం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# వేలం వెర్రిగా భూముల అమ్మకం

రాయదుర్గ్ పన్మక్త గ్రామంలోని సర్వే నం.83/1లో 10.63 ఎకరాల హెరిటేజ్ భూమిని ఆగస్టు 17, 21 తేదీల్లో వేలం వేయడానికి సిద్ధం కావడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. 2020లో ఇదే భూములపై రక్షణ కోరుతూ రేవంత్ కోర్టు మెట్లు ఎక్కారని గుర్తుచేశారు. ప్రతిపక్షంలో ఒక మాట.. అధికారంలోకి వచ్చిన తర్వాత మరో మాటనా అని ప్రశ్నించారు. హెరిటేజ్ భూములను కాపాడాల్సిన ప్రభుత్వం.. వాటినే వేలం వేసి అమ్మేందుకు ఎందుకు తొందరపడుతోందని నిలదీశారు. ఇదే సర్వే నంబర్‌లో గతంలో 6.2 ఎకరాలు సుమారు ఎకరాకు 237 కోట్ల చొప్పున వేలం వేస్తే, ఎస్‌బీఐ కోర్టుకు ఎక్కిందని... ప్రస్తుతం ఈ అంశం హైకోర్టు పరిధిలో ఉందని వెల్లడించారు. అయినా, అదే సర్వే నంబర్‌లో మరో 10.63 ఎకరాలను వేలం వేయడం వెనుక ఆంతర్యం ఏమిటని.. న్యాయ వ్యవస్థ అంటే గౌరవం లేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ భూమిపై అనేక వివాదాలు ఉన్నాయని.. భూమి ఎవరిదో తేల్చకుండా వేలం వేయడం ఎందుకన్నారు. భూమి ఎవరిదో తేల్చలేని ప్రభుత్వం.. భూమిని అమ్మడానికి మాత్రం ఎందుకు తొందరపడుతోందని అడిగారు. రూ.2,000 కోట్ల విలువైన హెరిటేజ్ భూములను అమ్మే హక్కు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎవరు ఇచ్చారంటూ మండిపడ్డారు. నాడు పీసీసీ అధ్యక్షుడిగా ప్రభుత్వ భూములను తెలంగాణ జాతి సంపదగా అభివర్ణించిన రేవంత్ రెడ్డి.. అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చారని..' ఇంచు ప్రభుత్వ భూమిని కూడా అమ్మబోము' అన్న హామీ ఏమైందని నిలదీశారు. అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వ భూములను అమ్మబోమని చెప్పిన రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాటలకు విలువ లేదా అని అన్నారు. భూముల వేలంపై రేవంత్ రెడ్డి వైఖరి చూస్తుంటే ఊసరవెల్లి కూడా సిగ్గుపడే పరిస్థితి వచ్చిందని విమర్శించారు. సుప్రీంకోర్టు కూడా ఆస్తిని పరిరక్షించడం, కొత్తగా ఆస్తి సృష్టించకుండా చూడాల్సిన అవసరాన్ని స్పష్టం చేసిందని హరీశ్ గుర్తుచేశారు. అలాంటి పరిస్థితుల్లో వివాదాస్పద భూమిని వేలం వేసి కొత్త హక్కులు సృష్టించడం ఏ విధమైన పరిపాలనా బాధ్యత అని ప్రశ్నించారు. ఆగస్టు 17, 21 తేదీల్లో జరగనున్న వేలాలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అలాగే సర్వే నం.83కు సంబంధించిన హెరిటేజ్, రెవెన్యూ, సర్వే, వక్ఫ్ రికార్డులన్నింటినీ బయటకు తీసి సమగ్రంగా విచారణ జరిపి, వాస్తవాలు నిగ్గు తేల్చాలన్నారు. హక్కులు, వివాదాలు తేలకముందే ఈ భూములను కొనుగోలు చేస్తే.. భవిష్యత్తులో న్యాయపరమైన సమస్యలు తప్పవని హెచ్చరించారు. భవిష్యత్ తరాలకు అందించాల్సిన విలువైన హెరిటేజ్ భూములను అమ్మాలని చూడటం దారుణమని మాజీ మంత్రి అన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారిలా కాకుండా.. రాష్ట్ర ముఖ్యమంత్రిగా వ్యవహరించాలని హితవుపలికారు. అనుముల బ్రదర్స్ ప్రయోజనాల కోసం కాదని.. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, తెలంగాణ ప్రయోజనాలను కాపాడే ముఖ్యమంత్రిగా ఉండాలని... లేదంటే చరిత్ర హీనుడిగా మిగిలిపోతారని హరీశ్ రావు లేఖలో పేర్కొన్నారు.

# ముగిసిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

### వందేమాతరం గీతాలాపనతో లోక్‌సభ వాయిదా

న్యూఢిల్లీ : పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ముగిశాయి. గురువారం ఉభయసభలు నిరవధి కంగా వాయిదా పడ్డాయి. లోక్‌సభ ప్రారంభమైన తర్వాత సభ్యులంతా కలిసి వందేమాతరం గేయాన్ని ఆలపించారు. ఈ సమావేశానికి ప్రధాని మోదీ, ప్రతిపక్ష నేత రాహుల్‌తోపాటు సభ్యులంతా హాజరయ్యారు. జాతీయ గేయంలోని ఆరు చరణాలను పూర్తిగా ఆలపించిన అనంతరం సభను నిరవధికంగా వాయిదా వేశారు. దీంతో వర్షాకాల సమావేశాలు ముగిసినట్లు అయింది. వందేమాతరం గేయాన్ని చట్టపరంగా రక్షణ కల్పించే శాసనానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేసిన కొన్ని రోజులకే లోక్‌సభలో ఈ పరిణామం చోటు చేసుకుంది. జాతీయ గేయాన్ని ఆలపించడాన్ని ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవడం లేదా నిరోధించడం శిక్షార్హమైన నేరమని ఈ చట్టం స్పష్టం చేస్తోంది. తద్వారా దీనికి జాతీయ గీతం 'జనగణమన'తో సమానమైన చట్టపరమైన హోదా లభించిన్లటైంది. రాష్ట్రపతి రాక, త్రివర్ణ పతాకావిష్కరణ, గవర్నర్ల ప్రసంగం వంటి సందర్భాల్లో వందేమాతరంలోని ఆరు చరణాలను ఆలపించాలని జనవరి 28వ తేదీన కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జులై 20వ తేదీన ప్రారంభమై.. ఆగస్టు 13వ తేదీతో ముగిశాయి. నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ కేంద్రం విద్య శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతోపాటు విద్యావ్యవస్థలో సంస్కరణలను డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆందోళన చేపట్టింది. జులై 20వ తేదీన వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన నేపథ్యంలో ఆ రోజు చలో పార్లమెంట్ యాత్రకు సీజేపీ పిలుపునిచ్చింది. ఈ ఘటనతో చోటు చేసుకున్న తీవ్ర పరిణామాలతో మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. అదే విధంగా పార్లమెంట్ సమావేశాల్లో యాంటీ పేపర్ లీక్ బిల్లుతోపాటు పలు బిల్లులు ఆమోదం పొందాయి. అయితే.. ఢిల్లీలో యువతపై జరిగిన లాఠీఛార్జ్‌కు ఎవరు ఆదేశాలు ఇచ్చారో సభలో ప్రకటన చేయాలంటూ కేంద్రాన్ని ప్రతిపక్షం కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో సభలో దాదాపుగా వాయిదాల పర్వం కొనసాగింది. చివరకు ఈ రోజు ఉభయ సభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి.

# ఇసిఐ పేరుతో ఫేక్ మెసేజ్‌లు

హైదరాబాద్,ఆగస్ట్13 : ఈసీఐ పేరుతో ఓటర్లకు మోసపూరిత సందేశాలను సైబర్ మోసగాళ్లు పంపిస్తున్నారని తెలంగాణ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. ఓటర్ వివరాలు సరిపోలడం లేదంటూ ఫేక్ మెసేజ్‌లు వస్తున్నాయని.. వీటిపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. దరఖాస్తు తిరస్కరణ పేరుతో రూ.5లు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారని అన్నారు. వాట్సాప్ లింక్ ద్వారా దరఖాస్తు నింపాలని కోరుతున్నారని తెలిపారు. బ్యాంక్ వివరాలు, పాస్‌వర్డ్, అ÷ం, ం÷ఓ ఖఎఔలను సైబర్ నేరగాళ్లు అడుగుతున్నారని సీఈవో తెలిపారు. ఇలాంటి మెసేజ్‌లు ఇఅఎ, తెలంగాణ అఇక్ష కార్యాలయం నుంచి రావని స్పష్టం చేశారు. ఫేక్ కాల్స్, మెసేజ్‌లకు స్పందించొద్దని సూచించారు. మోసపూరిత సందేశాలు వస్తే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సీఈవో సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు.

## త్వరలో కోల్ ఎక్స్ఛేంజ్ ఏర్పాటు

పెరుగుదలను నియంత్రించే చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మినరల్స్ అంశంలో రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం పెత్తనం చేయబోదని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. పన్నులు, సెస్‌ల విషయంలోనూ కేంద్రం జోక్యం చేసుకోదని తెలిపారు. రాష్ట్రాలకు ఉన్న హక్కులు, అధికారాలను గౌరవిస్తూనే ఖనిజ రంగ అభివృద్ధికి కేంద్రం సహకరిస్తుందని చెప్పారు. దేశంలో మినరల్స్ ఉత్పత్తిని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందని కిషన్‌రెడ్డి తెలిపారు.

# అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌కు మద్దతు

దానికి కొనసాగింపుగా గురువారం కూడా వర్ని మండలం జాకోరా గ్రామంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే... మరోసారి హాట్ కామెంట్స్ చేశారు. ఇటీవల తాను చేసిన వ్యాఖ్యల్లో ఎలాంటి రాజకీయం దురుద్దేశం లేదని స్పష్టం చేశారు. తనకు స్వార్థం ఉందంటూ బుద్ధిహీనులు ప్రచారం చేస్తున్నారని, స్వార్థం ఉందని నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్ విసిరారు. 'నా మాటల వెనుక రాజకీయం, రహస్యం లేదు. నేను డబ్బులకు అమ్ముడుపోయే వ్యక్తిని కాదు. నాకు ఎలాంటి స్వార్థం లేదు. ప్రజల కోసమే నా జీవితం' అని స్పష్టం చేశారు. పోరాటం చేస్తా తప్ప, తల వంచే రాజకీయం చేయనని స్పష్టం చేశారు. ప్రజల కోసం, నియోజకవర్గ అభివృద్ధి కోసం ఏమైనా చేస్తానన్నారు. ఎమ్మెల్యేకు ప్రభుత్వ సహకారం కావాలని.. ప్రభుత్వ సహకారం లేకుంటే ఏమి చేయలేమని పోచారం శ్రీనివాస రెడ్డి వెల్లడించారు.

# రాజధానితోనే రాష్ట్రానికి ఆదాయం

సీడ్ యాక్సెస్ రోడ్ రెండో దశను, బకింగ్‌హామ్ కెనాల్‌పై స్టీల్ బ్రిడ్జిను సీఎం చంద్రబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణకు వచ్చే ఆదాయం హైదరాబాద్ నుంచే ఎక్కువగా వస్తోందన్నారు. అలాగే మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడులకు ముంబాయి, బెంగళూరు, చెన్నైల ద్వారా ఆదాయం వస్తోందని తెలిపారు. ఆర్థిక రాజధాని నిర్మాణానికి మాస్టర్ ప్లాన్‌ను సింగపూర్ ప్రభుత్వం ఉచితంగా అందించిందని చెప్పుకొచ్చారు. ఐకానిక్ భవనాల నిర్మాణం కోసం నార్మల్ ఫాస్టర్స్ లండన్ వారిని సంప్రదించినట్లు తెలిపారు. కృష్ణానది ఒడ్డున అమరావతి కడితే అన్ని జిల్లాలకు సమన్యాయం జరుగుతుందని వెల్లడించారు. అమరావతి.. శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు మధ్యలో ఉంటుందని మంత్రి తెలిపారు. రైలు, రోడ్డు మార్గం అందుబాటులో ఉందన్నారు. 2015 జనవరిలో ల్యాండ్ పూలింగ్ నోటిఫికేషన్ ఇచ్చామని.. కేవలం 58 రోజుల్లో ఒక్క లిటిగేషన్ కూడా లేకుండా 34,000 ఎకరాలను రైతులు ఇచ్చారని వివరించారు. అమరావతిలో పనులు ప్రారంభించడం, టెండర్లు పిలవడం, ఇతర పనులు చేపట్టడానికి మూడున్నర సంవత్సరాలు పట్టిందన్నారు. మిగిలిన సంవత్సరం 6 నెలల్లో పదివేల కోట్లు అమరావతి కోసం ఖర్చు చేశామని అన్నారు. గంతలో వైసీపీ అధికారంలోకి వచ్చి మూడు రాజధానులు అంటూ మూడు ముక్కలాట ఆడిందని మంత్రి విమర్శించారు. అమరావతి నిర్మాణాన్ని ఎక్కడికక్కడ ఆపేసిందన్నారు. నిర్మాణ సంస్థల ఒప్పందాలను క్లోజ్ చేయకుండా వదిలేసిందని.. దీంతో కూటమి ప్రభుత్వం తిరిగి వచ్చాక ఆయా సంస్థలతో ఒప్పందాలను టెక్నికల్‌గా క్లోజ్ చేసి తిరిగి టెండర్లు పిలవాల్సి వచ్చిందని అన్నారు. గతంలో ఉన్న పనుల నాణ్యతను ఐఐటీ చెన్నై, హైదరాబాద్ వారితో పరీక్షింప చేసి పనులను ప్రారంభించామన్నారు. సీడ్ యాక్సిస్ రోడ్‌ను ఆనుకుని ఎలక్ట్రికల్, గ్యాస్, టెలిఫోన్ వాటర్ వంటివి అండర్ గ్రౌండ్‌లో ఉండేలా ప్లాన్ చేశామన్నారు. వైసీపీ ఓ గొడ్డలి పార్టీగా రైతులను రెచ్చగొట్టే ప్రయత్నం చేసిందని.. అయినా రైతులు అమరావతి నిర్మాణానికి సహకరించారని తెలిపారు. ఇలాంటి అమరావతి నిర్మాణంలో పాలుపంచుకునే అవకాశం కల్పించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు నారాయణ ధన్యవాదాలు తెలియజేశారు.

## అప్పు తీర్చనందుకు బాలికను తీసుకెళ్లే యత్నం

### కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసుల కేసు

హైదరాబాద్,ఆగస్ట్13 : హైదరాబాద్‌లో బాకీ తీర్చలేదని రెండేళ్ల బాలికను కిడ్నాప్‌నకు ఓ వ్యక్తి యత్నించాడు. అప్పు తీర్చలేదనే కోపంతో బాలికను తీసుకెళ్లేందుకు ఓ వ్యక్తి ప్రయత్నించాడు. అయితే బాలిక కుటుంబ సభ్యులు పోలీసులకు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. హనుమాన్ నగర్‌లో అద్దె ఇంట్లో ఈ కుటుంబం నివాసం ఉంటోంది. మానికేశ్వరీ నగర్‌లో నివాసం ఉన్న సమయంలో పరిచయస్తుడి వద్ద రూ.30 వేల అప్పును బాలిక కుటుంబ సభ్యులు తీసుకున్నారు. అప్పు తిరిగి చెల్లించకపోవడంతో బుధవారం ఇంటికి ఆ వ్యక్తి వచ్చాడు. ఈ క్రమంలో డబ్బులు ఇవ్వాలంటూ కుటుంబ సభ్యులతో సదరు వ్యక్తి వాగ్వాదానికి దిగాడు. డబ్బులు ఇచ్చే వరకు మీ కుమార్తెను తీసుకెళ్తానంటూ అతడు బెదిరించాడు. రెండేళ్ల బాలికను తీసుకెళ్లేందుకు ప్రయత్నించిన వ్యక్తిపై బాధిత కుటుంబం పోలీసులకు ఫోన్ చేసి ఫిర్యాదు చేసింది. సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. ఆ బాలికను తీసుకెళ్లేందుకు ప్రయత్నించిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నారు.

# ఆర్మూర్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

### టూరిస్ట్ బస్సును ఢీకొన్న లారీ: ఇద్దరు మృతి

నిజామాబాద్,ఆగస్ట్13 : నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మండల పరిధిలోని గోవింద్‌పేట్ బ్రిడ్జి సమీపంలో జరిగిన ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందగా.. మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా కిన్వట్ ప్రాంతానికి చెందిన భక్తులు రెండు టూరిస్ట్ బస్సుల్లో హైదరాబాద్ ముచ్చింతల్‌లోని సమతామూర్తి స్ఫూర్తి కేంద్రానికి బయల్దేరారు. ఈ క్రమంలో గోవింద్‌పేట్ బ్రిడ్జి సమీపానికి రాగానే ఓ బస్సు పంక్చర్ అయింది. దీంతో బస్సును హైవేపై నిలిపారు. బస్సులోని కొంతమంది ప్రయాణికులు కిందికి దిగి రహదారి మధ్యలోని డివైడర్‌పై కూర్చున్నారు. కాసేపటి తర్వాత వెనుక నుంచి వచ్చిన ఓ లారీ.. ఆగి ఉన్న బస్సును బలంగా ఢీకొట్టింది. దీంతో బస్సు ముందుకు కదిలి డివైడర్‌పై కూర్చున్న ప్రయాణికులపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో సుజాత (54), మాధవి (47) అక్కడికక్కడే మృతిచెందారు. మరో ఇద్దరు మహిళలు సునీత, చిటక్కకు తీవ్రగాయాలు కావడంతో వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనాస్థలాన్ని నిజామాబాద్ సీపీ పి.సాయిచైతన్య పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరును స్థానిక పోలీసులను అడిగి తెలుసుకున్నారు.

## 30వేలు లంచం తీసుకుంటూ ఎసిబికి చిక్కిన ఆర్ఐ

కరీంనగర్,ఆగస్ట్13 : బీర్ పూర్ మండల కేంద్రంలో ఏసీబీ డీఎస్పీ గట్ల మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం బీర్పూర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు దాడి నిర్వహించారు. ఓ బాధితురాలి నుంచి రూ.30 వేల లంచం తీసుకుంటున్న గిరిధావర్(ఆర్) రాహుల్‌ను ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ ఘటనపై ఏసీబీ అధికారులు విచారణ చేపట్టారు. కాగా ఆర్ఐ రాహుల్ గతంలో కథలాపూర్ ఆర్ఐ-1 గా విధులు నిర్వహించగా సర్టిఫికెట్ల జారీలో విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయడంతో బీర్పూర్ కు బదిలీ చేశారు. కాగా ఏసీబీ అధికారుల విచారణ కొనసాగుతోంది.

## యూరియా యాప్‌పై రైతుల ఆగ్రహం

### సింగిల్ విండోలో అధికారులను బంధించి నిరసన

కరీంనగర్,ఆగస్ట్13 : గంభీరావుపేట మండలంలోని కొత్తపల్లి సింగిల్ విండో కార్యాలయానికి రైతులు గురువారం తాళం వేసి అందులో సిబ్బందిని బంధించారు. యూరియా యాప్ తో రైతులకు ప్రభుత్వం చుక్కలు చూపిస్తున్నాదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ సిబ్బందిని బంధించి సింగిల్ విండో కార్యాలయాని కి తాళం వేశారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు కొత్తపల్లి సింగిల్ విండో లో 400 బస్తాల యూరియా బ్యాగ్ లు అందుబాటులో ఉంటాయని అధికారులు సందేశం అందించారు. యాప్ టెక్నికల్ సమస్య కారణంగా ఓపెన్ కాక పోవడంతో అన్నదాతలు ముకుమ్మడిగా సింగిల్ విండో కార్యాలయం దగ్గరికి దూసుక వచ్చి ఆందోళనకు దిగారు. యాప్ లో టెక్నికల్ సమస్య ఉందని సిబ్బంది పొంతన లేని సమాచారం ఇవ్వడంతో వారిని కార్యాలయంలో బంధించి తాళం వేసి ఎదుట ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు సుంకోజి శ్రీనివాస్, గ్రామ రైతులు ఉన్నారు.

## మనవడి జ్ఞాపకార్థం పాఠశాలలో వంటగది నిర్మాణం

ఖమ్మం,ఆగస్ట్13 : ఇటీవల మరణించిన తమ మనుమడి జ్ఞాపకార్థం తాత- నానమ్మలు పాఠశాలకు వంటగది నిర్మాణం చేపట్టి అందజేసారు. ఈ సంఘటన గురువారం ఖమ్మం రూరల్ మండలంలో చోటుచేసుకుంది. విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఎం.వెంకటాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.70 వేల వ్యయంతో వంట గదిని నిర్మించి వితరణగా అందించారు. గ్రామ మాజీ సర్పంచ్ గుర్రం అచ్చయ్య ధనమ్మ మనవడు యడ్లపల్లి సందీప్ ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందాడు. అతడి జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు పాఠశాలకు వంటగదిని నిర్మించి అందించారు. మాజీ సర్పంచ్ గుర్రం అచ్చయ్య మాట్లాడుతూ.. సందీప్ జ్ఞాపకార్థం విద్యార్థులకు ఉపయోగపడే సేవా కార్యక్రమం చేపట్టడం సంతృప్తినిచ్చిందన్నారు. ప్రతి నెల విద్యార్థులకు వివిధ రకాల అంశాలపై వ్యాసరచన, ఉపన్యాసం, క్విజ్ మొదలగు పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు రూ.1,500 అందించడం జరుగుతుందన్నారు. ప్రధానోపాధ్యాయుడు జి. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ఇదే పాఠశాలలో పనిచేసి పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయురాలు కృపాభాయి విద్యార్థుల భోజన సౌకర్యం కోసం రూ.25 వేల విలువైన బల్లాలను అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వేగినాటి విజయ్‌కుమార్, ఉప సర్పంచ్ కొళ్లపూడి సుమతి ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## వేటగాళ్లు అమర్చిన విద్యుత్ తీగలకు అటవీ ఉద్యోగి బలి

భద్రాద్రి కొత్తగూడెం,ఆగస్ట్13 : వేటగాళ్లు అమర్చిన విద్యుత్ తీగలు తగిలి విధి నిర్వహణలో చెరువుసింగారం వెస్ట్ బీట్ ఆఫీసర్ బానోత్ నవీన్ ప్రాణాలు కోల్పోయారని ఈ ఘటనను అటవీ శాఖ అత్యంత సీరియస్ గా తీసుకుందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అటవీ శాఖ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్ అన్నారు. గురువారం చెరువు సింగారం బీట్ పరిధిలోని నకిరిపేట అటవీప్రాంతాన్ని ఆయన అటవీ అధికారులతో కలిసి పరిశీలించారు. అటవీ సిబ్బంది ప్రాణాలను సైతం ప్రమాదంలోకి నెట్టే ఇలాంటి అక్రమ చర్యలను ఎలాంటి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు.

# తెలంగాణను దోచుకోవడంలో బిఆర్ఎస్‌తో పోటీ

### కాంగ్రెస్ తీరుపై మండిపడ్డ ఎంపి రఘునందన్ రావు

### యూనిటీమాల్ ఒప్పందాలపై విచారణ జరగాలని డిమాండ్



న్యూఢిల్లీ : తెలంగాణలో ప్రజల సొమ్ము దోచుకోవడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పోటీ పడుతున్నాయని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ఆరోపించారు. బీఆర్ఎస్ పదేళ్ల అవినీతిని మించి కాంగ్రెస్ దోచుకోవాలని చూస్తోందని విమర్శించారు. ఈ రెండు పార్టీలు ఒకే నాణెళినికి ఇరువైపులా ఉన్నటువంటివని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా యూనిటీ మాల్ పేరుతో జరిగిన ఒప్పందంపై సమగ్ర విచారణ జరపాలని ఎంపీ డిమాండ్ చేశారు. కేంద్రం ఇచ్చిన రూ.202 కోట్లతో యూనిటీ మాల్ నిర్మించాలని నిర్ణయించారని ఎంపీ రఘునందర్ రావు అన్నారు. అందుకు తెలంగాణ ప్రభుత్వం ఆరు ఎకరాలకు పైగా భూమి ఇచ్చిందన్నారు. అయితే, ఈ ఒప్పందంలో అవినీతి జరిగిందన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ఆరోపణలపై విచారణ జరగాలని ఎంపీ రఘునందన్ రావు స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పరస్పరం ఆరోపణలు చేసుకుంటూ ప్రజల దృష్టిని మళ్లిస్తున్నాయని రఘునందన్ రావు విమర్శించారు. వీళ్లిద్దరూ అవినీతిలో అన్నదమ్ములంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఈ సందర్భంగా తెలంగాణలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం రావాలని ప్రజలకు బీజేపీ విజ్ఞప్తి చేస్తోందన్నారు. హైదరాబాద్‌లో భూముల విలువ ఎకరాకు వందల కోట్లకు చేరిందని, ప్రజల ఆస్తులను విక్రయించే హక్కు ప్రభుత్వాలకు లేదని ఎంపీ తేల్చి చెప్పారు. ప్రజల ఆస్తులకు ప్రభుత్వాలు కస్టోడియన్లుగా ఉండాలని, అంతేకానీ యజమానులుగా వ్యవహరించొద్దని ఆయన పేర్కొన్నారు. కేటీఆర్ తప్పు చేస్తే విచారణ జరిగినప్పుడు, కాంగ్రెస్ తప్పు చేస్తే విచారణ ఎందుకు ఉండకూడదని ప్రశ్నించారు. 2018లో బీఆర్ఎస్ హయాంలో 10 ఎకరాల భూమిని ప్రైవేట్ సంస్థకు కేటాయించారని, దానిపైనా విచారణ జరగాలన్నారు. ఈ రెండు భూకేటాయింపు ఒప్పందాలపై సమదృష్టితో దర్యాప్తు జరపాలని రఘునందన్ డిమాండ్ చేశారు. యూనిటీ మాల్, గత బీఆర్ఎస్ భూకేటాయింపులపై కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ కోరుతూ కేంద్ర విజిలెన్స్ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు ఎంపీ చెప్పుకొచ్చారు. అలాగే, కాళేశ్వరం ప్రాజెక్టుపై డీపీఆర్ నుంచి చివరి చెల్లింపు వరకు సీబీఐ విచారణ జరపాలన్నారు. కేవలం మూడు బ్యారేజీలపై కాకుండా మొత్తం ప్రాజెక్టుపై దర్యాప్తు చేయాలన్నారు. కాళేశ్వరం మొత్తం ప్రాజెక్టుపై విచారణ జరిపించాలని కేంద్రానికి సీఎం రేవంత్ రెడ్డి లేఖ రాయాలని ఎంపీ సూచించారు. దానిపై కేంద్ర హోంమంత్రిని కలిసి దర్యాప్తు జరిగేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. మరోవైపు, రింగ్ రోడ్డు, ఫార్ములా-ఈ రేస్, కాళేశ్వరం అంశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం మాట మార్చిందని ఎంపీ మండిపడ్డారు.

## పంద్రాగస్టు ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలి

### ప్రోటోకాల్‌ను తప్పక పాటించాలి

### విద్యుత్, త్రాగునీరు, ఇతర సదుపాయాలు సమకూర్చాలి

### అధికారులు సమన్వయంతో కలిసి పనిచేయాలి

### అధికారులకు దిశానిర్దేశం చేసిన స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్

హైదరాబాద్,ఆగస్టు13 : రవాణా, ఆర్ అండ్ బి శాఖల స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్ పంద్రాగస్టు స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. శనివారం గోల్కొండ కోటలో నిర్వహించనున్న స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు జరిగే ప్రాంతాన్ని గురువారం సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి ఆయన పరిశీలించి, ఏర్పాట్లపై దిశానిర్దేశర చేశారు. వర్షాకాలం నేపథ్యంలో కార్యక్రమంలో ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా వాటర్‌ప్రూఫ్ షామియానాలు, వాటర్‌ప్రూఫ్ జనరేటర్, నిరంతర విద్యుత్ సరఫరా, త్రాగునీరు, బారికేడింగ్, గ్యాలరీలు, వచ్చే అతిథులు, విద్యార్థులు, ప్రజల సీటింగ్ సామర్థ్యం, సౌండ్ సిస్టమ్ తదితర ఏర్పాట్లను ఉన్నతస్థాయి అధికారులతో కలిసి ఆయన సమీక్షించారు. కార్యక్రమ నిర్వహణలో ఎక్కడా ప్రోటోకాల్‌కు ఇబ్బంది కలగకుండా అధికారులు నిబద్ధతతో వ్యవహరించాలని ఆయన సూచించారు. అదేవిధంగా స్టేజీ ఏర్పాటుతో పాటు సుందరీకరణ పనులను వేగవంతంగా చేపట్టాలని సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నందున ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు. ప్రతి వాహనంలో వచ్చే పిల్లలకు ఒక లైజనింగ్ అధికారి తప్పనిసరిగా ఉండేలా చూడాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. పంద్రాగస్టు రోజున గౌరవ ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు కార్యక్రమానికి హాజరుకానున్న నేపథ్యంలో ఏర్పాట్లు ఘనంగా ఉండాలని, ఎక్కడా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లను పక్కాగా, వేగవంతంగా పూర్తి చేయాలని ఆయన సూచించారు. ముఖ్యమంత్రికి సమర్పించే పోలీసుల గౌరవ వందనం, పోలీస్ కవాతును ఆయన ఉన్నతాధికారులతో కలిసి వీక్షించారు. కార్యక్రమంలో మైనారిటీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్, సమాచార శాఖ కమిషనర్ జి. ముకుంద రెడ్డి, అడిషనల్ డీజీపీ సంజయ్ కుమార్ జైన్, స్వాతి లక్రా, సీపీ సజ్జనార్, అడిషనల్ సీపీ తప్సీర్ ఇక్బాల్, ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్, ఇంటెలిజెన్స్ ఓఎస్డీ కమలాసన్ రెడ్డి, అడిషనల్ కలెక్టర్ జితేందర్ రెడ్డి, సమాచార శాఖ అడిషనల్ డైరెక్టర్ డి.ఎస్. జగన్, చీఫ్ ఇంజనీర్ రాధా కిషన్, రీజినల్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ జయ రామమూర్తి, ఆర్ అండ్ బి చీఫ్ ఇంజనీర్ రాజేశ్వర్ రెడ్డి, డిస్టిక్ట్ ÷ర్ ఆఫీసర్ వెంకన్న, ఆర్డీవో రామకృష్ణ, డీఈఓ యాదయ్య, ఆర్ అండ్ బి, విద్యుత్, వైద్య, జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రాజెక్టుల అనుమతుల రద్దుకు కుట్ర

### జీఆర్ఎంబీ ఎజెండా నుంచి ఈ అంశాన్ని తొలగించాలి

### ఎంపిలంతా ప్రధాని మోడీని కలసి వివరించాలి

### మాజీ ఎంపి వినోద్ కుమార్ డిమాండ్

రాజన్న సిరిసిల్ల,ఆగస్ట్13 : తెలంగాణ ప్రాజెక్టుల అనుమతుల రద్దు కుట్రను అడ్డుకోవాలని, జీఆర్ఎంబీ ఎజెండా నుంచి అంశాన్ని వెంటనే తొలగించాలని బీఆర్ఎస్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. తెలంగాణ హక్కులపై భంగం కలుగుతుంటే బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు మౌనంగా ఎందుకుంటున్నారని ప్రశ్నించారు. సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య తదితరులతో కలసి మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 18న హైదరాబాద్‌లో జరగనున్న గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు ఎజెండా నుంచి తెలంగాణ ప్రాజెక్టుల అనుమతుల రద్దుకు సంబంధించిన అంశాన్ని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలోని పలు ప్రాజెక్టుల అనుమతులను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించడం, ఆ అంశాన్ని జీఆర్ఎంబీ సమావేశం ఎజెండాలో చేర్చడం తీవ్ర ఆందోళన కలిగించే విషయమని వినోద్‌కుమార్ అన్నారు. ప్రాజెక్టుల అనుమతులు రద్దు చేస్తే తెలంగాణ రైతాంగం, సాగునీటి రంగం, రాష్ట్ర భవిష్యత్‌పై తీవ్ర ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. తెలంగాణ ఎంపీలందరూ వెంటనే ఢిల్లీకి వెళ్లి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిసి , తెలంగాణ ప్రాజెక్టుల అనుమతుల రద్దు అంశాన్ని తొలగించేలా ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ వేదికగా కూడా ఈ అంశంపై తెలంగాణ తరపున గట్టిగా పోరాడాలని కోరారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిపై విమర్శలు జీఆర్ఎంబీ బీఆర్ఎస్ పార్టీ బహిష్కరించాలని కోరుతోందంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని వినోద్‌కుమార్ విమర్శించారు. జీఆర్ఎంబీ సమావేశాన్ని బహిష్కరించాలన్నది బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ కాదని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రాజెక్టుల అనుమతులను రద్దు చేస్తే రాష్ట్రంలో తీవ్ర విపత్కర పరిస్థితులు తలెత్తే ప్రమాదం ఉందని వినోద్‌కుమార్ హెచ్చరించారు.

## ఆదర్శంగా నిలిచిన రాజ్యసభ ఎంపి విజయ్

### తొలి వేతనాన్ని ఆర్మీ జవాన్ల సంక్షేమానికి అందచేత

న్యూఢిల్లీ,ఆగస్ట్13 : రాజ్యసభ సభ్యులు చింతకాయల విజయ్ గొప్ప మనసును చాటుకుని అందరికీ ఆదర్శంగా నిలిచారు. అమరులైన ఆర్మీ జవాన్ల కుటుంబాలకు ఎంపీ అండగా నిలిచారు. ఎంపీగా తనకొచ్చిన మొదటి నెల జీతం మూడు లక్షల రూపాయలను దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన అమరవీరులైన ఆర్మీ జవాన్ల కుటుంబాల సంక్షేమం కోసం విరాళంగా అందించారు. ఈ విరాళం చెక్కును భారత కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు విజయ్ స్వయంగా అందజేశారు. దేశం కోసం అహర్నిశలు శ్రమిస్తూ, ప్రాణత్యాగాలు చేసిన సైనికుల కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని.. అందులో భాగంగానే ఈ చిరు సాయం చేసినట్లు విజయ్ స్పష్టం చేశారు. పదవి చేపట్టిన వెంటనే తొలి వేతనాన్ని సైనికుల కుటుంబాల కోసం వెచ్చించడం పట్ల విజయ్‌ను పలువురు ప్రశంసిస్తున్నారు.

## ఆబిడ్స్‌లో మహిళపై దూసుకెళ్లిన కారు

హైదరాబాద్,ఆగస్ట్13 : నగరంలోని అబిడ్స్‌లో ఓ కారు బీభత్సం సృష్టించింది. నడుచుకుంటూ ఇంటికి వెళ్తున్న ఓ మహిళను కారు ఢీకొట్టడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. గన్‌ఫౌండ్రీ ఎస్‌బీఐ బ్యాంకులో హౌస్‌కీపింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న సునీత.. విధులు ముగించుకుని ఇంటికి నడుచుకుంటూ వెళు ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ క్రమంలో సినిమా నిర్మాత డ్రైవర్ మహానంద నడుపుతున్న కారు ఒక్కసారిగా ఆమెపైకి దూసుకెళ్లినట్లు బాధితురాలి కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రమాదంలో సునీత కాలుకు ఫ్రాక్చర్ కావడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఆమెను సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదానికి కారణమైన కారు యజమాని.. ఫిల్మ్ ప్రొడ్యూసర్ బొమ్మకు మురళి యజమాని అని బాధితురాలి కుటుంబ సభ్యులు తెలిపారు. ఘటన అనంతరం ఆయనకు ఫోన్ చేసి సునీత చికిత్సకు అయ్యే ఖర్చులను భరించాలని కోరినట్లు చెప్పారు. అయితే డబ్బులు ఇవ్వనని దురుసుగా సమాధానం ఇచ్చినట్లు వారు వాపోయారు. వారి ఫిర్యాదు మేరకు.. అబిడ్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రజలకు జవాబుదారులుగా అధికారులు

### అంకిత భావంతో ప్రజల సమస్యలను పరిష్కరించాలి

### సీఎం రేవంత్ రెడ్డి నమ్మకాన్ని ఎం.పీ.డీ.వో.లు నిలబెట్టుకోవాలి

### రాష్ట్ర స్థాయి ప్రజావాణి ఇంచార్జ్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి

హైదరాబాద్,ఆగస్ట్13 : ప్రజలకు జవాబుదారులం అనే విషయాన్ని అధికారులు ఎట్టి పరిస్థితుల్లోనూ విస్మరించవద్దని, ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రతి అధికారి అంకితభావం, బాధ్యతతో విధులు నిర్వహించాలని రాష్ట్ర స్థాయి ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి అన్నారు. గురువారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో నిర్వహించిన మండల నోడల్ అధికారులైన ఎంపీడీవోల శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం గ్రామాల నుంచి వచ్చే ప్రజలతో ఓపికగా మాట్లాడి వారి నుంచి దరఖాస్తులు స్వీకరించి వాటిని క్షేత్రస్థాయిలోనే పరిష్కరించే గురుతర బాధ్యత మండల నోడల్ అధికారి, వివిధ శాఖల మండల అధికారులపై ఉందని పేర్కొన్నారు. ప్రజలే దేవుళ్ళని వారికి సేవలు అందించడం అధికారుల కనీస బాధ్యత అని చిన్నారెడ్డి గుర్తు చేశారు. ఎంపీడీవో లకు మండల ప్రజావాణి నోడల్ అధికారిగా ఎంతో నమ్మకంగా నియమించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విశ్వాసాన్ని వారు నిలుపుకోవాలని, ప్రజావాణి ద్వారా సమస్యలను పరిష్కరించి ప్రజల మన్ననలు పొందాలని చిన్నారెడ్డి పిలుపునిచ్చారు. ప్రజావాణి పేదవారి సమస్యల పరిష్కార వేదికగా మారాలని ఆయన అన్నారు. రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తున్న సీఎం ప్రజావాణి 75శాతం సక్సెస్ రేటును సాధించిందని, ఇదే స్థాయిలో సమస్యలకు పరిష్కరిస్తూ జిల్లా, మండల స్థాయి ప్రజావాణి అదుకారులు కృషి చేయాలని చిన్నారెడ్డి సూచించారు. మండల స్థాయి ప్రజావాణిలో బాధ్యతలు నిర్వహించే అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని, విధి నిర్వహణలో ఎలాంటి లోపం లేకుండా చర్యలు తీసుకోవాలని చిన్నారెడ్డి పేర్కొన్నారు. ఈనెల 17 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా తొలిసారిగా ప్రారంభం కానున్న మండలస్థాయి ప్రజావాణి కార్యమాలకు అన్ని ఏర్పాట్లు ముందస్తుగా పూర్తి చేసుకుని సిద్ధంగా ఉండాలని చిన్నారెడ్డి సూచించారు. సీఎం ప్రజావాణి మాదిరిగానే మండల స్థాయిలోనూ శాఖల వారీగా డెస్క్ లు, ప్రజల దరఖాస్తులు రాసేందుకు హెల్ప్ డెస్క్ లు, వైద్య సేవలు, తాగు నీరు ఏర్పాట్లు చేసుకోవాలని, వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని చిన్నారెడ్డి అన్నారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల కమిషనర్ దివ్య దేవరాజన్ మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చే ప్రజల సమస్యలను ఓపికగా వింటే సగం సమస్య పరిష్కారం అయినట్లేనని, సమస్యల పరిష్కారం కోసం గట్టి చర్యలు చేపట్టాలని సూచించారు. శిక్షణ కార్యక్రమంలో భాగంగా మండల స్థాయిలో ప్రజావాణి నిర్వహణకు తీసుకోవాల్సిన అనేక అంశాలను పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ద్వారా నిపుణులు వివరించారు. కార్యక్రమంలో ప్రణాళిక శాఖ డైరెక్టర్ షేక్ మీరా, సీఎం ప్రజావాణి ఏ.సీ.పీ. ఉమేందర్, డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ అధికారి సుశీల, సీఎం ప్రజావాణి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఖేలో ఇండియా క్రీడల నిర్వహణ

### కేంద్ర క్రీడాశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయతో వాకిటి శ్రీహరి

న్యూఢిల్లీ,ఆగస్టు13 : కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి శ్రీ మన్‌సుఖ్ మాండవీయను తెలంగాణ క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి గురువారం న్యూఢిల్లీలో కలిశారు. ఆయనతోపాటు తెలంగాణ ప్రభుత్వ క్రీడా వ్యవహారాల సలహాదారు శ్రీ ఏపీ జితేందర్ రెడ్డి, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శ్రీ కె. శివసేన రెడ్డి ఉన్నారు. తెలంగాణకు ఖేలో ఇండియా క్రీడలను కేటాయించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర క్రీడల శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయకు రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి వాకిటి శ్రీహరి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాసిన ఆహ్వాన లేఖను కేంద్ర మంత్రి మాండవీయకు అందజేశారు. డిసెంబర్ 11 నుంచి 22వ తేదీ వరకు 12 రోజులపాటు తెలంగాణలో ఖేలో ఇండియా క్రీడలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఖేలో ఇండియా క్రీడలను ఘనంగా, విజయవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేసిందని మంత్రి పేర్కొన్నారు. నిర్వహణలో ఎలాంటి లోపాలు, విమర్శలకు తావులేకుండా అత్యున్నత ప్రమాణాలతో పోటీలను నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమయం తీసుకుని, ఖేలో ఇండియా క్రీడల ప్రారంభోత్సవానికి హాజరుకావాల్సిందిగా ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి స్వయంగా ఆహ్వానిస్తారని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం నూతన క్రీడా విధానాన్ని తీసుకొచ్చి, విప్లవాత్మక నిర్ణయాలతో రాష్ట్రంలో క్రీడారంగాన్ని ముందుకు తీసుకెళ్తోందని మంత్రి వాకిటి శ్రీహరి చెప్పారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులకు ప్రాధాన్యం కల్పిస్తున్నామని తెలిపారు. అందరి సహకారంతో ఖేలో ఇండియా క్రీడలను విజయవంతంగా నిర్వహించి తెలంగాణ ప్రతిష్ఠను మరింత పెంచుతామని పేర్కొన్నారు.

## జగన్ హయాంలో నీటి దోపిడీని పట్టించుకోని కెసిఆర్

### తెలంగాణ ప్రభుత్వ విప్ యెన్నెం శ్రీనివాస్ రెడ్డి

హైదరాబాద్,ఆగస్ట్13 : వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో అదనపు నీటిని ఏపీ తరలిస్తుంటే బీఆర్ఎస్ నేతలు అప్పుడు ఎందుకు ప్రశ్నించలేదని తెలంగాణ ప్రభుత్వ విప్ యెన్నెం శ్రీనివాస్ రెడ్డి ప్రశ్నించారు. స్వలాభం కోసం, ఎంపీ సీట్ల కోసం తెలంగాణ నీటిని, ప్రజలను ఏపీకి కేసీఆర్ తాకట్టు పెట్టారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శాశ్వతంగా తెలంగాణకు కేసీఆర్ నష్టం చేశారని ఆగ్రహించారు. గురువారం సీఎల్పీ మీడియా పాయింట్‌లో శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు. కేసీఆర్ ఢిల్లీలో గద్దె ఎక్కడానికి చేసిన ప్రయత్నాలు అన్ని ఇన్ని కావని ప్రస్తావించారు. కేసీఆర్ రాయలసీమను రతనాల సీమ చేస్తాననే విషయాన్ని బీఆర్ఎస్ నేత జగదీశ్వర్ రెడ్డి మర్చిపోయినట్లుగా ఉన్నారని విమర్శించారు. జగదీశ్వర్ రెడ్డి రాజకీయాల కోసం రైతులను ఏమార్చే ప్రయత్నం చేస్తున్నారని శ్రీనివాస్ రెడ్డి దుయ్యబట్టారు. బీఆర్ఎస్ నేతలు ఎన్ని కుట్రలు చేసిన, ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, జగదీశ్వర్ రెడ్డి రోజుకో కొత్త డ్రామాకు తెరదీస్తున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ హయాంలో ఏపీకి అదనంగా తరలించుకొని పోయిన నీటి గురించి వైసీపీ నేతలే ప్రెస్‌మీట్లు పెట్టి మరి చెబుతున్నారని అన్నారు. గతంలో జగన్ రెడ్డి సీఎం హోదాలో అసెంబ్లీ వేదికగా శ్రీశైలం నుంచి తీసుకెళ్తున్న నీటిని ప్రస్తవించలేదా..? అని నిలదీశారు. కేసీఆర్ సహకారంతో ప్రాజెక్టులను పెంచుతున్నట్లు జగన్ అసెంబ్లీలో చెప్పారని అన్నారు. జగన్ అసెంబ్లీలో మాట్లాడినప్పుడు జగదీశ్ రెడ్డి ఎక్కడ ఉన్నారని శ్రీనివాస్ రెడ్డి ప్రశ్నించారు. ఎల్‌నినో ఎఫెక్ట్ ఉన్నా దేవుడి దయ వల్ల వర్షాలు పడుతున్నాయని చెప్పుకొచ్చారు. మళ్లీ బీఆర్ఎస్ నేతలు కొత్త డ్రామాలకు తెరలేపారని విమర్శించారు. కృష్ణాలో 500 టీఎంసీల నీటి కోసం కాంగ్రెస్ కొట్లాడుతోందని అన్నారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు బేసిన్‌లు లేవు, బేషజాలు లేవని చెప్పింది నిజం కాదా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకులు చేసే విమర్శలకు తాము అసెంబ్లీలో చర్చిస్తామని.. కేసీఆర్ సభకు రావాలని యెన్నెం శ్రీనివాస్ రెడ్డి సవాల్ విసిరారు.

# సంపాదకీయం

## పార్లమెంట్‌ను అపవిత్రం చేశారు !

తిలా పాపం తలా పిడికెడు అన్నట్లుగా.....పార్లమెంటు సమావేశాలు మట్టి కరవడానికి అందరూ బాధ్యులే. 19 రోజుల పాటు ఎవరికి వారే అన్నట్లుగా వ్యవహరించి ఎన్నుకున్న ప్రజలను అవామానానికి గురి చేశారు. ప్రజలు ఎంతో నమ్మకంతో వీరిని ఎన్నుకుని పంపితే చట్టసభలను చట్టుబండలు చేస్తున్నారు. సమస్యలను చర్చించకుండా..వ్యక్తిగత ఎజెండాలతో భ్రష్టు పట్టించారు. ఇలాంటి నేతలు ప్రజల సమస్యలు పరిష్కరిస్తా రని, వారి ఆశలను పరిశీలిస్తారని అనుకోవడం బుద్ధితక్కువ తప్ప మరోటి కాదు. చట్టసభల్లో సమస్యలు చర్చించాలి. సమస్యలకు సమాధానాలు రాబట్టాలి. చట్టాలను చేయాలి. కానీ ఇవేవీ జరగకుండా విపక్షాలు అడ్డుకుంటే..అధికార పక్షం చోద్యం చూసింది. దొందూ దొందే అన్నచందంగా సమావేశాలు సాగకుండా 19 రోజుల పాటు నానా రభస సృష్టించారు. చివరి రోజు గురువారం కూడా సభలు సజావుగా సాగక పోవడంతో ఉభయ సభలను నిరవధికంగా వాయిదా వేశారు. మొత్తంగా ఈ 19 రోజులు ప్రతిపక్ష సభ్యుల ఆందోళనల మధ్య ఎటువంటి కార్యకలాపాలు జరగకుండానే వాయిదాపడ్డాయి. దీంతో పార్లమెంటు సమావేశాలు మొదలైన జులై 20 నుంచి ఇప్పటిదాకా 19 రోజులు సభా కార్యకలాపాలు తుడిచిపెట్టుకుపోయాయి. అధికార, ప్రతిపక్షాలు పట్టు వీడకపోవడంతో ఆఖరి రోజూ సజావుగా సాగలేదు. విద్యార్థుల ఆందోళనపై చర్చకు సిద్ధమని బుధవారం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సవాల్ విసిరారు. చర్చకు ప్రతిపక్షం అంగీకరిస్తే పార్లమెంటు సమావేశా లను పొడిగించడానికి సిద్ధమని కేంద్రం తెలిపింది. అయితే ఆయన లెక్చర్ వినడానికి సిద్ధంగా లేమని ప్రతిపక్షం ఆ సవాల్‌ను తోసిపుచ్చింది. బుధవారం ఉదయం 11గంటలకు లోక్‌సభ సమావేశం కాగానే ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి వచ్చి నినాదాలు చేశారు. చర్చను ప్రారంభిద్దామని మంత్రి కిరణ్ రిజిజు ప్రతిపాదించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో సభ నిరవధికంగా వాయిదా పడింది. ప్రభుత్వం చర్చకు సిద్ధంగా ఉంటే ప్రతిపక్షం పారిపోవడం తొలిసారిగా చూస్తున్నా' అని పార్లమెంటరీ వ్యవహారా మంత్రి కిరణ్ రిజిజు వ్యాఖ్యానించారు. నిజయోకవర్గ సమస్యలను ఎలాగూ ప ట్టించుకోవడం లేదు. అలాగే దేశ సమస్యలపైనా బాధ్యత లేదు. ప్రతిపక్షం బలంగా గళం వినిపిస్తేనే ప్రభుత్వాలు తలవంచుతాయి. ఆందోళన చేయడం కూడా ఓ రకమైన నిరసన అని చెప్పుకుని తప్పించుకోవడం మినహా విపక్షం చేసిందేమీ లేదు. పార్లమెంట్ లోపాలా, బయటా ధర్నాలు చేయడం మినహా సాధించిందేమీ లేదు. దీనికోసం ప్రజలు ఎంపిలను ఎన్నుకోలేదు. విద్యార్థుల ఆందోళనలపై ప్రభుత్వం చర్చకు సిద్ధమని చెప్పడం.. అమిత్ షా ప్రతిష్ఠ అనే గాలి బుడగ పేలిపోయాక దానిలో గాలిని నింపడానికి చేసిన చివరి ప్రయత్నంగా రాహుల్ అభివర్ణించారు. అసలు తమపై పెల్లెట్ గన్‌లతో కాల్పులు జరపడానికి ఎవరు ఆదేశించారో తెలుసుకోవాలని యువత కోరుకుంటున్నారని రాహుల్ పట్టుపడుతూ వచ్చారు. అమిత్ షా ఉపన్యాసం వినడానికి సిద్ధంగా లేమని తేల్చి చెప్పారు. విద్యార్థుల ఆందోళనలు, వాటికి సంబంధించిన అంశాలపై చర్చకు సిద్ధంగా ఉన్నానని అమిత్ షా తెలిపారు. ప్రతిపక్షాలు చర్చను కోరుతూ లోక్‌సభ స్పీకరుకు లేఖ ఇవ్వాలని, వారు అడిగే అన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇస్తానని ఆయన స్పష్టం చేశారు. మొత్తం చర్చలో తాను పాల్గొంటానని తేల్చి చెప్పారు. చర్చ నుంచి తాను పారిపోతున్నా నన్న ప్రతిపక్షాల ఆరోపణలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన స్పీకర్‌కు లేఖ రాశారు. ప్రతిపక్షాలతో సంప్రదించి విద్యార్థుల ఆందోళనలపై చర్చ చేపట్టాలని కోరారు. కానీ విపక్షం చర్చకు సిద్ధంగా లేదని తేలిపోయింది. కేవలం బలప్రదర్శన వేదికగా వర్షాకాల సమావేశాలు నిలిచాయి. విపక్షాలు బంలగా ఉన్నాయని చాటి చెప్పడానికి ప్రయత్నించారు. ప్రధానంగా విదేశీ విరాళాల సవరణ బిల్లును అడ్డుకోవడం కోసం చేసిన ప్రయత్నం ఫలించింది. ప్రజలు ఇప్పుడు ఆలోచించాల్సిన సమయం వచ్చింది. ఉభయ సభలు ఈ వర్షాకాల సమావేశాల్లో సజావుగా జరగకూడదన్న విపక్షం ఎజెండా విజయం సాధించింది. పార్లమెంటులో విపక్షాల నినాదాలు, పోడియంలోకి దూసుకుని రావడం, స్పీకర్ ఓంబిర్లా వారించడం నిత్యకృత్యంగా మారాయి. దీంతో సమావేశాలను విపక్ష పార్టీలు కావాలనే స్తంభింపచేసాయి. ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే అధికార పార్టీ సభ్యులు కూడా ఈ సమావేశాల్లో మకరద్వారం వద్ద ప్రతిపక్షాలను నిలదీస్తూ 'రాహుల్ గాంధీ జవాబ్ దో..' అని నినాదాలు చేశారు. అయితే ఇవేవీ ప్రజలకు ఉపయోగపడే వ్యవహారాలు కావు. అటు అధికార పార్టీ, ఇటు విపక్ష పార్టీలు రెండూ బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నాయనడంలో ఎలాంటి సంకోచం అవసరం లేదు. నినాదాలు చేస్తున్న పాలక, ప్రతిపక్ష సభ్యుల తీరును ప్రజలు గమనించారు. ఎవరేంటో తెలుసుకుంటున్నారు. వీరితీరుపైనా జెన్‌జీలు దృష్టి సారించాలి. బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్న నాయకులను కనిపెట్టాలి. లేకుంటే పార్లమెంట్ సమావేశాలకు అర్థం లేకుండా పోతుంది. ఇలా 19 రోజులు సభలను వృథా చేసినందుకు నేతల జీతభత్యాలను కట్ చేయాలి. వారికి తగిన ఫైన్ వేయాలి. అప్పుడే నేతల్లో జవాబుదారీతనం వస్తుంది.

# ట్రిబ్యునల్ సంస్కరణలు హర్షణీయం




ట్రిబ్యునళ్లకు న్యాయ వ్యవస్థలో ఒక ప్రత్యేకమైన ప్రయోజనం ఉంది. ఆర్థికపరమైన వ్యవస్థలకు సంబంధించిన వివాదాలను పరిష్కరించడంలో ట్రిబ్యునల్ ఇచ్చే తీర్పులను హైకోర్టుల న్యాయ సమీక్షలకు లోబడి ఉంటాయి. అయితే ఈ తీర్పులు ముఖ్యమైన వ్యవస్థాగత లోపాన్ని పూర్తిగా పరిష్కరించలేకపోతున్నాయి. ఏ న్యాయమూర్తి విచారణ చేయకుండానే ఏ ట్రిబ్యునల్ ఒక కేసు కూడా పరిష్కరించలేదు. ఈ నేపథ్యంలో ట్రిబ్యునల్ సంస్కరణ బిల్లు 2026 పార్లమెంటులో ప్రవేశపెట్టడం స్వాగతించదగిన ప్రయత్నమని చెప్పవచ్చు. పదే పదే న్యాయపరమైన సవాళ్లు, కోర్టుల జోక్యానికి గురి అవుతున్న ట్రిబ్యునల్ వ్యవస్థలో మరింత స్వతంత్రత, వృత్తిపరమైన నైపుణ్యం, పారదర్శకత తీసుకు రావడానికి ఈ బిల్లు ప్రయత్నించినట్లు కనిపిస్తోంది. ట్రిబ్యునల్స్ నియామకంలో గత ప్రభుత్వాలు సుప్రీం కోర్టు నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణమైన వ్యవస్థను రూపొంచడంలో ఇబ్బందులు ఎదుర్కొన్నాయి. ముఖ్యంగా హైకోర్టులకు గతంలో ఉన్న అధికారాలను వినియోగించే ట్రిబ్యునళ్లకు కూడా హైకోర్టులతో సమానమైన స్వతంత్రత ఉండాలని సుప్రీం కోర్టు పదే పదే స్పష్టం చేసింది. ఈ అనుభవాలనుంచి ప్రస్తుత బిల్లు పాఠాలు నేర్చుకున్నట్లు కనిపిస్తోంది. అన్నిటికంటే ముఖ్యంగా ఈ బిల్లు నేషనల్ ట్రిబ్యునల్ కమిషన్ ఏర్పాటును ప్రతిపాదిస్తోంది. ఇందులో న్యాయ వ్యవస్థకు ప్రాధాన్యత కల్పించారు. నియామకాల్లో పరిపాలన, మంత్రిత్వ శాఖల పాత్రను తగ్గించి సభ్యుల ఎంపిక కోసం శాశ్వత వ్యవస్థను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించడమైంది. ఈ కమిషన్‌కు రిటైర్డ్ సుప్రీం కోర్టు న్యాయమూర్తి లేదా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అధ్యక్షత వహిస్తారు. అదనంగా ఇద్దరు రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తులు, ఇద్దరు సాంకేతిక సభ్యులు ఉంటారు. అంటే మొత్తం ఐదుగురిలో న్యాయపరమైన నేపథ్యం ఉన్న వారు ముగ్గురు ఉండడంతో 3:2 నిష్పత్తిలో న్యాయ వ్యవస్థకు ఆధిక్యం లభిస్తుంది. అలాగే సెర్చ్ కమ్ సెలక్షన్ కమిటీలకు కూడా న్యాయపరమైన నేపథ్యం ఉన్న వ్యక్తియే అధ్యక్షత వహిస్తాడు. అధ్యక్షుడికి సమానమైన ఓట్లు వచ్చినప్పుడు నిర్ణయించే కాస్టింగ్ ఓటు కూడా ఉంటుంది. మరో ముఖ్యమైన, సముచితమైన నిబంధన ఏమిటంటే ప్రతి ఖాళీ స్థానానికి ప్రభుత్వం ఎంపిక చేసుకునేందుకు అనేక పేర్లతో కూడిన ప్యానళ్లను ఇవ్వకుండా ఒక్క అభ్యర్థి పేరునే సిఫారసు చేయవలసి ఉంటుంది. ప్రధాని దిద్దుబాట న్యాయ వ్యవస్థ ఆధిపత్యం ఉన్న కమిటీ అనేక మంది అభ్యర్థులను ఎంపిక చేసినప్పటికీ చివరకు ప్రభుత్వం వారిలో ఒకరిని ఎంచుకునే విధానం కొనసాగితే నియామకాల స్వతంత్రతను కల్పించాలనే ఉద్దేశం చాలా వరకు దెబ్బ తింటుంది. ఒక్క పేరును మాత్రమే సిఫారసు చేయడంవల్ల తుది ఎంపికలో ప్రధాన నిర్ణయాధికారం ఎంపిక కమిటీ వద్దే ఉంటుంది. బిల్లు చైర్‌పర్సన్లు, సభ్యులకు ఐదేళ్ల పదవీకాలాన్ని కూడా ప్రతిపాదిస్తుంది. అయితే చైర్ పర్సన్‌కు 70 సంవత్సరాలు, సభ్యులకు 67 సంవత్సరాలు వయో పరిమితిగా నిర్ణయించింది. గతంలో సుప్రీం కోర్టు కొట్టివేసిన కనీస 50 సంవత్సరాల వయసు నిబంధనను మాత్రం తిరిగి తీసుకు రాలేదు. ఇక మరో ముఖ్యమైన అంశం ఏమిటంటే ట్రిబ్యునల్స్‌ను వాటి ముందు తరచుగా కేసులు వేసే పరిపాలన మంత్రిత్వ శాఖల నుంచి సంస్థాగతంగా దూరంగా ఉంచే ప్రయత్నం చేయడం. వార్తల సబ్‌స్క్రిప్షన్ ప్రాంతీయ వార్తలు నిధులు, సిబ్బంది, మౌలిక సదుపాయాల అవసరాలను కమిషన్‌ద్వారా అంచనా వేయాలని ప్రతిపాదించారు. నిధులను ప్రభుత్వమే సమకూరుస్తుంది. ట్రిబ్యునల్ సభ్యులపై క్రమశిక్షణాపర్యవేక్షణ కూడా ప్రత్యక్ష కార్యనిర్వాహక నియంత్రణనుంచి చాలా వరకు తప్పించి, మరింత స్వతంత్ర వ్యవస్థలోకి తీసుకు రావాలని బిల్లు ప్రయత్నిస్తోంది. కమిషన్ కింద పని చేసే వ్యవస్థలోనే మరింత కీలకమైన సంస్కరణ ఉండవచ్చు. ఇప్పటివరకు ట్రిబ్యునల్ నియామకాలు తరచుగా అప్పుడప్పుడు చేపట్టే అన్వేషణలు అభ్యర్థులపై అసమానమైన మూల్యాంకనం, వారి ప్రతిష్టపై అధికంగా ఆధారపడడం వంటి సమస్యలు ఎదురయ్యేవి. ఇప్పుడు ఈ బిల్లు శాశ్వత నియామక వ్యవస్థను ఏర్పాటు చేయాలని ప్రతిపాదిస్తోంది. అంటే ఖాళీలను ముందుగా గుర్తించడం, పదవులను ప్రకటన చేయడం దరఖాస్తులను పరిశీలించడం, అర్హతలను తనిఖీ చేయడం తదితర బాధ్యతలను నిర్వహిస్తోంది. మక్కా ఒప్పందం భారత్‌కు మేలుకొలుపు ఈ ప్రక్రియలనుంచి సంబంధిత పరిపాలనా మంత్రిత్వ శాఖను తప్పించడం కూడా ప్రతిపాదనలో ఉంది. నిపుణులుగా ఎంపికైన వ్యక్తులు ముందుగా నిర్ణయించిన ప్రమాణాల ఆధారంగా అభ్యర్థుల తీర్పులు, ఉత్తర్వులు, వారి పరిష్కరించిన కేసులను పరిశీలిస్తారు. అదే సమయంలో వారి నిజాయిత, సమగ్రతకు సంబంధించిన పరిశీలన ప్రత్యేకంగా కొనసాగుతుంది. దీనితో కమిటీ కేవలం ఇంటర్వ్యూలు, వ్యక్తిగత పరిచయాలు లేదా అనధికారిక సమాచారం మీద ఆధారపడకుండా అభ్యర్థి గురించి సమగ్రంగా సిద్ధం చేసిన ఒక నివేదికను పరిశీలించగలుగుతుంది. ఈ సూత్రం సరియైనదే. ప్రతిభను కేవలం చెప్పుకోవడం కాదు నిరూపించాలి. అభ్యర్థుల అర్హతలు, మూల్యాంకన ప్రమాణాలు ప్రతి అంశానికి ఇచ్చే ప్రాధాన్యత ఎంపిక విధానాలు ముందుగానే నిర్ణయించబడితే ఎంపిక ప్రక్రియ మరింత స్థిరంగా సాగుతుంది. అంతేకాకుండా ప్రతి నిర్ణయానికి ఆధారాలను నమోదు చేసే ఆడిట్ చేయగల రికార్డు కూడా మిగులుతుంది. అయితే ఈ వ్యవస్థ ఆచరణలోకి వచ్చే వరకు తుది నిర్ణయానికి రావడం తొందరపాటు అవుతుంది. ఈ బిల్లును ఆగస్టు 10న లోక్‌సభలో, ఆగస్టు 11న రాజ్యసభలో ఎటువంటి చర్చ లేకుండా ఆమోదించడమైనది. మొత్తం మీద ట్రిబ్యునల్ నియామకాలు, నిర్వహణ, స్వతంత్ర ప్రతిపత్తి, న్యాయ వ్యవస్థ అజమాయిషీ తదితర సంస్కరణలతో ఈ బిల్లును ప్రతిపాదించడం హర్షించదగినదే.

## లష్కరే చీఫ్ హాఫీజ్ సయీద్‌కు పాక్ అండ

**పాక్‌వైపు కన్నెత్తితో భారత్ సర్వనాశనం తప్పదు**

**అవామీ ముస్లిం లీగ్ నాయకుడు షేక్ రషీద్ అహ్మద్ ప్రేలాపన**

న్యూఢిల్లీ,ఆగస్ట్13 : పంద్రాగస్టు వేడుకలను రెండు రోజుల్లో భారత్ జరుపుకోనుంది. అలాంటి వేళ.. నిషేధిత ఉగ్రవాద సంస్థ లష్కర్ ఎ తైబా చీఫ్‌పై పాకిస్థాన్ మాజీ మంత్రి, అవామీ ముస్లిం లీగ్ నాయకుడు షేక్ రషీద్ అహ్మద్ ప్రశంసల వర్షం కురిపించారు. అలాగే భారత్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. లష్కర్ ఎ తైబా చీఫ్ హాఫీజ్ సయీద్‌కు తాను సేవకుడిని ఆయన ప్రకటించారు. హాఫీజ్ సయీద్ వెంట పాకిస్థాన్‌తోపాటు తాము ఉన్నామని ఈ సందర్భంగా ప్రకటించారు. పాకిస్థాన్ వైపు కనీసం కన్నెత్తి చూస్తే భారత్‌ను అల్లా నాశనం చేస్తారని హెచ్చరించారు. ఆ దేశంలో పక్షుల కిలకిలారావాలు వినపడవని అన్నారు. దేవాలయాల్లో గుడి గంటలు కూడా మోగవని తీవ్ర స్వరంతో పాక్ మాజీ మంత్రి పేర్కొన్నారు. భారత్‌లో పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా ఏం జరగదని ఆయన అన్నారు. అమెరికా పర్యటనలో ఉన్నప్పుడు తన ఫోన్‌లో హాఫీజ్ సయీద్ ఫోన్ నెంబర్‌ను అధికారులు గుర్తించారని చెప్పారు. దీంతో ఆ దేశం నుంచి తనను బహిష్కరించారని ఈ సందర్భంగా పాక్ మాజీ మంత్రి షేక్ రషీద్ అహ్మద్ గుర్తు చేసుకున్నారు. బహిరంగ సభలో షేక్ రషీద్ చేసిన ఈ వ్యాఖ్యల వీడియో వైరల్ అవుతోంది. లష్కర్ ఎ తైబా సీనియర్ కమాండర్, పాకిస్థాన్ మార్కజీ ముస్లిం లీగ్ అధ్యక్షుడు ఖాలీద్ మసూద్ సంధుతోపాటు ఆ సంస్థ కేంద్ర సలహా కమిటీ సభ్యుడు ఖారీ మొహమ్మద్ యాకూబ్ షేక్ సమక్షంలో పాక్ మాజీ మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌కు షేక్ రషీద్ అహ్మద్ ముఖ్య అనుచరుడిగా ఉన్నారు. 2020 నుంచి 2022 వరకు ఇమ్రాన్ క్యాబినెట్‌లో దేశ అంతర్గత వ్యవహారాల శాఖ మంత్రిగా పని చేశారు. అవామీ ముస్లిం లీగ్‌ను షేక్ రషీద్ స్థాపించారు.

## ఢిల్లీ పేలుళ్ల వెనుక అల్‌ఖైదా అనుబంధ సంస్థ

న్యూఢిల్లీ : ఢిల్లీ పేలుళ్ల వెనుక అల్‌ఖైదా అనుబంధ ఉగ్రవాద సంస్థ అల్‌ఖైదా ఇన్ ఇండియన్ సబ్‌కాంటినెంట్ కుట్ర ఉందని ఐక్యరాజ్యసమితి నివేదిక వెల్లడించినట్లు సమాచారం. 2025 నవంబర్‌లో ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన కారు బాంబు పేలుడు ఘటనపై దర్యాప్తు నేపథ్యంలో ఈ అంశాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఆల్‌ఖైదా ప్రాంతీయ కార్యకలాపాలను విస్తరిస్తున్న ఉగ్రవాద సంస్థగా నివేదిక పేర్కొన్నట్లు తెలుస్తోంది. తాలిబన్ల నుంచి మద్దతు, ఆశ్రయం లభిస్తున్నట్లు ఐక్యరాజ్య సమితి నివేదికలో ప్రస్తావించినట్లు సమాచారం. దీంతో పలు ప్రాంతాల్లో అల్‌ఖైదా నెట్‌వర్క్ మరోసారి బలపడుతున్నదనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా భారత్ సహా ఆయా దేశాల్లో ఉగ్రవాద కార్యకలాపాలకు అల్‌ఖైదా ముప్పుగా మారే అవకాశం ఉందని భద్రతా వర్గాలు భావిస్తున్నాయి. 2025 నవంబర్‌లో ఎర్రకోట సమీపంలో జరిగిన కారు బాంబు పేలుడు ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనకు సంబంధించిన కుట్ర, ఉగ్రవాద నెట్‌వర్క్‌పై దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో ఐక్యరాజ్య సమితి నివేదికలోని అంశాలు కీలకంగా మారాయి. అల్‌ఖైదా తన కార్యకలాపాలను విస్తరించేందుకు ప్రాంతీయ నెట్‌వర్క్‌లను ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తోందని నివేదికలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. తాలిబన్ల మద్దతుతో పలు ప్రాంతాల్లో సురక్షిత స్థావరాలు లభిస్తున్నాయనే ఆరోపణలు కూడా ఈ నివేదికతో మరోసారి చర్చకు వచ్చాయి. ఉగ్రవాద సంస్థల కదలికలను నిశితంగా పర్యవేక్షించాల్సిన అవసరాన్ని ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి.

## చంద్రగిరిలో ఏనుగుల హల్‌చల్

**పంటపొలాలను ధ్వంసం చేసినట్లు రైతుల వెల్లడి**


తిరుపతి,ఆగస్ట్13 : జిల్లాలోని చంద్రగిరి మండలం యల్లంపల్లిలో మరోసారి ఏనుగుల గుంపు బీభత్సం సృష్టించింది. అర్ధరాత్రి గ్రామ పరిసరాల్లోకి సుమారు 15 ఏనుగులు చొరబడి పంట పొలాలపై దాడి చేశాయి. వరి పంటతో పాటు పశువుల కోసం సాగు చేసిన గడ్డి పంటలను తొక్కి ధ్వంసం చేశాయి. రైతులకు చెందిన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. రాత్రివేళ ఏనుగుల గుంపు ఒక్కసారిగా పంట పొలాల్లోకి రావడంతో రైతులు, గ్రామస్తులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. పంటలు చేతికొచ్చే సమయంలో ఏనుగుల దాడితో నష్టం వాటిల్లడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏనుగుల గుంపు మళ్లీ గ్రామ పరిసరాల్లో సంచరిస్తుండటంతో యల్లంపల్లి ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. ఏనుగులు ఎప్పుడు, ఎటువైపు నుంచి వస్తాయో తెలియక రైతులు రాత్రివేళ పొలాల వద్దకు వెళ్లేందుకు సైతం భయపడుతున్నారు. పంట నష్టానికి పరిహారం అందించడంతో పాటు ఏనుగులు గ్రామాల వైపు రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను విజ్ఞప్తి చేస్తున్నారు. గ్రామస్తుల సమాచారంతో అటవీ అధికారులు రంగంలోకి దిగి ఏనుగుల కదలికలను పరిశీలిస్తున్నారు. ఏనుగుల గుంపును సురక్షితంగా అటవీ ప్రాంతం వైపు తరలించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

## రైలు ఢీకొని టీచర్ మృతి

మహబూబాబాద్,ఆగస్ట్13 : జిల్లాలో విషాద ఘటన చోటు చేసుకుంది. పుష్‌పుల్ రైలు ఢీకొని ఓ ఉపాధ్యాయుడు దుర్మరణం చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. మైనార్టీ గురుకుల పాఠశాలలో మ్యాథ్స్ టీచర్‌గా పని చేస్తున్న ఎండీ గౌస్‌మియా మహబూబాద్ రైల్వే స్టేషన్‌లో పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు.

## సత్యనిష్ఠే..ఏకైక మార్గం

'భావనమే' జీవనం. జీవ దేహం కేవలం ఒక ఉపకరణం. ఇంద్రియ గ్రహణం, ప్రజ్ఞ, ఉద్వేగాలు, అభ్యాసం, అస్తిత్వరూపం, నిర్ణయాలు, పట్టుదల, అనుభూతి విస్తృతి.. అన్నీ భావప్రపంచమే. అయితే .. ఈ భావప్రపంచం సత్య, శాంత, స్పష్ట సమర్థతతో, సుసంస్కారంతో సాగాలంటే.. శరీరం సంతులిత సమర్థతతో పనిచేస్తూ ఆరోగ్యంగా ఉండటం అత్యవసరం. కానీ, తగినంత ఆరోగ్యంగా ఉన్నవారిలో కూడా చాలావరకు భావప్రపంచం సమర్థతతో పనిచేయకపోవడం కీలకమైన సమస్య. అందులోనూ అధికారం, ధనం, విద్య (మేధస్సు) ఉన్నవారిలో ఈ దోషం ఉండటం సమాజానికి ప్రబలమైన సమస్య. భావప్రపంచాన్ని సంస్కార బలంతో నడుపగలిగింది సదా 'సత్యనిష్ఠ'. సత్యజీవనం.. విద్య. అసత్య జీవనం.. అవిద్య. దైనందిన మానవ జీవనం సత్యాసత్యాల 'మిశ్రమం'. 'సమానతా భావమయమైన' సరళ జీవనం, సమష్టి శాంతి, నిర్భయత, ఆరోగ్యం, కృషి, పరస్పర ఆదరణ, ఆధ్యాత్మిక సాధన, సంతృప్తి, ఆనందా నుభవం ఇవన్నీ అనివార్యంగా సత్యాన్ని ఆశ్రయించి సాగుతుంటాయి. 'ఆధిక్యతాభావమయమైన' సంపద్గత జీవనం, కాంక్ష , ప్రకృతిశోషణ, ఘర్షణ, హననం, ఆక్రమణ, ప్రాణ నష్టం, భయం ఇవి అసత్యాన్ని ఆశ్ర యించి సాగుతాయి. మానవ 'జీవితాన్ని శాసించవలసిన సత్యాలు.



ఆధ్యాత్మికం

# పెద్దపల్లి నియోజకవర్గానికి రహదారుల మహర్దశ

● ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు - రూ. 5.43 కోట్లతో నిర్మించిన మద్దెల వాగు హై లెవెల్ బ్రిడ్జి ప్రారంభం ● గోదావరిఖని - జఫర్ ఖాన్ పేట - పెద్దపల్లి సరికొత్త ఆర్టీసీ బస్సు సర్వీస్ షురూ ● నియోజకవర్గంలో రూ. వందల కోట్ల రహదారి పనులకు ఆగస్టు 17న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపనలు

సుల్తానాబాద్, ఆగస్టు 13(ది క్రైమ్ న్యూస్): గ్రామీణ ప్రాంత ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన రవాణా సౌకర్యాలు కల్పించడమే ప్రజా ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు స్పష్టం చేశారు. కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని జఫర్ ఖాన్ పేట గ్రామంలో గురువారం నాడు ఆయన రూ. 5.43 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన మద్దెల వాగు హై లెవెల్ బ్రిడ్జిని మరియు గోదావరిఖని -- జఫర్ ఖాన్ పేట -- పెద్దపల్లి ఆర్టీసీ బస్సు సర్వీసును స్థానిక నాయకులతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం గ్రామంలో రూ. 15 లక్షల నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ, గతంలో తాను గడప గడపకు తిరిగినప్పుడు రోడ్లు లేక, స్కూల్ భవనాలు శిథిలావస్థలో ఉండి ప్రజలు నరకం చూశారని గుర్తుచేశారు. దానికి భిన్నంగా నేడు ఇండ్ల సంఖ్యతో సంబంధం లేకుండా గ్రామాల్లోని వీధులన్నింటికీ సీసీ రోడ్లు పూర్తి చేశామన్నారు. మద్దెల వాగు బ్రిడ్జి పూర్తి చేయడమే కాకుండా, అప్రోచ్ రోడ్ల కోసం అదనంగా మరో రూ. కోటి ఖర్చు చేసి ప్రజల రవాణా కష్టాలను శాశ్వతంగా తీర్చామని తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా మంజూరైన రహదారుల నిధుల వివరాలను ఆయన వెల్లడించారు: మంగపేట కూనారం టర్నింగ్ నుండి ముత్తారం వరకు డబుల్ రోడ్డు కోసం రూ. 32 కోట్లు పెద్దపల్లి -- గర్రెపల్లి మేజర్ రోడ్డుకు రూ. 100 కోట్లు సుల్తానాబాద్ -- పెద్దపూర్ రోడ్డుకు రూ. 47 కోట్లు కూనారం -- పెద్దపల్లి రోడ్డుకు రూ. 14 కోట్లు జఫర్ ఖాన్ పేట్ రింగ్ రోడ్డుకు రూ. 7 కోట్లు శ్రీరాంపూర్ హెడ్ క్వార్టర్ సెంట్రల్ లైటింగ్‌కు రూ. 5.5 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. ఆగస్టు 17న సుల్తానాబాద్‌లో భారీ శంకుస్థాపనల ఉత్సవం: ఈ అభివృద్ధి పనులన్నింటికీ ఆగస్టు 17న సుల్తానాబాద్ పర్యటనలో భాగంగా రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి శ్రీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరగనున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని ప్రజలు, నాయకులు, మహిళలు ఉదయం 10 గంటలకు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కాళేశ్వరంతో చుక్క నీరు రాలేదు – పత్తిపాక రిజర్వాయర్ నిర్మిస్తాం: గత పాలకులు గొప్పలు చెప్పుకున్న కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి కరీంనగర్ జిల్లా రైతుల పంటపొలాలకు ఒక్క చుక్క సాగునీరు కూడా అందలేదని, దానివల్ల రైతులకు ఎలాంటి ఉపయోగం లేదని విమర్శించారు. దేవుడి దయతో వర్షాలు సమృద్ధిగా కురిసి శ్రీరాంపూర్ మండలంలోని చెరువులన్నీ మత్తళ్లు దుకడం శుభపరిణామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్






రెడ్డి గారి సహకారంతో త్వరలోనే పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టి రైతులకు చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ రామిడి తిరుపతి రెడ్డి, మాజీ ఎంపీపీ గోపగాని సారయ్య గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు గజానావేనా సదయ్య, స్థానిక సర్పంచ్ యాదగిరి జ్యోషన్న శ్రీనివాస్, నాయకులు ఎండీ మునీర్, లంక సదయ్య, తుల మనోహర్ రావు, దేవేందర్ రావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అకడమిక్ ప్యానల్ సందర్శనలు తనిఖీలకే పరిమితం కాకుండా ఉపాధ్యాయులకు అకడమిక్ సహకారం అందించాలి

● తరగతి గది పరిశీలన, విద్యార్థుల స్పాట్ అసెస్మెంట్, ఆధారాలతో కూడిన ఫీడ్‌బ్యాక్‌తో నిరంతర విద్యా అభివృద్ధికి చర్యలు ● ఉస్మానియా యూనివర్సిటీలో రాష్ట్రస్థాయి విద్యాశాఖ అధికారులకు నిర్వహించిన ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో అకడమిక్ ప్యానల్ విధానంపై ప్రజెంటేషన్ ● జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** అకడమిక్ ప్యానల్ సందర్శనలు కేవలం తనిఖీలకే పరిమితం కాకుండా ఉపాధ్యాయులకు అవసరమైన అకడమిక్ సహకారం అందిస్తూ, పాఠశాలల్లో నిరంతర విద్యా అభివృద్ధికి దోహదపడేలా ఉండాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షలి సూచించారు. తరగతి గది బోధనా పద్ధతులను బలోపేతం చేయడం, విద్యార్థుల అభ్యసన ఫలితాలను మెరుగుపరచడం అకడమిక్ మానిటరింగ్ ప్రధాన లక్ష్యంగా ఉండాలని అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో రాష్ట్రంలోని అన్ని మండల విద్యాధికారులు, జిల్లా విద్యాధికారులు, ప్రాంతీయ సంయుక్త సంచాలకుల కోసం నిర్వహించిన ఒకరోజు శిక్షణ, అవగాహన కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెద్దపల్లి జిల్లాలో అమలు చేస్తున్న అకడమిక్ ప్యానల్ విధానంపై రాష్ట్రస్థాయి అధికారులకు ప్రజెంటేషన్ ఇచ్చారు. **క్రమబద్ధమైన పాఠశాల సందర్శనలతో అకడమిక్ మానిటరింగ్:** పెద్దపల్లి జిల్లాలో అకడమిక్ ప్యానల్ ద్వారా పాఠశాలలను క్రమబద్ధంగా సందర్శిస్తూ, పాఠశాల స్థాయిలో బోధన--అభ్యసన ప్రక్రియను పర్యవేక్షిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ వివరించారు. ప్రతి పాఠశాల సందర్శనలో తరగతి గది పరిశీలన, విద్యార్థుల స్పాట్ అసెస్మెంట్ తప్పనిసరిగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల అభ్యసన స్థాయిని ప్రత్యక్షంగా అంచనా వేసి, అభ్యసనలో వెనుకబడిన అంశాలను గుర్తించి, వాటి పరిష్కారానికి అవసరమైన జోక్యాలను ప్రణాళిక చేస్తున్నట్లు వివరించారు. విద్యార్థుల అభ్యసన డేటాను ఆధారంగా చేసుకుని బోధనా ప్రణాళికలను మరింత ప్రభావవంతంగా రూపొందించాలని సూచించారు. **ఆధారాలతో కూడిన నిర్మాణాత్మక ఫీడ్‌బ్యాక్:** ఉపాధ్యాయులకు ఫీడ్‌బ్యాక్ ఇచ్చే విధానం నిర్మాణాత్మకంగా ఉండాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఉపాధ్యాయుల బోధనలోని 2--3 మంచి అంశాలను గుర్తించి అభినందించడంతో పాటు, మెరుగుదలకు అవసరమైన ఒక స్పష్టమైన, ఆచరణ సాధ్యమైన తదుపరి చర్యను సూచించాలని అన్నారు. అకడమిక్ ప్యానల్ సందర్శనల ద్వారా ఉపాధ్యాయులలో భయాన్ని కలిగించడం కాకుండా, వారి బోధనా సామర్థ్యాలను మరింత బలోపేతం



చేసేందుకు అవసరమైన అకడమిక్ సహకారం అందించాలన్నారు. **విద్యార్థుల చురుకైన భాగస్వామ్యానికి ప్రాధాన్యం:** తరగతి గదిలో విద్యార్థుల భాగస్వామ్యం, పరస్పర చర్చ, స్వతంత్ర అభ్యాసం, చురుకైన పాల్గొనడం పెరిగేలా ఉపాధ్యాయులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. విద్యార్థులు కేవలం వినే స్థాయిలో కాకుండా ప్రశ్నించడం, చర్చించడం, స్వయంగా నేర్చుకోవడం వంటి అభ్యసన ప్రక్రియలో చురుకుగా పాల్గొనేలా బోధనా పద్ధతులను మార్చాలని తెలిపారు. డిజిటల్ టూల్స్, బోధనాభ్యసన సామగ్రి, సమర్థవంతమైన ప్రశ్నించే విధానాలను వినియోగించి తరగతి గది అభ్యసనాన్ని మరింత ఆసక్తికరంగా, ప్రభావవంతంగా మార్చాలని సూచించారు. **కాంప్లెక్స్ సమావేశాలు, సబ్జెక్ట్ ఫోరమ్‌లతో లోపాల పరిష్కారం:** గుర్తించిన బోధన--అభ్యసన లోపాలను పరిష్కరించేందుకు కాంప్లెక్స్ సమావేశాలు, సబ్జెక్ట్ ఫోరమ్‌లను మరింత బలోపేతం చేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. పాఠశాల సందర్శనలో గుర్తించిన అంశాలను తదుపరి సమావేశాల్లో చర్చించి, ఉపాధ్యాయులకు అవసరమైన అకడమిక్ సహకారం అందించే విధంగా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఎంఈఓలు, కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్లు, అకడమిక్ బృందాలు పాఠశాల సందర్శనలు, శిక్షణా కార్యక్రమాల అనంతరం క్రమం తప్పకుండా ఫాలోఅప్ నిర్వహించాలని అన్నారు. ఒక్కసారి పరిశీలన చేసి వదిలివేయకుండా, సూచించిన అంశాలపై పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. **క్వాలిటీ కోఆర్డినేటర్ల ద్వారా డేటా ఆధారిత ప్రణాళిక:** క్వాలిటీ కోఆర్డినేటర్లు పాఠశాల సందర్శనల పరిశీలనలను క్రమబద్ధంగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. వివిధ పాఠశాలల్లో సాధారణంగా కనిపిస్తున్న అంశాలను విశ్లేషించి, పాఠశాల మరియు మండల స్థాయిలో లక్ష్యిత అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని తెలిపారు. పాఠశాల సందర్శనల నుంచి లభించే సమాచారాన్ని కేవలం రికార్డుల కోసం కాకుండా విద్యా ప్రమాణాల మెరుగుదలకు ఉపయోగించాలని సూచించారు. డేటా ఆధారంగా అవసరమైన చోట ప్రత్యేక జోక్యాలను చేపట్టి, వాటి ఫలితాలను తిరిగి పరిశీలించాలని అన్నారు. **అకడమిక్ మానిటరింగ్‌కు స్పష్టమైన లక్ష్యం:** అకడమిక్ ప్యానల్ మానిటరింగ్ యొక్క అంతిమ లక్ష్యం తప్పులను గుర్తించడం కాదని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష స్పష్టం చేశారు. ఉపాధ్యాయులకు సహకరించడం, తరగతి గది బోధనా పద్ధతులను బలోపేతం చేయడం, విద్యార్థుల అభ్యసన ఫలితాలను మెరుగుపరచడం ప్రధాన లక్ష్యాలని తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో అమలు చేస్తున్న అకడమిక్ ప్యానల్ విధానం ద్వారా క్రమబద్ధమైన అకడమిక్ మానిటరింగ్, నిర్మాణాత్మక ఫీడ్‌బ్యాక్, డేటా ఆధారిత ప్రణాళిక, నిరంతర ఫాలోఅప్ ద్వారా పాఠశాలల్లో విద్యా అభివృద్ధికి అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించవచ్చని జిల్లా కలెక్టర్ వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా అకడమిక్ మానిటరింగ్‌ను మరింత సమగ్రంగా, ప్రభావవంతంగా అమలు చేసేందుకు పెద్దపల్లి జిల్లాలోని ఈ విధానం ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. అకడమిక్ ప్యానల్‌ను కేవలం తనిఖీ వ్యవస్థగా కాకుండా, ఉపాధ్యాయులకు సహకరించే, బోధనా పద్ధతులను బలోపేతం చేసే, విద్యార్థుల అభ్యసన ఫలితాలను మెరుగుపరిచే సమగ్ర అకడమిక్ జోక్యంగా చూడాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన మండల విద్యాధికారులు, జిల్లా విద్యాధికారులు, ప్రాంతీయ సంయుక్త సంచాలకులు, క్వాలిటీ కోఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలే కబ్జా చేశారనడంలో తహశీల్దార్ ఆంతర్యమేంటో.....? తక్షణమే హద్దులు ఏర్పాటు చేసి ప్రభుత్వ భూమిని కాపాడాలి

### ఇట్లు నల్లగొండ గ్రామస్తులు




**తిమ్మాపూర్, ఆగస్టు13(ది క్రైం న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం నల్లగొండలో ఇండ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం సేకరించిన భూమిని కొంత మంది కబ్జా చేశారంటూ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సర్వే నెంబర్ 186లో 10గుంటలు, 187లో 2ఎకరాల భూమిని గత ముప్పై ఏండ్ల క్రితమే బిసిల ఇండ్ల నిర్మాణానికై తమ పూర్వీకుల నుండి ప్రభుత్వం సేకరించిందని,ఆ భూమి కబ్జాకు గురవగా గతంలో అధికారులకు ఫిర్యాదు చేసినా సర్వే నిర్వహించారే కానీ, హద్దు ఏర్పాటు చేయకపోవడంతో కొందరు ప్రహరి గోడలు నిర్మించారని ఆరోపించారు.ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని 5ఏండ్ల నుండి అనేక సార్లు ప్రజావాణిలో ఫిర్యాదు చేశామని, ఆర్డీవో మహేశ్వర్, ఎమ్మెల్యే కవ్వంపల్లి, కలెక్టర్ సైతం క్షేత్ర స్థాయిలో సందర్శించి ప్రభుత్వ భూమి ఉందని నిర్ధారణ చేశారన్నారు. ఆధారాలున్నప్పటికీ నేటివరకూ చర్యలు తీసుకోవడంలో స్థానిక తహశీల్దార్ శ్రద్ధ చూపకపోగా ప్రజలే కబ్జా చేశారనడంలో ఆంతర్యం ఏంటని ప్రశ్నిస్తూ కబ్జాకు గురైన ప్రభుత్వ భూమికి తక్షణమే హద్దులు ఏర్పాటు చేసి భూమిని కాపాడాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు.

## మాలల మహాధర్నాను విజయవంతం చేయండి: ఎలుక దేవయ్య



**బెజ్జంకి, ఆగస్టు13(ది క్రైం న్యూస్):** సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలకేంద్రంలో మాల మహానాడు నాయకులు గురువారం సమావేశం నిర్వహించారు. మాజీ ఎంపిటీసీ, రాష్ట్ర సాంస్కృతిక సారథి ఎలుక దేవయ్య మాట్లాడుతూ....కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ మాలలపై చేసిన అన్యాయం, ఏబీసీడీ వర్గీకరణ, రోస్టర్ విధానం తదితర అంశాలతో మాలలకు జరుగుతున్న నష్టాన్ని నిరసిస్తూ మహానాడు రాష్ట్ర అధ్యక్షుడి ఆదేశాల మేరకు ఈనెల23న దుబ్బాక పట్టణంలో మహాధర్నా చేపడుతున్నామని పేర్కొన్నారు.రాష్ట్ర, జిల్లా స్థాయి మాల నాయకులు, నియోజకవర్గంలోని మాల కుటుంబ సభ్యులు, యువత అధిక సంఖ్యలో తరలి మహాధర్నాను విజయవంతం చేయాలని దేవయ్య కోరారు. రాష్ట్ర ప్రదాన కార్యదర్శి మేడి అంజయ్య, మాజీ సర్పంచ్ నరసయ్య, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఏల శేఖర్ బాబు, దామర శంకర్, రాజ మహేందర్, మాశం బాబు, సంఘం మధు, రాకమ ఆంజనేయులు, రమేష్, సాయి, దొంతుల రాయమల్లు, తిరుపతి, చంద్రయ్య, లక్ష్మణ్, యాస బాబు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

## శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్, సభ్యులు



**నల్గొండ ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో పాటు కమిషన్ సభ్యులు లక్ష్మీనారాయణ, రాంబాబు నాయక్ హాలియా మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో కొలువై ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం ఆలయ అభివృద్ధి, భక్తులకు అందుతున్న సౌకర్యాలు తదితర అంశాలను పరిశీలించారు. కార్యక్రమంలో హాలియా మున్సిపాలిటీ వైస్ చైర్మన్ గౌని రాజా రమేష్, 5వ వార్డు కౌన్సిలర్ సలహాదారు చిట్టిపోలు కరుణాసాగర్, 2వ వార్డు కౌన్సిలర్ సలహాదారు నకరికంటి సైదులు, 6వ వార్డు కౌన్సిలర్ బొంగరాల యేసు రాజు, 9వ వార్డు కౌన్సిలర్ చెరుపల్లి ముత్యాలు, 12వ వార్డు కౌన్సిలర్ సలహాదారు ఎడవల్లి రంజిత్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆలయ పూజారులు కమిషన్ చైర్మన్, సభ్యులకు స్వామివారి ప్రసాదాన్ని అందజేసి ఆశీర్వదించారు.

## గురు ప్రసాద్ జన్మదిన వేడుక సందర్భంగా ప్రభుత్వ హాస్పిటల్లో పండ్ల పంపిణీ




**మధిర ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** రిటైర్డ్ ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర అధ్యక్షులు మరియు గురుఫౌండేషన్ చైర్మన్ కొత్తపల్లి గురుప్రసాద్ జన్మదిన వేడుకలను సామాజిక సేవతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా మధిర పట్టణలో గురువారం నాడు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు ఆదరణ ఫౌండేషన్ అనాధాశ్రమంలో నివసిస్తున్న వృద్ధులకు పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆపిల్,అరటి, నారింజతదితర పండ్లను వృద్ధులకు అందజేసి వారి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, పుట్టినరోజు అంటే కేక్ కట్ చేసి సంబరాలు చేసుకోవడం కాదు. సమాజంలోని బాధితులకు, వృద్ధులకు సేవ చేయడమే అసలైన వేడుక. వారి ఆశీర్వాదమే మనకు అసలైన గిఫ్ట్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో గురుఫౌండేషన్ సభ్యులు, ఆదరణ ఫౌండేషన్ నిర్వాహకులు పాల్గొన్నారు.


## పారిశుధ్య కార్మికులకు ఏకరూప దుస్తులు

**- నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికుల కృషి అమోఘం - నగర మేయర్ మహంకాళి స్వామి**



**గోదావరిఖని టౌన్ (ది క్రైమ్ న్యూస్):** రామగుండం నగర పాలక సంస్థ ప్రజారోగ్య విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న రెగ్యులర్, ఔట్ సోర్స్ కార్మికులకు ఏకరూప దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం కార్యాలయంలో ప్రారంభించారు. పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి తమ పాలక వర్గం కృషి చేస్తుందని అన్నారు. ప్రభుత్వం నుండి వారికి అందవల్సిన ప్రయోజనాలను సకాలంలో వచ్చేట్టు చూస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా ఒక్కొకరికి రెండు జతల దుస్తులు, రెండు తువ్వాలలు సుమారు 400 మంది సిబ్బందికి అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ సంపత్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ శ్రీపాల్, జూనియర్ అసిస్టెంట్ చంద్రా రెడ్డి, పారిశుద్ధ్య విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మానకొండూర్‌లో ఘనంగా హర్ ఘర్ తిరంగా యాత్ర



**మానకొండూర్, ఆగస్టు13 (ది క్రైం న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండల కేంద్రంలో బిజెపి మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం హర్ ఘర్ తిరంగా యాత్రను ఘనంగా నిర్వహించారు.చాణక్య, గుడ్ న్యూస్ పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనగా, వేద పాఠశాల నుండి ఎస్సీ కాలనీ మీదుగా పల్లె చౌరస్తా వరకు యాత్రను కొనసాగించి చివరగా జాతీయ గీతాలాపనతో కార్యక్రమాన్ని ముగించారు. నాయకులు కంది రాజిరెడ్డి, గుర్రాల వెంకట్ రెడ్డి, అప్పని తిరుపతి, దూలం కిరణ్,డా.మార్కొండ రమేష్ పటేల్, శంకరచారి, సోన్నకుల శ్రీనివాస్, ప్రదీప్ యాదవ్, శీలం కుమార్, పోచంపల్లి శ్రీనివాస్, అవుదారి విజయ, విద్యార్థులు,ప్రజలు తిరంగా యాత్రలో పాల్గొన్నారు.

# యువశక్తితోనే దేశ ప్రగతి.. పెద్దపల్లిలో ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ

- విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించాలి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** యువశక్తిని సద్వినియోగం చేసుకుంటే దేశం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు అన్నారు. విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే దేశభక్తి, జాతీయ భావాలను పెంపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.గురువారం పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా భారీ జెండా ర్యాలీని ఆయన ప్రారంభించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రే సంజీవరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ తిరంగా యాత్రలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. చేతుల్లో జాతీయ జెండాలను పట్టుకుని విద్యార్థులు కదం తొక్కగా, ర్యాలీ దేశభక్తి నినాదాలతో హోరెత్తింది. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడుతూ హర్ ఘర్ తిరంగా వంటి కార్యక్రమాలు ప్రజల్లో దేశభక్తి, జాతీయ భావాలను మరింతగా పెంపొందించేందుకు దోహదపడతాయని అన్నారు. జాతీయ జెండా పట్ల గౌరవం, దేశం పట్ల ప్రేమ, సేవా భావాన్ని విద్యార్థుల్లో పెంపొందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రపంచంలోనే అత్యధిక యువత కలిగిన దేశంగా భారత్ ఉందని, యువత ప్రతిభను సరైన మార్గంలో వినియోగించుకుంటే దేశం అన్ని రంగాల్లో మరింత ముందుకు సాగుతుందని రాంచందర్‌రావు తెలిపారు. భారత్‌ను ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించడంతో పాటు విద్యా రంగంలోనూ అనేక సంస్కరణలు చేపట్టినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు, యువత భవిష్యత్తుకు మెరుగైన అవకాశాలు కల్పించేందుకు దేశవ్యాప్తంగా మెడికల్ కళాశాలలు, యూనివర్సిటీలను విస్తరిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు దేశభక్తి, క్రమశిక్షణ, సేవా భావంతో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. భారీ సంఖ్యలో విద్యార్థులు జాతీయ జెండాలతో ర్యాలీలో పాల్గొనడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలకు నాయకులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మల్క కొమురయ్య, గోమాస శ్రీనివాస్, గొట్టిముక్కల సురేష్‌రెడ్డి, నల్ల మనోహర్‌రెడ్డి, చందుపట్ల సునీల్‌రెడ్డి, బల్మూరి వనిత, మీస అర్జున్‌రావు, కందుల సంధ్యారాణి, చల్ల నారాయణరెడ్డి, పెంజర్ల రాకేష్, కావేటి రాజగోపాల్, ఊషణ అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.





# విద్యార్థులకు శాపంగా మారిన హోల్ సేల్ కూరగాయల మార్కెట్

- ఉదయం పూట ప్రశాంతంగా ప్రేయర్ అసెంబుల్ చేసుకోలేని పరిస్థితుల్లో విద్యార్థులు
- నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ కళాశాల స్థలంలో దుకాణాల సముదాయం
- చోద్యం చూస్తున్న మున్సిపల్ సింగరేణి అధికారులు

**గోదావరిఖని టౌన్ (ది క్రైమ్ న్యూస్):** గోదావరిఖని ప్రభుత్వ బాలుర కళాశాల మైదానంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన హోల్ సేల్ కూరగాయల మార్కెట్ సముదాయం వల్ల రోజు రోజుకు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని వెంటనే హోల్ సేల్ మార్కెట్ ని అక్కకి నుండి మేదర్ బస్తి కూరగాయల మార్కెట్ కు తరలించాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) పెద్దపల్లి జిల్లా కార్యదర్శి కొంటు సాగర్ అధికారులను డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి కాలంలో మేదర్ బస్తి కూరగాయల మార్కెట్ ప్రాంగణంలో ఉన్న హోల్ సేల్ వ్యాపారులకు మౌలిక సదుపాయాలు కలిపించాలనే ఉద్దేశంతో అధికారులు హోల్ సేల్ మార్కెట్ ని తాత్కాలికంగా ప్రభుత్వ బాలుర కళాశాల మైదానంలో ఏర్పాటు చేయడం జరిగిందని వారు గుర్తు చేశారు. మేదర్ బస్తీలో నిర్మాణాలు పూర్తయినప్పటికీ ఇప్పటికీ హోల్ సేల్ మార్కెట్ సముదాయాన్ని తరలించకపోవడంతో రోజు రోజుకు కళాశాల విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు మార్కెట్ వ్యక్తులు అక్కడికి



వచ్చే వాహనదారులు ఇష్టానుసారంగా ద్విచక్ర వాహనాలు డీసీఎం వ్యాన్లు ఇతర వాహనాలను పార్కింగ్ చేయడంతో ఉదయం పూట విద్యార్థులు ప్రేయర్ అసెంబుల్ చేసుకోవడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరో వైపు సాయంత్రం అయ్యిందంటే వైన్స్ షాప్ లో పర్మిట్ రూమ్ వల్లే కళాశాల మైదానం మొత్తం కూడా అసాంఘిక కార్యక్రమాలకి అడ్డాగా మారుతుండడం సాయంత్రం వేళ ఆ రోడ్డు వైపున వెళ్లాలన్న బస్టాప్ లో నిలబడాలన్న మహిళలు తీవ్ర భయాందోళనలకు



గురికావడం జరుగుతుంది అని అన్నారు. పారిశ్రామిక ప్రాంతంలో బహిరంగ మద్యపానం నిషేధమని సంబంధిత అధికారులు చెప్తా ఉన్న క్షేత్రస్థాయిలో మాత్రం అది అమలు కాకపోవటం కళాశాల మైదానంలో దర్శనమిచ్చే మద్యం సీసాలు ఉదాహరణ అని వారన్నారు. మరోవైపు ప్రభుత్వ పాఠశాల కళాశాలకు సంబంధించిన స్థలాలలో వ్యాపార వాణిజ్య సముదాయాలు నిర్వహించకూడదని చట్టాలు చెబుతున్నా కానీ రామగుండం కార్పొరేషన్ మున్సిపల్ సింగరేణి అధికారుల అవగాహన లోపం వల్ల ఇక్కడ భారీ దుకాణాల సముదాయాల నిర్మాణం జరుగుతుందని వెంటనే ఈ నిర్మాణాల పైన సమగ్ర విచారణ జరపాలని కళాశాల యొక్క బ్లూ ప్రింట్ ప్రజలకు బహిర్గతం చేసి కళాశాల స్థలాన్ని కాపాడాలని అధికారులను వారు డిమాండ్ చేశారు. అంతేకాకుండా విద్యాశాఖ నుండి దుకాణాల సముదాయానికి తీసుకున్న జీవో ఆర్డర్ కాపీలను కూడా బహిర్గతం చేయాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని వారి సందర్భంగా హెచ్చరించారు.

# మెడికవర్‌లో ప్రతినెల 2వ గురువారం ఉచిత క్యాన్సర్ శిబిరం

- మొదటి శిబిరంలో 186 మందికి పరీక్షలు 26 మందికి పాజిటివ్

**కరీంనగర్ టౌన్, ఆగస్టు13 (ది క్రైమ్ న్యూస్):** క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తిస్తే మెరుగైన చికిత్సతో వ్యాధి నుంచి త్వరగా బయటపడే అవకాశం ఉంటుందని హైదరాబాద్ మెడికవర్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ అంకాలజిస్టులు డాక్టర్ అన్వేష్, డాక్టర్ నీలేష్, డాక్టర్ స్నేహ సూచించారు. కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రిలో గురువారం నిర్వహించిన ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరానికి మొత్తం 186 మంది హాజరై క్యాన్సర్ సంబంధిత స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోగా, 26 మందికి పాజిటివ్ వచ్చినట్లు వైద్యులు వెల్లడించారు. క్యాన్సర్ కేసుల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ఇకపై ప్రతి నెల రెండో గురువారం కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రిలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని నిర్వహించాలని నిర్ణయించినట్లు వైద్యులు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ముందస్తు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన సదస్సులో వైద్యులు మాట్లాడుతూ కరీంనగర్‌లో ముఖ్యంగా బ్రెస్ట్ క్యాన్సర్ కేసులు అధికంగా నమోదవుతున్నాయని తెలిపారు. మహిళల్లో ప్రతి ఎనిమిది మందిలో ఒకరికి బ్రెస్ట్ క్యాన్సర్ రావడం వ్యాధి తీవ్రతను తెలియజేస్తుందని పేర్కొన్నారు. అయితే క్యాన్సర్ లక్షణాలు స్పష్టంగా బయటపడకముందే స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం ద్వారా వ్యాధిని తొలిదశలో గుర్తించి తగిన చికిత్స అందించవచ్చున్నారు. క్యాన్సర్‌ను నిర్లక్ష్యం చేస్తే వ్యాధి దశ పెరిగే కొద్దీ తీవ్రత కూడా పెరుగుతుందని, తద్వారా చికిత్స మరింత క్లిష్టతరంగా మారే అవకాశం ఉంటుందని వైద్యులు



హెచ్చరించారు. ఊబకాయం బారిన పడకుండా ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను పాటించడం, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా అనేక ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించవచ్చున్నారు. క్యాన్సర్ బారిన పడకుండా కొంతమందినైనా కాపాడాలనే ఉద్దేశంతో మెడికవర్ ఆసుపత్రి యాజమాన్యం ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాలను నిర్వహిస్తోందని వైద్యులు తెలిపారు. ముందస్తు గుర్తింపు, సరైన సమయంలో చికిత్స, ఆరోగ్యకరమైన జీవనశైలి ద్వారా క్యాన్సర్‌ను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని పేర్కొన్నారు. మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ అవగాహన సదస్సులో క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ సెంటర్‌హెడ్ సంపత్, మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్, పీఆర్ అబ్దుల్‌వకీల్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు పి ఆర్ సి ని వెంటనే అమలు చేయాలి

**శిక్షణ పేరుతో ఉపాధ్యాయులను తరగతికి గదులకు దూరం చేయొద్దు**

**రంగారెడ్డి జిల్లా ఉపాధ్యాయ సంఘాల కార్యదర్శి బి బుగ్గరాములు**



**మహేశ్వరం ఆగస్టు 13, (ది క్రైమ్ న్యూస్):** ఉపాధ్యాయులకు దక్కాల్సిన పి ఆర్ సి ని వెంటనే అమలు చేయాలని రంగారెడ్డి జిల్లా ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ కార్యదర్శి బి బుగ్గరాములు పేర్కొన్నారు. మహేశ్వరం మండల కేంద్రంలో టీఎస్ యుటిఎఫ్ మహేశ్వరం మండల నాయకులు ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ యూఎస్పిసి దశలవారి పోరాటంలో భాగంగా మహేశ్వరం తాహసిల్దార్ చిన్నప్పలనాయుడుకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు ఉపాధ్యాయ పెన్షనర్లకు పెండింగ్లో ఉన్న ఆరు విడుదల డిఏలు వెంటనే విడుదల చేయాలన్నారు. కాంట్రాక్టు టీచర్లుగా పనిచేస్తున్న డీఎస్సీ ఉపాధ్యాయులకు 12 నెలల వేతనం అందజేయాలన్నారు. విద్యా సంవత్సరంలో పాఠశాలలు ప్రారంభమైన తర్వాత ఉపాధ్యాయులను శిక్షణ పేరుతో తరగతి గదులకు దూరం చేయొద్దన్నారు. వేసవి సెలవుల్లోనే అన్ని శిక్షణ తరగతులను పూర్తి చేయాలని వారు డిమాండ్ చేశారు. మరిన్ని ప్రధానమైన డిమాండ్లతో పాటు ఉపాధ్యాయ రంగ సమస్యలపై తహసిల్దార్ కు వినతిపత్రం అందించామని తెలిపారు .ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు జే ఆంజనేయులు ,ప్రధాన కార్యదర్శి సి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ఆజాద్ పాషా, నాయకులు వెంకట్ చారి విష్ణుమూర్తి, సతీష్ శ్రీధర్, సిపి నాయుడు, శ్రీనివాస్ చారి, సీతారాం ,జంగయ్య, మహిపాల్ రెడ్డి ,శ్రీశైలం ,సరస్వతి, సుమలత, వేలంగిని ,లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

## మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం



**సంగారెడ్డి జిల్లా (ది క్రైమ్ న్యూస్):** ముత్తంగి డివిజన్, ఇస్నాపూర్ మున్సిపల్ సరిహద్దు కాలనీల ప్రజలు ఎదుర్కొంటున్న మొరిగినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపడుతున్నామని పటాన్‌చేరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం ఇస్నాపూర్ మున్సిపల్, ముత్తంగి డివిజన్ ఇంజనీరింగ్ శాఖల అధికారులతో కలిసి కాలనీలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముత్తంగి డివిజన్ పరిధిలోని వివిధ కాలనీల నుండి వచ్చే మురుగు నీటిని ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని యుజిడిల ద్వారా తరలించాల్సి వస్తోందని తెలిపారు. యుజిడిల పైపు సామర్థ్యం తక్కువ ఉండడం మూలంగా నిరంతరం సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని ఆయా శాఖల అధికారులు ఎమ్మెల్యే జిఎంఆర్ దృష్టికి తీసుకెళ్లారు. రెండు శాఖల అధికారులు సమన్వయంతో జనాభాకు అనుగుణంగా నూతన అంతర్గత మురుగు నీటి కాలువల పైపులైన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి అతి త్వరలో నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇస్నాపూర్ మున్సిపల్ కమిషనర్ వెంకట కిషన్ రావు, డిఈలు కృష్ణవేణి, నరసింహ రావు, మాజీ జడ్పీటీసీ శ్రీకాంత్ గౌడ్, సీనియర్ నాయకులు శ్రీకాంత్, కౌన్సిలర్లు ఆంజనేయులు, వెంకటేష్, మేరాజ్ ఖాన్, నిజాముద్దీన్ బాబా, అబిద్, కాలనీల ప్రజలు పాల్గొన్నారు.

## సంక్షేమమనేది పార్టీ కోసం కాదు... ప్రజలందరి కోసం: అర్హులైన ప్రతి కుటుంబానికి పథకాలు అందించాలి: గట్టెపల్లి దీపక్



**తిమ్మాపూర్, ఆగస్టు13(ది క్రైం న్యూస్):** గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందాయని, కానీ నేడు పథకాలు అర్హత ఆధారంగా అందుతాయా...? పార్టీ నాయకుల సిఫార్సుల ఆధారంగా అందుతాయా...? అన్నదే ప్రజలకు ప్రశ్నగా మారిందంటూ కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం అలుగునూరు బిఆర్ఎస్ 8వ డివిజన్ అధ్యక్షుడు గట్టెపల్లి దీపక్ ఒక ప్రకటనను విడుదల చేశారు. ప్రజాస్వామ్యంలో పార్టీ వేరు – ప్రభుత్వం వేరని, పార్టీ కార్యకర్తలకు మాత్రమే కాకుండా ప్రతి పేద కుటుంబానికి పథకాలు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఎవరికి ఓటు వేశారనేది కాక అర్హత మాత్రమే పథకాలకు ప్రమాణం కావాలని హితువు పలుకుతూ ప్రజల హక్కులను రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించకుండా అర్హత గల ప్రతి కుటుంబానికి పథకాలు అందించాల్సిందిగా 8వ డివిజన్ ప్రజల తరఫున ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు గట్టెపల్లి దీపక్ ప్రకటనలో తెలిపారు.

## ఘనంగా ఎంపీ రేణుక చౌదరి జన్మదిన వేడుకలు

**రేణుక చౌదరి సేవలు కొనియాడిన జవ్వాజి ఆనందరావు**



**మధిర ప్రతినిధి, (ది క్రైమ్ న్యూస్):** ప్రజాసేవే పరమావధిగా,పేదల పట్ల ఆప్యాయతగా నిలిచే రేణుక చౌదరి పుట్టినరోజు సందర్భంగా మధిర పట్టణం లో ఘనంగా వేడుకలు,గురువారం నాడు జవ్వాజి ఆనందరావు ఆఫీసులో వారి మిత్రబృందం కేక్ కట్ చేసి ఫోన్లో రేణుక చౌదరి కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపినారు, మధిరలో ఆదరణ అనాథాశ్రమంలో వృద్ధులకు వికలాంగులకు నిత్యావసర సరుకులు, పండ్లు బిస్కెట్లు పంపిణీ చేశారు., ఆర్కే అనాథాశ్రమంలో 30 మంది వృద్ధులకు మానసిక వికలాంగులకు భోజనం, పండ్లు పంపిణీ చేశారు. రేణుక చౌదరి సేవా స్ఫూర్తి మరెందరికో ఆదర్శం అని జవ్వాజి ఆనందరావు మాట్లాడుతూ రేణుకమ్మ సేవాస్ఫూర్తి మరెందరకో ఆదర్శం రేణుకా చౌదరి బడుగు బలహీన వర్గాలకు ఆశాజ్యోతి అని పేదల పాలిట పెన్నిధి అని మరియు మరిన్ని ఉన్నత ఉన్నత పదవులు అధిరోహించాలి అని దేవుని ఆశీస్సులు ఆమెకి మెండుగా ఉండాలని మరొక్కసారి జన్మదిన శుభాకాంక్షలు జవాజి ఆనందరావు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిసిసి కార్యదర్శి కర్లపూడి అప్పారావు, మండల నాయకులు ఆవులు గురుబ్రహ్మం, జిల్లేపల్లి ప్రసాద్ సత్యనారాయణ రెడ్డి మ వారి మిత్రబృందం పాల్గొన్నారు.

## కేంద్ర బీజేపీ ప్రజా వ్యతిరేక పాలనకు వ్యతిరేకంగా పోరాడుదాం: మంద సుదర్శన్



**ఇల్లంతకుంట, ఆగస్టు13(ది క్రైం న్యూస్):** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇలంతకుంట మండలంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మంద అనిల్ కుమార్, సావనపెల్లి మల్లేశం ఆధ్వర్యంలో పొత్తూర్ బ్రిడ్జ్ నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు ప్రజా చైతన్య ప్రచార పాదయాత్రను నిర్వహించారు.సిపిఐ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్ హాజరై మాట్లాడుతూ...ఈనెల 6 నుండి 14 వరకు దేశవ్యాప్త రాజకీయ ప్రచార పాదయాత్రలు సెప్టెంబర్ 1న ఢిల్లీలోని రామ్ లీలా మైదానంలో జరగబోయే “బద్లావ్ జరూరీ హై” ర్యాలీలతో ముగుస్తాయన్నారు.కేంద్ర బిజెపి ప్రభుత్వం ధరల పెరుగుదలను తక్షణమే అరికట్టి సార్వత్రిక విద్య, ఆరోగ్యం అందుబాటులోకి తెచ్చి పంటలకు కనీస మద్దతు ధర,ప్రతి యువకుడికి ఉద్యోగం కల్పించి మహిళా రిజర్వేషన్ తక్షణమే అమలు చేసి కార్మికుల హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలో ఉన్న దశబ్దంలో ఆందోళన, నిరాషా, కష్టాలకు దారి తీసి, ఎన్నికల వాగ్దానాలకు బదులుగా దేశంలో నిరుద్యోగం, భరించలేనీ ద్రవ్యోల్బణం, విస్తరిస్తున్న అసమానతలు బలహీనపడిన గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కుంచించుకుపోయిందన్నారు. భారత రాజ్యాంగాన్ని మార్చడం కొరకు మోడీ ప్రభుత్వం విశ్వ ప్రయత్నాలు చేస్తున్నందున దేశ ప్రజలకు అన్యాయం చేస్తే వామపక్ష పార్టీలుగా పోరాటంలో ముందుండి కొట్లాటకు సిద్ధపడతామని హెచ్చరించారు.నాయకులు భూంపెల్లి భూమిరెడ్డి, కాదురు మొండయ్య, పెండెల అధిత్య, గుంటి బక్కయ్య, గుంటి తిరుపతి, రాజయ్య, దొమ్మరి కనకయ్య, కోల వెంకటయ్య, గొట్లముక్కుల రాజయ్య, చిగుర్ల అనీల్, తోట్ల రాజు, అశోక్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సాంఘిక సంక్షేమశాఖ గురుకులాల టెండర్‌లలో అక్రమాలను అరికట్టాలి

**సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల జోనల్ అధికారి కి పి డి ఎస్ యు వినతిపత్రం**



**ఖమ్మం ప్రతినిధి, (ది క్రైమ్ న్యూస్) ఆగష్టు 13:** సాంఘిక సంక్షేమ గురుకులాల టెండర్లు, కొనుగోళ్లలో పారదర్శకత పాటించాలని, విద్యార్థుల సంక్షేమ నిధుల దుర్వినియోగాన్ని అరికట్టాలని పి డి ఎస్ యు సాంఘిక సంక్షేమ గురుకులాల జోనల్ అధికారి అపర్ణకు వినతిపత్రం అందజేశారు. టెండర్దారులు, ప్రిన్సిపాళ్లు, అధికారుల మధ్య కుమ్మక్కు జరుగుతోందనే ఆరోపణలు, అధిక ధరలకు కొనుగోళ్లు, నాణ్యత లేని సామగ్రి సరఫరా వంటి ఫిర్యాదులపై స్వతంత్ర విచారణ జరపాలని పిడిఎస్ యూ జిల్లా అధ్యక్షులు బుర్ర వీరభద్రం కోరారు. టెండర్ పత్రాలు, ఎల్1/ఎల్2 వివరాలు, బిల్లులు, స్టాక్ రిజిస్టర్లు, సరఫరా వివరాలను బహిరంగంగా పరిశీలించడంతో పాటు క్షేత్రస్థాయిలో ఫిజికల్ వెరిఫికేషన్, క్వాలిటీ టెస్ట్ నిర్వహించాలని డిమాండ్ చేసారు. విద్యార్థుల కోసం కేటాయించిన ప్రజాధనం దళారులు, కాంట్రాక్టర్ల జేబుల్లోకి వెళ్తే అనుమతించేది లేదని హెచ్చరించింది. అక్రమాలు రుజువైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, గురుకులాల కొనుగోళ్లలో పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని డిమాండ్ చేసారు.

# గచ్చిబౌలిలో ఘనంగా తిరంగా ర్యాలీ

- దేశభక్తి, జాతీయ ఐక్యతను చాటేలా ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి: రవికుమార్ యాదవ్
- ఆగస్టు 15 వరకు ఇళ్లు, వ్యాపార సంస్థలపై జాతీయ జెండా ఎగురవేయాలి: గంగాధర్ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, దేశభక్తి, జాతీయ ఐక్యతను చాటిచెప్పేందుకు కేంద్ర ప్రభుత్వం, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు గచ్చిబౌలి డివిజన్‌లో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. నానక్‌రామ్‌గూడ నుంచి గోపన్‌పల్లి వరకు నిర్వహించిన ఈ ర్యాలీలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్, గచ్చిబౌలి తాజా మాజీ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ జాతీయ జెండా 140 కోట్ల మంది భారతీయుల ఆత్మగౌరవానికి, స్వాతంత్ర్యం కోసం ఎందరో సమరయోధులు చేసిన త్యాగాలకు, దేశ ఐక్యతకు ప్రతీక అని అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని ప్రతి ఇంటిలో ఒక పండుగలా జరుపుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపును ప్రజలు పాటించాలని కోరారు. ప్రతి ఇంటిపై తిరంగా ఎగురవేయడం ద్వారా చిన్నారుల్లో చిన్ననాటి నుంచే దేశం పట్ల భక్తి, గౌరవం, బాధ్యత పెంపొందుతాయని తెలిపారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన పోరాట యోధుల త్యాగాలను స్మరించుకోవడానికి హర్ ఘర్ తిరంగా కార్యక్రమం గొప్ప అవకాశమన్నారు. సరిహద్దుల్లో ఎండ, వానలను లెక్కచేయకుండా రాత్రింబవళ్లు దేశాన్ని కాపాడుతున్న సైనికులకు గౌరవప్రదంగా వందనం సమర్పించే వేదికగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిలుస్తుందని పేర్కొన్నారు. దేశంలో తయారయ్యే వస్తువులను ప్రోత్సహిస్తూ, మనకు అవసరమైన వస్తువులను మనమే తయారు చేసుకుని, స్వదేశీ ఉత్పత్తులను వినియోగించాలని పిలుపునిచ్చారు. వికసిత్ భారత్ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. గచ్చిబౌలి తాజా మాజీ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ ఆగస్టు 15 వరకు గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై, వ్యాపార సంస్థలపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు హనుమంత్ నాయక్, డివిజన్ అధ్యక్షుడు శివా సింగ్, సీనియర్ నాయకులు వసంత్ కుమార్ యాదవ్, స్వామి గౌడ్, లక్ష్మణ్, నరేందర్ యాదవ్, దయాకర్, కిషన్ గౌలి, తిరుపతి, ప్రకాష్, సూర్య, బబ్లూ సింగ్, రాజు, దినేష్ యాదవ్, రాకేష్, ఆసవరి, అంబన్, ప్రసాద్, శేఖర్, సుమన్, శ్రీశైలం, రవీంద్రతో పాటు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తెల్లాపూర్‌లో రూ.48 కోట్లతో ఆధునిక ప్రభుత్వ పాఠశాల

- ఆగస్టు 17న భూమిపూజ.. ఎకరా స్థలంలో కేజీ నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యాబోధన
- పేద, మధ్యతరగతి విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య ఉచితంగా అందించడమే లక్ష్యం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**సంగారెడ్డి జిల్లా (ది క్రైమ్ న్యూస్) రామచంద్రపురం:** పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా తెల్లాపూర్‌లో రూ.48 కోట్ల అంచనా వ్యయంతో అత్యాధునిక ప్రభుత్వ పాఠశాల నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నట్లు పటాన్ చేరు శాసనసభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలోని తెల్లాపూర్‌లో ఎకరా విస్తీర్ణంలో నిర్మించనున్న ఈ పాఠశాలలో ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు ఒకే ప్రాంగణంలో విద్యాబోధన అందించనున్నట్లు వెల్లడించారు. గురువారం వివిధ శాఖల అధికారులతో కలిసి పాఠశాల నిర్మించనున్న తెల్లాపూర్‌లోని సర్వే నంబర్ 323, గద్దర్ విగ్రహం వెనుక ప్రాంతాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. పాఠశాల నిర్మాణానికి సంబంధించిన స్థల పరిస్థితులు, అందుబాటులో ఉన్న మౌలిక వసతులు, నిర్మాణ ప్రణాళిక తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అత్యుత్తమ విద్య అందించాలన్నదే తమ లక్ష్యమని తెలిపారు.ఆర్థిక స్థోమతతో సంబంధం లేకుండా ప్రతి విద్యార్థికి సమానమైన, నాణ్యమైన విద్య అందుబాటులో ఉండాలని అన్నారు. ఒకే ప్రాంగణంలో ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యను అందించడం ద్వారా విద్యార్థులకు నిరంతర విద్యా వాతావరణం కల్పించవచ్చని తెలిపారు. ప్రస్తుత పోటీ ప్రపంచానికి అనుగుణంగా విద్యార్థుల సమగ్ర వికాసానికి అవసరమైన అన్ని సౌకర్యాలను పాఠశాలలో ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. విశాలమైన ఆటస్థలాలు, డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, అత్యాధునిక సైన్స్ ల్యాబ్‌లు, కంప్యూటర్ ల్యాబ్‌లు, సమృద్ధిగా పుస్తకాలతో లైబ్రరీలు, ఇతర ఆధునిక విద్యా సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. విద్యతో పాటు క్రీడలు, సాంకేతిక పరిజ్ఞానం, సృజనాత్మకత వంటి అంశాలకు సమాన ప్రాధాన్యతనిస్తూ విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేయనున్నట్లు చెప్పారు. పెరుగుతున్న జనాభా, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తెల్లాపూర్ ప్రాంతంలో ఆధునిక ప్రభుత్వ పాఠశాల అవసరం ఉందని, ఈ పాఠశాల అందుబాటులోకి వస్తే పరిసర ప్రాంతాల్లోని పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వందలాది మంది విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు. ఆగస్టు 17న నూతన ప్రభుత్వ పాఠశాల నిర్మాణానికి భూమిపూజ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి వెల్లడించారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో, వేగవంతంగా పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను సూచించారు. తెల్లాపూర్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న ఈ పాఠశాల భవిష్యత్ తరాలకు విద్యా కేంద్రంగా నిలవడంతో పాటు, ప్రభుత్వ విద్యా రంగంలో నూతన ప్రమాణాలకు నాంది పలుకుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పటాన్ చేరు సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జ్యోతి రెడ్డి, సీనియర్ నాయకులు సోమిరెడ్డి, దేవేందర్ యాదవ్, మాజీ కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


# పటాన్‌చెరు జర్నలిస్టుల ఐక్యతకు రాష్ట్ర స్థాయిలో ప్రశంసలు

- త్వరలో పటాన్‌చెరులో రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహిద్దాం: కే. విరహత్ అలీ - విరాహత్ అలిని మర్యాదపూర్వకంగా కలిసిన పటాన్ చేరు నూతన కార్యవర్గం



**సంగారెడ్డి జిల్లా (ది క్రైమ్ న్యూస్)పఠాన్ చేరు:** టీయూడబ్ల్యూజే-ఐజేయూ పటాన్‌చెరు నియోజకవర్గ నూతన కార్యవర్గం ఎన్నికైన సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు కే. విరహత్ అలీని గురువారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని యూనియన్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి అధ్యక్షతన, పటాన్‌చెరు నియోజకవర్గ అధ్యక్షుడు పత్తి నరసింహ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు కే. విరహత్ అలీ మాట్లాడుతూ పటాన్‌చెరు నియోజకవర్గంలో ఇటీవల నిర్వహించిన జర్నలిస్టుల సమావేశం కనీవినీ ఎరుగని రీతిలో విజయవంతమై రాష్ట్రవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించిందని ప్రశంసించారు. సంఘం పట్ల జర్నలిస్టుల్లో విశ్వాసాన్ని పెంపొందించేలా కార్యవర్గం పనిచేసిందని కొనియాడారు. టీయూడబ్ల్యూజే-ఐజేయూ సంఘానికి 75 ఏళ్ల ఘన చరిత్ర ఉందని పేర్కొన్న ఆయన, క్రమశిక్షణకు మారుపేరైన ఈ సంఘంలో ప్రతి జర్నలిస్టు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. పదవి అనేది అధికారం కాదని, అది ఒక బాధ్యత మాత్రమేనని అన్నారు. అహంకారానికి దూరంగా ఉండి సేవాభావంతో పనిచేసినప్పుడే పదవికి గౌరవం లభిస్తుందని తెలిపారు. త్వరలో రాష్ట్రస్థాయి సమావేశాన్ని పటాన్‌చెరులో భారీ స్థాయిలో నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, అందుకు స్థానిక కార్యవర్గం సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో పటాన్‌చెరుకు ప్రత్యేక గుర్తింపు ఉందని, ఆ ప్రాంతం ప్రత్యేక అనుభూతి కలిగి ఉందని, ఆ ప్రాముఖ్యతను మరింత పెంచేలా నూతన కార్యవర్గం పనిచేయాలని సూచించారు. సంఘాన్ని బలోపేతం చేయడంతో పాటు జర్నలిస్టుల హక్కుల సాధన కోసం నిరంతరం కృషి చేయాలని అన్నారు. యూనియన్ కోసం నిస్వార్థంగా కష్టపడే ప్రతి కార్యకర్తను నాయకత్వం గుర్తిస్తుందని, వారి సేవలను ఎల్లప్పుడూ గౌరవిస్తుందని విరహత్ అలీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే--ఐజేయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్న బసవేశ్వర్, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనాథ్, జిల్లా జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా జాయింట్ సెక్రటరీ భూపాల్ రెడ్డి, చిన్న, మధ్య తరహా పేపర్ల సంఘం జిల్లా జనరల్ సెక్రటరీ ఈశ్వర్ చౌహాన్, పటాన్చెరు నియోజకవర్గం ఉపాధ్యక్షులు శివకుమార్, శ్రీనివాస్, కోశాధికారి శ్రీనివాస్ రెడ్డి, ఈసీ మెంబర్లు శేఖర్, సిద్దు, పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు. నూతన కార్యవర్గ సభ్యులకు రాష్ట్ర, జిల్లా నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

## జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలి



**సంగారెడ్డి జిల్లా (ది క్రైమ్ న్యూస్) పఠాన్ చేరు:** తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ టి యూ డబ్ల్యు జె?ఐ జె యూ రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీని సంగారెడ్డి జిల్లా నూతన కమిటీ సభ్యులు, పటాన్‌చెరు నియోజకవర్గ నూతన కమిటీ సభ్యులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బి. యాదగిరి, జిల్లా ప్రధాన కార్యదర్శి రుమాండ్ల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో నూతన కమిటీ సభ్యులు రాష్ట్ర యూనియన్ కార్యాలయంలో విరాహత్ అలీని పూలమాలలు, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా విరాహత్ అలీ మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లా, పటాన్‌చెరు నియోజకవర్గ నూతన కమిటీలకు శు భాకాంక్షలు తెలిపారు. యూనియన్ బలోపేతానికి ప్రతి సభ్యుడు కృషి చేయాలని, జర్నలిస్టుల సమస్యలపై జిల్లా, నియోజకవర్గ స్థాయిలో ఐక్యంగా పోరాడాలని సూచించారు. జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం టి యూ డబల్యు జె ఐ జె యూ నిరంతరం అలుపెరగని పోరాటం చేస్తోందన్నారు. జర్నలిస్టుల హెల్త్ కార్డుల సమస్య పరిష్కారం కోసం యూనియన్ కృషి చేస్తోందని, త్వరలో సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు. జర్నలిస్టులంతా ఐక్యంగా ఉండి తమ సమస్యలను సాధించుకునేందుకు సమష్టిగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా, పటాన్‌చెరు నియోజకవర్గ నూతన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## దుర్గాదేవి ఆలయ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక





**కుత్బుల్లాపూర్ , భౌరంపేట్, (ది క్రైమ్ న్యూస్) ఆగస్టు 13:** భౌరంపేట్ శ్రీ దుర్గాదేవి ఆలయ నూతన కమిటీని గ్రామ పెద్దలు, నాయకులు, భక్తుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వెంకట్రామ్ ఆనంద్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా వి. సుభాష్‌రెడ్డి, కె. సందీప్‌చారి, కోశాధికారిగా ఈ. లక్ష్మీకాంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా దుబ్బ విష్ణు, సంయుక్త కార్యదర్శిగా కె. నవీన్‌చారి ఎన్నికయ్యారు.. కార్యవర్గ సభ్యులుగా ఈ. కృష్ణారెడ్డి, ఈ. జాంగా రెడ్డి, జి. బుచ్చిరెడ్డి, ఎన్. హన్మంత్‌రెడ్డి, చింత వెంకటేష్, నామాల రాము, డి. మహేష్, చ. శ్రీకాంత్‌రెడ్డిలను ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులను గ్రామ పెద్దలు శాలువాలతో సన్మానించి అభినందించారు. ఆలయ అభివృద్ధికి కమిటీ సభ్యులంతా ఐక్యంగా కృషి చేయాలని, భక్తులు, గ్రామస్థులను భాగస్వాములను చేస్తూ ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయాలని గ్రామ పెద్దలు సూచించారు. కార్యక్రమంలో నాయకులు, పెద్దలు, యువకులు, భక్తులు పాల్గొన్నారు.

## టీఆర్ఎస్‌లోకి కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల చేరిక



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** టీఆర్ఎస్ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ ఆధ్వర్యంలో సురేష్ శంకరోళ్లతో పాటు మియాపూర్, కొండాపూర్ డివిజన్లకు చెందిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన సుమారు 30 మంది నాయకులు గురువారం టీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలు, 2028 అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేసి పార్టీ విజయానికి పనిచేయాలని, కవితను ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో అన్ని వర్గాల ప్రజల నుంచి టీఆర్ఎస్‌కు విశేష మద్దతు లభిస్తోందని పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారిలో సురేష్ శంకరోళ్ల, మధు కిరణ్, నరేంద్ర రెడ్డి, రాణి, పార్వతమ్మ, వరమ్మ, సరోజ, అంజమ్మ, భూదేవి, దిలీప్, వెంకటేష్, మహేష్, మధుబాబు తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కిషోర్, లావణ్య బండారి, విష్ణు, దయానంద్ గుండె, మురుగేసన్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

### ఏరియా స్టోర్స్ కార్మికులను కలిసిన నూతన బ్రాంచ్ కార్యదర్శి గట్టయ్య



**ఖమ్మం ప్రతినిధి, (ది క్రైమ్ న్యూస్) ఆగస్టు 13:** కార్మికుల సమస్యలను ఎప్పటికప్పుడు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఏఐటీయూసీ కొత్తగూడెం ఏరియా నూతన బ్రాంచ్ కార్యదర్శి జె. గట్టయ్య అన్నారు. గురువారం కొత్తగూడెం ఏరియా స్టోర్స్‌ను ఆయన సందర్శించి కార్మికులను కలిశారు. నూతనంగా బ్రాంచ్ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన గట్టయ్యకు ఏరియా స్టోర్స్ కార్మికులు ఘనంగా సన్మానం చేసి శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను గట్టయ్య అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా స్టోర్స్‌లో అవసరమైన మేరకు మ్యాన్‌పవర్‌ను పెంచాలని, కార్మికులకు ప్లే డేలు, పీహెచ్‌డీలను పెంచడంతోపాటు ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరారు. అనంతరం ఏరియా స్టోర్స్ డీజీఎం మైనేని శ్రీనివాసరావును గట్టయ్య మర్యాదపూర్వకంగా కలిసి కార్మికుల సమస్యలపై విస్తృతంగా చర్చించారు. స్టోర్స్‌లో పని పరిస్థితులు, సిబ్బంది కొరత, కార్మికుల సంక్షేమానికి సంబంధించిన అంశాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కార్మికుల సమస్యల పరిష్కారం విషయంలో ఏఐటీయూసీ రాజీపడే ప్రసక్తే లేదని గట్టయ్య స్పష్టం చేశారు. ఏరియా స్టోర్స్‌కు సంబంధించిన సమస్యలపై ఇప్పటికే అధికారులతో చర్చలు జరుపుతున్నామని, ఒక్కో సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించే దిశగా కృషి చేస్తున్నామని తెలిపారు. కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం యూనియన్ నిరంతరం అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. త్వరలోనే పెండింగ్ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆఫీస్ బ్యారర్స్ సందబోయిన శ్రీనివాస్, ఆర్.సి. హెచ్.పి పిట్ కార్యదర్శి సురేందర్, ఏరియా స్టోర్స్ పిట్ కార్యదర్శి, కమల్ (శ్రీనివాస్), ఎస్ ఒ పి సి పిట్ కార్యదర్శి రాంబాబు, నాయకులు రాజాలపూడి సాంబమూర్తి , అవినాష్, వేముల నరేష్, లికిత్, సాగర్, సురేష్, రాజేష్, మెయిన్, గావిని నాగరాజు, పడాల కృష్ణ, డి ఎల్ ఆర్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటికి వెళ్తున్నానని వ్యక్తి అదృశ్యం

### కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు



**మహేశ్వరం ఆగస్టు 13 (ది క్రైమ్ న్యూస్):** ఇంటికి వెళుతున్నానని ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం వికారాబాద్ జిల్లా దుద్యాల గ్రామానికి చెందిన గడ్డం కొండయ్య (46) అదే గ్రామానికి చెందిన భీమయ్య గౌడ్ తో కలిసి తుక్కుగూడ సమీపంలోని శివబాలాజీ హోటల్లో పని చేయడానికి వచ్చారు. ఇద్దరు అదే హోటల్లో పని చేస్తూ అక్కడే నివసిస్తుండేవారు. భీమయ్య గౌడ్ జూన్ 24 తేదీన తన పని నిమిత్తం గ్రామానికి వెళ్ళాడు. కొండయ్య కోసం కుటుంబ సభ్యులు తుక్కుగూడ హోటల్ కు వచ్చి చూడగా లేకపోవడంతో హోటల్ యజమాని మల్లేష్ కొండయ్య సైతం జూన్ 25 తేదీనే తాను కూడా ఇంటికి వెళుతున్నానని చెప్పి జీతం తీసుకుని వెళ్లాడని తెలిపాడు. కానీ కొండయ్య మాత్రం ఇంటికి వెళ్లలేదు కుటుంబ సభ్యులు గురువారం తుక్కుగూడలోని శివ బాలాజీ హోటల్ కి వచ్చి చూస్తే తెలిసింది. కుటుంబ సభ్యులు పహాడిషరీఫ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తప్పిపోయిన వ్యక్తి తెల్ల ముఖం గుండ్రంగా ఎత్తు 5.4 అడుగులు భాష తెలుగు హిందీ మాత్రమే మాట్లాడగలడని తప్పిపోయిన వ్యక్తికి కుడి కన్ను లేదన్నారు. సమాచారం తెలిస్తే పహాడీ షరీఫ్ పోలీస్ స్టేషన్ లో తెలపాలన్నారు.

## సీతారామ ప్రాజెక్టును పూర్తి చేసి గోదావరి జలాలతో అన్ని చెరువులు నింపాలి

### సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి గొర్రెపాటి రమేష్



**ఖమ్మం ప్రతినిధి, (ది క్రైమ్ న్యూస్) ఆగస్టు 13:** తిరుమలాయపాలెం మండలంలో ఈ ఏడాది వర్షపాతం తక్కువగా ఉండటంతో రైతాంగం తీవ్ర ఆందోళనకు గురవుతోందని, ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతులను ఆదుకోవాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి గొర్రెపాటి రమేష్ డిమాండ్ చేశారు. ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ, సీతారామ ప్రాజెక్టు పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి గోదావరి జలాలను మండలంలోని అన్ని చెరువులకు మళ్లించి నింపాలని కోరారు. వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో సాగునీటిపై ఆధారపడిన రైతులు పంటల పరిస్థితిపై ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోకపోతే పంటలకు తీవ్ర నష్టం జరిగే ప్రమాదం ఉందని, రైతులకు సాగునీరు అందించడంతో పాటు అవసరమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. చెరువులు, కుంటలు నింపడం ద్వారా భూగర్భ జలాలను పెంచి రైతులకు సాగునీటి భరోసా కల్పించాలని అన్నారు. అలాగే రైతులకు యూరియా అందుబాటులో లేక ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో యూరియా యాప్ విధానాన్ని తక్షణమే ఎత్తివేసి, రైతులకు అవసరమైనంత యూరియాను ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. యూరియా కోసం రైతులు గంటల తరబడి క్యూలలో నిలబడే పరిస్థితిని నివారించాలని అన్నారు. రైతాంగ సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే ప్రత్యేక చర్యలు చేపట్టి, పంటలను కాపాడేందుకు అవసరమైన సాగునీరు, ఎరువులు అందించాలని గొర్రెపాటి రమేష్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్ మండల అధ్యక్షులు గొర్రెపాటి వీరస్వామి ప్రగతిశీల యువజన సంగం జిల్లా నాయకులు ఎస్కే షబ్బీర్,వీరబాబు పాల్గొన్నారు.

# అధికారుల చుట్టూ తిరిగే వారినే గుర్తిసారా....

● నిజాయితీ, అంకితభావాన్ని గుర్తించి సత్కరించేపేక్కడ.. ● సన్మానాల ఎంపికలో "ఎవరికి ఎంత దగ్గరగా... ● ఆరోపణలు ఉన్నవారి విషయంలోనూ పరిశీలన అవసరం.... జర్నలిస్టులు, ఉపాధ్యాయులు, అంబులెన్స్ సిబ్బంది సంగతేంటి..? కలెక్టర్ చొరవ తీసుకోవాలి.... అధికారికి దగ్గరా.. ప్రజలకు దగ్గరా..? కేవలం పరిపాలన అధికారి చెప్పిన వారికే ప్రశంస పత్రాలు సిగ్గుచేటు.... ?




**మహబూబాబాద్, జిల్లా ప్రతినిధి ఆగస్టు 13 (ది క్రైమ్ న్యూస్):** దేశభక్తి, ప్రజాసేవ, సామాజిక బాధ్యతలను చాటిచెప్పే స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సమాజానికి విశేష సేవలందించిన వ్యక్తులు, సంస్థలను గుర్తించి సత్కరించడం ప్రభుత్వాల బాధ్యత.అయితే మహబూబాబాద్ జిల్లాలో స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా జరిగే సన్మానాల ఎంపికపై భిన్నాభిప్రాయాలు, అసంతృప్తి వ్యక్తమవుతున్నాయి. **అధికారుల చుట్టూ తిరిగేవారికే ప్రాధాన్యం..** ప్రజల మధ్య ఉంటూ సేవ చేసేవారికి గుర్తింపు ఎందుకు లేదనే ప్రశ్నలు జిల్లాలో చర్చనీయాంశంగా మారాయి. ప్రభుత్వ ఉద్యోగులు, సబ్‌ఆర్డినేట్ స్థాయి సిబ్బంది, డ్రైవర్లు, అటెండర్లు తదితరుల నిజాయితీ, అంకితభావాన్ని గుర్తించి సత్కరించడం తప్పు కాదు. అయితే అదే సమయంలో ప్రజల కోసం నిత్యం క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఇతర వర్గాలను కూడా గుర్తించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. **జర్నలిస్టులు, ఉపాధ్యాయులు, అంబులెన్స్ సిబ్బంది సంగతేంటి..?** ప్రజాస్వామ్యంలో ప్రజలకు సమాచారాన్ని అందిస్తూ సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టులు, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే ఉపాధ్యాయులు, అత్యవసర సమయాల్లో ప్రాణాలను కాపాడేందుకు పరుగులు తీసే అంబులెన్స్ సిబ్బంది, పట్టణాలు--గ్రామాలను పరిశుభ్రంగా ఉంచే పారిశుధ్య కార్మికులు, పర్యావరణ పరిరక్షణకు కృషి చేసే ప్రకృతి ప్రేమికులు, ఆపదలో ప్రజలకు అండగా నిలిచే స్వచ్ఛంద సంస్థలు, సామాజిక కార్యకర్తలు సమాజానికి కీలకమైన సేవలు అందిస్తున్నారు. అయితే ఇలాంటి సేవా రంగాలకు జాతీయ పర్వదినాల్లో తగిన గుర్తింపు ఎందుకు దక్కడం లేదనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. **అధికారికి దగ్గరా.. ప్రజలకు దగ్గరా..?** సన్మానాల ఎంపికలో "ఎవరికి ఎంత దగ్గరగా ఉన్నారు?" అన్నది కాకుండా "ప్రజలకు ఎంత సేవ చేశారు?" అన్నదే ప్రామాణికంగా ఉండాలని ప్రజలు కోరుతున్నారు. కేవలం కార్యాలయాల నుంచి వచ్చే సిఫార్సుల ఆధారంగా పేర్లను ఎంపిక చేయకుండా, క్షేత్రస్థాయిలో సేవ చేస్తున్న వారి వివరాలను సేకరించి అర్హత ఆధారంగా ఎంపిక చేస్తే సన్మానాలకు మరింత గౌరవం లభిస్తుందని అంటున్నారు. **ఆరోపణలు ఉన్నవారి విషయంలోనూ పరిశీలన అవసరం..** ఇక కొందరు వ్యక్తులపై అవినీతి ఆరోపణలు లేదా శాఖాపరమైన వివాదాలు ఉన్నప్పటికీ వారి పేర్లు సన్మానాల పరిశీలనలోకి వస్తున్నాయనే ఆరోపణలు కూడా చర్చకు వస్తున్నాయి. కేవలం ఆరోపణల ఆధారంగా ఎవరినీ దోషిగా పేర్కొనలేం. అయితే పురస్కారాలు, సన్మానాల ప్రకటించే ముందు సేవా రికార్డు, శాఖాపరమైన చర్యలు, కేసుల స్థితి వంటి అంశాలను పరిశీలించడం అవసరం అని పలువురు సూచిస్తున్నారు. **ప్రజాసేవకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలి:** జర్నలిస్టులు, ఉపాధ్యాయులు, ప్రకృతి పరిరక్షకులు, స్వచ్ఛంద సంస్థలు, అంబులెన్స్ సేవాదారులు, పారిశుధ్య కార్మికులు, దివ్యాంగుల సంక్షేమ రంగంలో సేవలందిస్తున్న వారు, రక్తదాతలు, విపత్తుల సమయంలో సహాయక చర్యలు చేపట్టిన వారిని కూడా జాతీయ పర్వదినాల సందర్భంగా గుర్తించి సత్కరించాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఒక్క వ్యక్తిని సన్మానించడం కాదు. సమాజ సేవకు గౌరవం ఇవ్వాలన్నదే అసలు ఉద్దేశంగా ఉండాలి అని పలువురు అంటున్నారు. **కలెక్టర్ చొరవ తీసుకోవాలి..** మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి సన్మానాల ఎంపికలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. కేవలం కింది స్థాయి అధికారుల నుంచి వచ్చే పేర్లపైనే ఆధారపడకుండా, అన్ని రంగాల నుంచి నామినే షన్లు స్వీకరించి, సేవా వివరాలను పరిశీలించి అర్హులను ఎంపిక చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం అంటే అధికారుల చుట్టూ తిరిగేవారికి చప్పట్లు కొట్టే కార్యక్రమం కాదు.. ప్రజల కోసం నిస్వార్థంగా పనిచేసిన వారిని గుర్తించి గౌరవించే పర్వదినం.అధికారులకు దగ్గరగా ఉన్నవారికి గుర్తింపు.. ప్రజలకు దగ్గరగా ఉన్నవారికి నిర్లక్ష్యం అనే భావనకు తెరపడాలి. సన్మానాలకు అర్హతను నిర్ణయించాల్సింది పరిచయాలు కాదు.. ప్రజాసేవ, నిబద్ధత, నిజాయితీ, పనితీరు కావాలని మహబూబాబాద్ జిల్లా ప్రజలు కోరుతున్నారు.

## ప్రజా సేవా ప్రస్థానానికి ముగింపు..

### రాగం సుజాత యాదవ్ మృతి.. ప్రజా సేవా రంగానికి తీరని లోటు



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** రాష్ట్ర సాంఘిక సంక్షేమ బోర్డు మాజీ చైర్‌పర్సన్, ప్రముఖ సామాజిక సేవకురాలు రాగం సుజాత యాదవ్ గురువారం కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆమె మరణవార్తతో కుటుంబ సభ్యులు, బంధువులు, అభిమానులు, శ్రేయోభిలాషులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. 1974 అక్టోబర్ 10న జన్మించిన రాగం సుజాత యాదవ్ ప్రజా సేవతో పాటు మహిళా సంక్షేమం, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషించారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ బోర్డు మాజీ చైర్‌పర్సన్‌గా మహిళలు, బలహీన వర్గాల సంక్షేమం కోసం పనిచేశారు. సమాజంలోని వివిధ వర్గాల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేశారు. ఆమె మృతి మహిళా లోకంతో పాటు ప్రజా సేవా రంగానికి తీరని లోటని పలువురు పేర్కొన్నారు. సుజాత యాదవ్ సేవలను స్మరించుకుంటూ ఆమె కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆమె కుటుంబానికి ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యం కలగాలని ప్రార్థించారు. రాగం సుజాత యాదవ్ పార్థివదేహాన్ని నల్లగండ్లలోని వర్టెక్స్ కింగ్స్టన్‌లో ఉన్న స్వగృహంలో గురువారం సాయంత్రం 5 గంటల నుంచి సందర్శకుల దర్శనార్థం ఉంచనున్నారు. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, అభిమానులు అక్కడికి చేరుకుని నివాళులర్పించనున్నారు. రాగం సుజాత యాదవ్ అంత్యక్రియలు శుక్రవారం ఉదయం 11 గంటలకు నల్లగండ్లలోని శ్మశానవాటికలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## ఇందిరమ్మ చీరల పంపిణీ



**మేడ్చల్, ఆగస్టు 13(ది క్రైమ్ న్యూస్):** ఏఎస్‌రావునగర్ డివిజన్ జై జవాన్ కాలనీ రీడింగ్ రూమ్ వద్ద గురువారం ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఏఎస్‌రావునగర్ డివిజన్ అధ్యక్షుడు కేతిరెడ్డి ప్రసాద్ పాల్గొని మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల సంక్షేమం, ఆర్థిక సాధికారత కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాల వల్ల మహిళలకు ప్రయోజనం కలుగుతోందని తెలిపారు. ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. జై జవాన్ కాలనీలో నిర్వహించిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో స్థానిక మహిళలు హాజరై చీరలను స్వీకరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి పోకాల రాజన్న, తాళ్లపల్లి మేఘరాజు, సాహెబ్ సలీం, జీఎస్‌ఎన్ రావు, పీరా ముత్తు, యాదగిరిరెడ్డి, ఏవీ రెడ్డి, రహమతుల్లా, విజయేందర్, సత్యనారాయణ, విజయలక్ష్మి, పద్మ, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

### జున్ను తింటే ఆ వ్యాధులన్నీ మటాష్.. పరిశోధనల్లో వెల్లడి

శాకాహారంలో అత్యధిక పోషకాలు ఉండే వాటిల్లో జున్ను ఒకటి. పాలతో తయారుచేసే జున్నులో పోషకాలు చేపలు, మాంసంతో సమానంగా ఉంటాయి. అందుకే జున్నును ప్రోటీన్ 'పవర్‌హౌస్'గా పరిగణిస్తారు. అమెరికన్ ఫుడ్ డేటా సెంటర్ ప్రకారం.. 100 గ్రాముల చీజ్‌లో 21.43 గ్రాముల ప్రోటీన్ ఉంటుంది. ఇందులో విటమిన్ ఎ, కాల్షియం కూడా పుష్కలంగా ఉంటాయి. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం.. జున్ను తినడం వల్ల శరీరంలోని అనేక వ్యాధులు నయం అవుతాయట. అనేక వ్యాధులకు చీజ్ ఔషధంలా పని చేస్తుందని చెబుతున్నారు.లో ప్రచురించిన యూనివర్సిటీ హాస్పిటల్‌లోని పరిశోధకుల అధ్యయనం.. కార్డియోమయోపతి వ్యాధికి ప్రోటీన్ లోపంగా కారణంగా పేర్కొంది. ఈ వ్యాధి కారణంగా శరీరం బక్కచిక్కిపోతుంది. ఇది అధిక బలహీనత, అలసట కలిగిస్తుంది. రోగి ఇటువంటి స్థితిలో జున్ను తింటే, త్వరగా కోలుకుంటాడని నిపుణులు అంటున్నారు. ఈ రోజుల్లో అధిక మంది ఫ్యాటీ లివర్‌తో బాధపడుతున్నారు. కాలేయ కణాలలో కొవ్వు పేరుకుపోవడం వల్ల ఈ సమస్య తలెత్తుతుంది. ఇది శరీరంలో ప్రోటీన్ లేకపోవడం వల్ల సంభవిస్తుంది. కాబట్టి ప్రోటీన్ లోపాన్ని అధిగమించడానికి జున్ను తినవచ్చు. ప్రోటీన్ లోపం వల్ల ఎముకల బలం తగ్గుతుంది. ఇది బోలు ఎముకల వ్యాధి ప్రమాదానికి దారితీస్తుంది. ఆ తర్వాత క్రమంగా పగుళ్లకు దారితీస్తుంది. జున్నులో ప్రోటీన్, కాల్షియం పుష్కలంగా ఉంటుంది. అందుకే ఇన్ని ప్రయోజనాలు ఉన్న జున్నును ఆహారంలో చేర్చుకోవాలంటున్నారు నిపుణులు.

## సుల్తానాబాద్‌లో రోడ్డు, సెంట్రల్ లైటింగ్ పనులకు ఈ నెల 17న శంకుస్థాపన: మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ



**సుల్తానాబాద్, ఆగస్టు 13 (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని పూసల రోడ్డులో (సుల్తానాబాద్ నుండి పెద్దాపూర్ వరకు) చేపట్టనున్న రోడ్డు విస్తరణ , సెంట్రల్ లైటింగ్ అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమానికి ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ నెల 17వ తేదీన నిర్వహించనున్న ఈ భారీ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణారావు నేతృత్వం వహించనున్నారు. ఈ శంకుస్థాపన మహోత్సవానికి రాష్ట్ర రోడ్లు-భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఐటీ , పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబులు ముఖ్య అతిథులుగా విచ్చేసి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ నేపథ్యంలో గురువారం పూసల రోడ్డులో ఏర్పాట్లు చేయనున్న బహిరంగ సభా స్థలాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ బిరుదు రాధాకృష్ణ, మున్సిపల్ కమిషనర్ టి. రమేష్, స్థానిక కౌన్సిలర్లు , ఆర్ అండ్ బి ఏఈ గుణశేఖర్ కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మంత్రుల పర్యటన, బహిరంగ సభకు భారీగా జనం వచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి లోటుపాట్లు లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎఫ్సీఐ కాలనీ--పటేల్ చెరువు మధ్య వరదనీటి కాలువ పరిశీలన



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** మియాపూర్ డివిజన్ పరిధిలోని ఎఫ్సీఐ కాలనీ నుంచి పటేల్ చెరువు ఔట్‌లెట్ వరకు నూతనంగా నిర్మించనున్న వరదనీటి కాలువ పనులకు సంబంధించి పరిసర ప్రాంతాలను తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, సీఎంసీ డీఈ శ్రీదేవి, స్థానిక నాయకులతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ పటేల్ చెరువులోకి వరదనీరు సక్రమంగా చేరేలా శాస్త్రీయ ప్రణాళికతో కాలువ నిర్మాణం చేపట్టాలని అధికారులను కోరారు. భవిష్యత్తులో నీటిముంపు సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కాలువ నిర్మాణం పూర్తయితే ఎఫ్సీఐ కాలనీతో పాటు సమీప నివాస ప్రాంతాలు, అనుసంధాన రహదారుల్లో వర్షాకాలంలో ఏర్పడే వరదనీటి సమస్యలు గణనీయంగా తగ్గుతాయని తెలిపారు. ఈ పరిశీలనలో స్థానిక నాయకులు మహమ్మద్ ఖాజా, ఉమాకిషన్, సీఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, ఏఈ ప్రశాంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు జగదీష్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

### పంపిణీపై ముందస్తు సమాచార వ్యవస్థను ఏర్పాటు చేయాలి: కొలిపాక రాజు



**బెజ్జంకి, ఆగస్టు13(ది క్రైమ్ న్యూస్):** సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల రైతులు ఎదుర్కొంటున్న యూరియా, ఎరువుల ఇబ్బందుల దృష్ట్యా పంపిణీపై ముందస్తు సమాచార వ్యవస్థను ఏర్పాటు చేయాలని బీజేపీ మండలాధ్యక్షుడు కొలిపాక రాజు ఒక ప్రకటనను విడుదల చేశారు.గతంలో రైతులకు అవసరమైన సమయంలో ఎరువుల సరఫరాపై ముందస్తు సమాచారం ఉండడంతో రైతులు సులభంగా ఎరువులు పొందేవారని, ప్రస్తుత ఆన్‌లైన్ విధానంతో స్పష్టమైన సమాచారం లేక రైతులు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక ప్రణాళిక రూపొందించి,వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందిన వెంటనే, గ్రామాల్లోని ఎరువుల కేంద్రానికి ఎరువులు వచ్చే సమాచారాన్ని ఒకరోజు ముందుగానే రైతులకు తెలియజేసే విధంగా వ్యవస్థ ఏర్పాటు చేసి ఎరువుల కృత్రిమ కొరత, అధిక ధరలకు విక్రయించడం వంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు ఎరువుల కేంద్రాలను నిరంతరం పర్యవేక్షించాలని డిమాండ్ చేశారు.రైతులు పంటలు సాగు చేసే సమయంలో ఎరువులకు ఇబ్బందులు పడకుండా ఎరువుల సరఫరా, నిల్వలు, పంపిణీపై పారదర్శకమైన ముందస్తు సమాచార వ్యవస్థను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కొలిపాక రాజు ప్రకటన ద్వారా కోరారు.

## ఖమ్మం జిల్లాలో అనుమతి లేని ప్రైవేట్ కళాశాలలపై వెంటనే చర్యలు తీసుకోవాలి

### యుఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారికి వినతి



**ఖమ్మం (ప్రతినిధి, (ది క్రైమ్ న్యూస్) ఆగస్టు 13:** ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా, సరైన అనుమతులు లేకుండా నడుస్తున్న ప్రైవేటు ఇంటర్మీడియట్ కళాశాలలపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యు ఎస్ ఎఫ్ ఐ) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఖమ్మం జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి (డి ఐ ఇ ఓ)ని కలిసి సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి బొట్ల సాగర్ మాట్లాడుతూ అనుమతులు లేని కళాశాలలు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఇంటర్మీడియట్ బోర్డు అనుమతి లేకుండా, ఎలాంటి గుర్తింపు లేకుండా ప్రైవేట్ యాజమాన్యాలు అక్రమంగా కళాశాలలు నిర్వహిస్తున్నాయని ఆరోపించారు. ఎలాంటి అనుమతులు లేకున్నా కార్పొరేట్, ప్రైవేట్ యాజమాన్యాలు అడ్మిషన్ల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల నుండి వేలాది రూపాయలు వసూలు చేస్తూ నిలువునా దోపిడీ చేస్తున్నాయని మండిపడ్డారు. అనేక కళాశాలల్లో సరైన తరగతి గదులు, ప్రయోగశాలలు (ల్యాబ్స్), విశాలమైన ఆటస్థలాలు మరియు ఫైర్ సేఫ్టీ (అగ్నిమాపక భద్రత) ప్రమాణాలు లేవని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుతో గుర్తింపు లేని కళాశాలల్లో చేరి విద్యార్థులు తమ బంగారు భవిష్యత్తును, విలువైన విద్యా సంవత్సరాన్ని నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ ఇంటర్మీడియట్ కళాశాలల్లో విద్యాశాఖ అధికారులు తక్షణమే ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలి. ఇంటర్మీడియట్ బోర్డు గుర్తింపు లేకుండా నడుస్తున్న అక్రమ కళాశాలలను వెంటనే మూసివేసి (సీజ్ చేసి), యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. అనుమతి ఉన్న కళాశాలల జాబితా తల్లిదండ్రులు, విద్యార్థులు మోసపోకుండా జిల్లాలో అనుమతిఉన్నఇంటర్మీడియట్ కళాశాలల వివరాలను అధికారికంగా ప్రకటించాలి. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోకపోతే జిల్లా వ్యాప్తంగా విద్యార్థులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అఫ్రోజ్, నికిల్,సందీప్, అస్లాం తదితరులు పాల్గొన్నారు.

## దేశభక్తి నినాదాలతో సార్వజనిక తిరంగ ర్యాలీ




**కుత్బుల్లాపూర్, కొంపల్లి, (ది క్రైమ్ న్యూస్) ఆగస్టు 13:** కొంపల్లి బీజేపీ అధ్యక్షుడు పెద్దబుద్దుల సతీష్ సాగర్ ఆధ్వర్యంలో ఎన్‌సీఎల్ కాలనీ నుంచి వెన్ సాయి ప్రాజెక్టు వరకు సార్వజనిక తిరంగ ర్యాలీ నిర్వహించారు. దేశభక్తి నినాదాలతో సాగిన తర్వాత ర్యాలీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి మేడ్చల్ అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు డి.గిరివర్ధన్ రెడ్డి, కన్వీనర్ డా. ఎస్.మల్లారెడ్డి, ఉపాధ్యక్షుడు ఆదిరెడ్డి రాజిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సతీష్ సాగర్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు జాతీయ సమైక్యతను చాటుతూ తిరంగ ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ యువతలో దేశభక్తి భావనను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. కార్యక్రమంలో సాయి చైతన్య కళాశాల విద్యార్థులు, బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఎడమ జనార్దన్ రెడ్డి, తిరంగ యాత్ర కోఆర్డినేటర్ మహేందర్ సాగర్, స్థానిక నాయకులు శంకర్ నాయక్, మధు, ఆకుల శ్రీనివాస్, ప్రకాష్ రావు, మురళీకృష్ణ, సంతోష్, వర్మ, చెన్నారెడ్డి, తిరుపతి, శివ, ప్రకాష్, లక్ష్మణ్,రాజేష్ తదితరులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


### మానసిక వికలాంగుల కేంద్రంలో ఘనంగా అన్నదానం

#### ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడమే మిన్న: యువ సంకల్ప ఫౌండేషన్ అధ్యక్షులు తుమ్మ రాజేకుమార్

**సుల్తానాబాద్, ఆగస్టు 13 (ది క్రైమ్ న్యూస్):** సమాజంలో ఎన్ని దానాలు చేసినా 'ఇక చాలు' అని అనరని, కేవలం అన్నదానం చేసినప్పుడు మాత్రమే కడుపు నిండిన తర్వాత 'ఇక చాలు' అనే తృప్తి లభిస్తుందని యువ సంకల్ప ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు తుమ్మ రాజేకుమార్ అన్నారు. సుల్తానాబాద్ మండలం సుద్దాల గ్రామానికి చెందిన అరివేని జ్యోతి - సతీశ్ రావు దంపతుల వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం సుల్తానాబాద్ పట్టణంలోని మానసిక వికలాంగుల పునరావాస కేంద్రంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తుమ్మ రాజేకుమార్ మాట్లాడుతూ.. ఆకలితో ఉన్నవారికి ఒక్క పూట అన్నం పెట్టి చూస్తే వచ్చే ఆనందం మరెందులోనూ దొరకదన్నారు. తమ యువ సంకల్ప ఫౌండేషన్ ప్రధాన లక్ష్యం ఆకలితో ఉన్న ప్రతి ఒక్కరికీ అన్నం పెట్టడమేనని స్పష్టం చేశారు. సతీష్ రావు చాలా కాలంగా ఫౌండేషన్‌కు అందిస్తున్న సహాయ సహకారాలను ఈ సందర్భంగా ఆయన కొనియాడారు. ఈ వేడుకను జరుపుకుంటున్న దంపతులు నిండు నూరేళ్ల సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. ఈ సేవా కార్యక్రమంలో యువ సంకల్ప ఫౌండేషన్ సభ్యులు దేవిరెడ్డి రమేష్, పునరావాస కేంద్రం ఇంచార్జ్ శ్రీనివాస్, సిబ్బంది సరస్వతి, కళ్యాణి, కేంద్రానికి చెందిన పలువురు పాల్గొన్నారు.

## ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావత్‌ను కలిసిన పీసీసీ ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు...

### సంస్థాగత పరిస్థితిపై సమగ్ర నివేదికను కూడా సమర్పించినట్లు కట్ల రంగారావు



**ఖమ్మం (ప్రతినిధి, (ది క్రైమ్ న్యూస్):** గాంధీభవన్‌లో ఏఐసీసీ కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి సచిన్ సావత్‌ను పీసీసీ ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు గురువారం కలిశారు. ఈ సందర్భంగా నల్గొండ పార్లమెంట్ పరిధిలోని దేవరకొండ నియోజకవర్గంలో ఇటీవల నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ సంస్థాగత కమిటీ ఎన్నికలపై నివేదికను సచిన్ సావత్‌కు అందజేశారు. అలాగే నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ కార్యక్రమాలు, సంస్థాగత పరిస్థితిపై సమగ్ర నివేదికను కూడా సమర్పించినట్లు కట్ల రంగారావు తెలిపారు.పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడం, కార్యకర్తలను సమన్వయం చేయడం, రాబోయే కార్యక్రమాలపై ఈ సందర్భంగా చర్చించినట్లు సమాచారం.

# స్పోర్ట్స్

# తొలి టెస్ట్‌లో స్నీకో వివాదంపై దుమారం






ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్ మధ్య జరుగుతున్న తొలి టెస్ట్‌లో స్నీకో వివాదం తీవ్ర దుమారం రేపింది. టెక్నాలజీ సాయంతో ఆస్ట్రేలియా స్టార్ బ్యాటర్ స్టీవ్ స్మిత్ ఔటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. ప్రస్తుతం ఈ ఘటన తీవ్ర చర్చనీయాంశమైంది.రెండు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా గురువారం డార్విన్ వేదికగా ప్రారంభమైన తొలి టెస్ట్ తొలి రోజు ఆటలో బంగ్లాదేశ్ పూర్తి ఆధిపత్యం చెలాయించింది. బంగ్లాదేశ్ యువ పేసర్ హసన్ మహ్మూద్(6/55) ఆరు వికెట్లతో ఆసీస్ పతనాన్ని శాసించగా.. స్టీవ్ స్మిత్ (109 బంతుల్లో 7 ఫోర్లు, సిక్స్‌తో 71) ఒక్కడే హాఫ్ సెంచరీతో రాణించాడు.అయితే ఇన్నింగ్స్ ఆరంభంలోనే అతను ఔటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. టెక్నాలజీ సాయంతో బచాయించాడు. ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ 21వ ఓవర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. ఎబాడోట్ హొస్సేన్ వేసిన ఈ ఓవర్ నాలుగో బంతి స్టీవ్ స్మిత్ బ్యాట్‌కు దగ్గరగా వెళ్తూ కీపర్ చేతిలో పడింది. దాంతో బంగ్లాదేశ్ ఆటగాళ్లు వికెట్ కోసం అప్పీల్ చేశారు. స్మిత్ కూడా ఔటేనని భావించి పెవిలియన్ వైపు నడిచాడు. కానీ అంపైర్ కుమార్ ధర్మసేన ఔటివ్వకపోవడంతో బంగ్లా కెప్టెన్ నజ్ముల్ హొస్సేన్ షాంటో రివ్యూ తీసుకున్నాడు. అల్ట్రా ఎడ్జ్‌లో బంతి బ్యాట్‌కు తాకినట్లు స్పైక్ కనిపించలేదు. దాంతో స్మిత్ తిరిగి బ్యాటింగ్ చేపట్టాడు. అయితే ఈ నిర్ణయం తీవ్ర వివాదాస్పదమైంది. టెక్నాలజీలో లోపం ఉందని నెటిజన్లు ఆరోపించారు. ఆస్ట్రేలియా ఛీటింగ్ చేసిందని మండిపడ్డారు.తొలి రోజు ఆట అనంతరం మీడియా సమావేశంలో ఈ ఘటనపై స్మిత్ స్పందించాడు. తాను ఔటనే భావించానని, కానీ బంతి బ్యాట్‌కు తాకిందా? లేదా? అనే విషయంపై స్పష్టత లేదన్నాడు. 'నేను ఔటయ్యాననే భావించాను. నేను చాలా అదృష్టవంతుడిని. టెక్నాలజీనే నన్ను కాపాడింది. ఒకవేళ అంపైర్ ఔటిచ్చి ఉంటే నేను వెళ్లిపోయేవాడిని. కొన్నిసార్లు ఇలా జరుగుతుంటుంది. అయితే బంతి బ్యాట్‌కు తాకిందా? లేదా? అనే విషయాన్ని నేను కచ్చితంగా చెప్పలేను. కానీ బ్యాట్‌కు తాకినట్లు నాకు అనిపించింది.'అని స్మిత్ చెప్పుకొచ్చాడు. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 198 పరుగులకే కుప్పకూలింది. బంగ్లాదేశ్ పేసర్ హసన్ మహ్మూద్(6/55) ఆరు వికెట్లతో ఆసీస్ పతనాన్ని శాసించగా.. టస్కిన్ అహ్మద్(2/55), ఎబాడన్ హొస్సేన్ (2/39) రెండేసి వికెట్లు పడగొట్టారు. ఆసీస్ బ్యాటర్లలో స్టీవ్ స్మిత్(109 బంతుల్లో 7 ఫోర్లు, సిక్స్‌తో 71) హాఫ్ సెంచరీతో రాణించగా.. మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ తొలి రోజు ఆట ముగిసే సమయానికి 24 ఓవర్లలో వికెట్ నష్టానికి 96 పరుగులు చేసింది. క్రీజులో తంజిద్ హసన్(32 బ్యాటింగ్), మోమినుల్ హక్(35 బ్యాటింగ్) ఉన్నారు.



## శ్రీలంక పర్యటనలో పడిక్కల్ చెలరేగుతాడు

### మాజీ బ్యాటర్ అజింక్యా రహానే జోస్యం

శ్రీలంక పర్యటనలో టీమిండియా యువ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ చెలరేగుతాడని మాజీ బ్యాటర్ అజింక్యా రహానే జోస్యం చెప్పాడు. శ్రీలంక కండిషన్స్ అతని బ్యాటింగ్ శైలికి సరిగ్గా సరిపోతాయని తెలిపాడు. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా రెండు టెస్ట్‌ల సిరీస్ కోసం టీమిండియా శ్రీలంక పర్యటనకు వెళ్లిన సంగతి తెలిసిందే. శనివారం గాలే వేదికగా ప్రారంభమయ్యే తొలి టెస్ట్‌తో ఈ సిరీస్‌కు తెరలేవనుంది. ఈ సిరీస్‌లో దేవదత్ పడిక్కల్ మూడో స్థానంలో బరిలోకి దిగనున్నాడు. సాయి సుదర్శన్ గాయంతో ఈ పర్యటనకు దూరమవడంతో పడిక్కల్‌కు మార్గం సుగుమమైంది. అంతేకాకుండా వామప్ మ్యాచ్‌లో అతను అద్భుతమైన శతకంతో చెలరేగాడు. తాజాగా తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా ఈ సిరీస్ గురించి మాట్లాడిన రహానే.. పడిక్కల్ గురించి ప్రత్యేకంగా ప్రస్తావించాడు. టీమిండియా డబ్ల్యూటీసీ ఫైనల్ బెర్త్ గురించి ఆలోచించకుండా.. టెస్ట్ సిరీస్‌పై ఫోకస్ పెట్టాలని సూచించాడు. శ్రీలంక జట్టును ఏ మాత్రం తక్కువ అంచనా వేయకూడదని హెచ్చరించాడు. 'శ్రీలంక కండిషన్స్ దేవదత్ పడిక్కల్‌కు సరిగ్గా సరిపోతాయి. అతను మూడో స్థానంలో బ్యాటింగ్ చేస్తాడు కాబట్టి.. ఆరంభంలో కాస్త జాగ్రత్తగా ఆడాల్సి ఉంటుంది. ఒకసారి క్రీజులో కుదురుకున్న తర్వాత స్పిన్ బౌలింగ్‌ను అతను సమర్థవంతంగా ఎదుర్కోగలడు. ఫ్రంట్ ఫుట్, బ్యాక్ ఫుట్ షాట్స్‌తో అతని వద్ద పూర్తి స్థాయి బ్యాటింగ్ నైపుణ్యాలు ఉన్నాయి. అయితే మూడో స్థానంలో ఆడే బ్యాటర్ ముందు చూపుతో ఆడాల్సి ఉంటుంది. ఒకవేళ మూడో స్థానం బ్యాటర్ రాణిస్తే.. జట్టు మొత్తం ఆధిపత్యం చెలాయించగలదు. దేవదత్ పడిక్కల్ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. అన్ని ఫార్మాట్లలోనూ అతను మంచి రిథమ్‌లో కనిపిస్తున్నాడు. అతను తన ఫామ్, రిథమ్ నమ్ముకొని ఆడాలి. తనపై తాను అనవసర ఒత్తిడి పెంచుకోకుండా ఉండటం ముఖ్యం. అతనికి పరుగులు ఎలా చేయాలో తెలుసు. స్పిన్నర్లపై కట్, స్వీప్, స్టెప్ ఔట్ షాట్స్‌తో ఎదురుదాడి చేయగలడు.'అని రహానే చెప్పుకొచ్చాడు. భారత్ డబ్ల్యూటీసీ పాయింట్స్ టేబుల్ గురించి ఆలోచించి శ్రీలంకను తేలికగా తీసుకోకూడదని రహానే హెచ్చరించాడు. 'డబ్ల్యూటీసీ పాయింట్స్ టేబుల్‌ను దృష్టిలో పెట్టుకొని శ్రీలంకను తేలికగా తీసుకోకూడదు. భారత్ ముందుగా తొలి టెస్ట్ గెలవడంపై ఫోకస్ పెట్టాలి. ఆ తర్వాతే రెండో టెస్టు గెలిచి 2-0తో సిరీస్ క్లీన్ స్వీప్ చేయడం గురించి ఆలోచించాలి. కీలకమైన క్షణాలను గుర్తించి ఆధిపత్యం చెలాయిస్తేనే సిరీస్ కైవసం అవుతుంది. ఈ సిరీస్ హోరాహోరీగా సాగే అవకాశం ఉంది. ఎందుకంటే టెస్ట్‌ల్లో బాగా రాణించాలనే కసితో శ్రీలంక కూడా ఉంది. ఈ సిరీస్ ఏ మాత్రం ఏకపక్షంగా ఉండదని నేను భావిస్తున్నా.'అని అజింక్యా రహానే అన్నాడు.

## భారత్‌తో టెస్ట్‌కు శ్రీలంక జట్టు ప్రకటన

రెండు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా భారత్‌తో జరగనున్న తొలి మ్యాచ్‌లో బరిలోకి దిగే టెస్ట్ టీమ్‌ను శ్రీలంక క్రికెట్ బోర్డు ప్రకటించింది. ధనంజయ డిసిల్వా సారథ్యంలోని 16 మంది సభ్యులతో కూడిన జట్టు వివరాలను బుధవారం వెల్లడించింది. కమిందు మెండిస్ వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. సీనియర్లతో పాటు ఇటీవల టీమిండియా వామప్ మ్యాచ్‌లో ఆకట్టుకున్న పలువురు ఆటగాళ్లకు ఈ జట్టులో చోటు దక్కింది. వెటరన్ వికెట్ కీపర్ నిరోషన్ డిక్‌వెల్లా సుదీర్ఘ విరామం తర్వాత జట్టులోకి రీఎంట్రీ ఇచ్చాడు. ముగ్గురు అనామక ఆటగాళ్లకు ఈ జట్టులో చోటు దక్కింది. సీనియర్ బ్యాటర్ కుశాల్ మెండీస్ తొడ కండరాల గాయంతో ఈ సిరీస్‌కు దూరమయ్యాడు. మణికట్టు సర్జరీతో పాతుమ్ నిస్సంక సేవలను శ్రీలంక కోల్పోయింది. దాంతోనే 33 ఏళ్ల నిరోషన్ డిక్‌వెల్లాకు పిలుపు దక్కింది.2023లో శ్రీలంక తరఫున అతను చివరి టెస్ట్ మ్యాచ్ ఆడాడు. స్పిన్‌కు అనుకూలంగా ఉండే గాలే మైదానంలో బలమైన భారత బౌలింగ్ యూనిట్‌ను ఎదుర్కోవడానికి సిద్ధమవుతున్న శ్రీలంక బ్యాటింగ్ ఆర్డర్‌కు అతని చేరిక బలాన్ని చేకూర్చనుంది.ఆఫ్ స్పిన్ ఆల్‌రౌండర్ కేశర నువంత, బ్యాటర్ పాసిందు సూర్య బండారా, సోనా దినుషా తొలిసారి శ్రీలంక టెస్ట్ టీమ్ పిలుపును అందుకున్నారు. ఇటీవల భారత్‌తో జరిగిన వామప్ మ్యాచ్‌లో నువాంత మూడు వికెట్లు తీసాడు. భారత్-ఏ జరిగిన అనధికారిక టెస్ట్‌లో ఐదు వికెట్ల ఘనతను అందుకున్నాడు. దాంతో అతనికి శ్రీలంక జట్టులో చోటు దక్కింది. ఆగస్ట్ 15 నుంచి గాలే వేదికగా తొలి టెస్ట్ జరగనుంది. భారత్‌తో తొలి టెస్ట్‌కు శ్రీలంక టీమ్ : ధనంజయ డి సిల్వా (కెప్టెన్), కమిందు మెండిస్ (వైస్ కెప్టెన్), లహిరు ఉదార, నిషాన్ మదుష్క, దినేష్ చండిమల్, పసిందు సూర్యబండార, సోనాల్ దినుషా, నిరోషన్ డిక్వెల్లా (వికెట్), రమేష్ మెండిస్, ప్రబాత్ జయసూర్య, కేశర నువంత, మిలన్ ధ్రువాల్నాండో, ఎఫ్‌సి ధృవాల్నాండో, ఎఫ్. మధుశంక.






## కేఎల్ రాహుల్ మా ఎక్స్‌ఫ్యాక్టర్..

### టీమిండియా బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్

శ్రీలంకతో రెండు టెస్ట్‌ల సిరీస్‌కు టీమిండియా సన్నదమైంది. ఆగస్ట్ 15 నుంచి గాలే వేదికగా తొలి టెస్ట్ ప్రారంభం కానుంది. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2027 ఫైనల్ బెర్త్ ఆశలు సజీవంగా ఉండాలంటే ఈ సిరీస్‌ను 2-0తో క్లీన్ స్వీప్ చేయడం టీమిండియాకు కీలకం. ఈ క్రమంలో ఈ సిరీస్‌ను ఎలాగైనా గెలవాలనే పట్టుదలతో టీమిండియా ఉంది. అయితే ఈ సిరీస్‌లో వైస్ కెప్టెన్ కేఎల్ రాహుల్ తమ ఎక్స్‌ఫ్యాక్టర్ అని టీమిండియా బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ అన్నాడు. తొలి టెస్ట్ నేపథ్యంలో మోర్కెల్ గురువారం మీడియాతో మాట్లాడాడు. ప్రస్తుత భారత జట్టు బ్యాటింగ్ లైనప్‌లో కేఎల్ రాహుల్‌కు మాత్రమే శ్రీలంకలో ఆడిన అనుభవం ఉందని, అది జట్టుకు ఉపయోగపడుతుందని తెలిపాడు.'టెస్ట్‌ల్లో కేఎల్ రాహుల్ గత కొన్నేళ్లుగా భారత బ్యాటింగ్ విభాగాన్ని నడిపిస్తున్న తీరు అద్భుతం. శ్రీలంక కండీషన్స్, పిచ్‌లపై అతనికి అపారమైన అనుభవం ఉంది. అతనికి ఉన్న ఈ అనుభవం యువ ఆటగాళ్లకు ప్రాక్టీస్ సెషన్స్‌లో ఎంతగానో ఉపయోగపడింది. అదేవిధంగా గత కొన్ని నెలలుగా మా ప్లేయర్స్ వ్యక్తిగతంగా తమ ఆటను ఎంతో మెరుగుపరుచుకున్నారు. ఈ సిరీస్‌ను గెలవడమే మా ముందున్న ప్రధాన లక్ష్యం. అందుకోసం ప్రత్యేక వ్యూహాలను సిద్దం చేశాం. ఇక్కడి పరిస్థితులకు అలవాటు పడేందుకు 10 రోజుల ముందే ఇక్కడికి వచ్చాం.'అని మోర్నీ మోర్కెల్ చెప్పుకొచ్చాడు. తొలి టెస్ట్‌లో టీమిండియా ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి దిగే అవకాశం ఉందని మోర్నీ మోర్కెల్ తెలిపాడు. గాలె పిచ్ కండిషన్స్ పరిగణనలోకి తీసుకొని ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పాడు. ఓవైపు నుంచి భారత స్పిన్ దళం అటాక్ చేస్తే.. మరో వైపు నుంచి పేసర్లు ఒత్తిడి తీసుకు రాగలరని తెలిపాడు. 'గాలే పిచ్ చూడటానికి మంచి వికెట్‌లా కనిపిస్తోంది. కానీ మ్యాచ్ సాగేకొద్దీ పిచ్‌లో మార్పు ఉంటుందని నేను అనుకుంటున్నా. ఎలాంటి పరిస్థితుల్లోనైనా రాణించే విధంగా మేం సిద్ధమయ్యాం. ఇలాంటి పరిస్థితులను ఎదుర్కోవడానికి మాకు కావాల్సింది మానసిక బలం, బ్యాటింగ్‌లో సమయం, బౌలింగ్ స్పెల్స్ వేయడం, బంతిని సరైన ప్రదేశంలో వేయడం వంటివి.'అని ఇయాన్ మోర్గాన్ చెప్పుకొచ్చాడు. బ్యాటింగ్ పరంగా టీమిండియా బలంగానే ఉన్నా.. బౌలింగ్ బలహీనంగా కనిపిస్తోంది. జస్‌ప్రీత్ బుమ్రా దూరమవ్వడం పెద్ద లోటు కాగా.. జట్టులో ఉన్న ఆటగాళ్లంతా శ్రీలంక పర్యటనకు కొత్త కావడం మరో విశేషం. కేఎల్ రాహుల్, రవీంద్ర జడేజాకు మినహా శ్రీలంక పర్యటనలో టెస్ట్ సిరీస్ ఆడిన అనుభవం మరే ఆటగాడికి లేకపోవడం గమనార్హం.

## టోబీ అల్బర్ట్ సిక్సర్ల విధ్వంసం

ఇంగ్లాండ్‌లో జరుగుతున్న మెట్రో బ్యాంక్ వన్డే కప్‌లో హాంప్‌షైర్ బ్యాటర్ టోబీ అల్బర్ట్ తన విధ్వంసకర బ్యాటింగ్‌తో సంచలనం సృష్టించాడు. మైదానంలో నాన్‌స్టాప్‌గా విరుచుకుపడిన అతను వరుసగా 6 బంతుల్లో 6 సిక్సర్లు బాది క్రికెట్ ప్రపంచం దృష్టిని తనవైపు తిప్పుకున్నాడు. 21 పరుగుల వద్ద క్యాచ్ డ్రాప్ అయి లభించిన అవకాశాన్ని చక్కగా ఉపయోగించుకుని కేవలం 37 బంతుల్లోనే 86 పరుగుల నాటౌట్ ఇన్నింగ్స్ ఆడి హాంప్‌షైర్ జట్టుకు భారీ స్కోరు అందించాడు.క్రికెట్ చరిత్రలో హర్షెల్ గిబ్స్ (2007 వన్డే వరల్డ్ కప్), యువరాజ్ సింగ్ (2007 టీ20 వరల్డ్ కప్) ఒకే ఓవర్లో 6 సిక్సర్లు కొట్టి రికార్డు సృష్టించారు. అయితే టోబీ అల్బర్ట్ రికార్డు కాస్త భిన్నమైనది. ఇతను ఒకే ఓవర్లో కాకుండా రెండు వేర్వేరు ఓవర్లలో కలిపి ఈ వరుస 6 సిక్సర్ల ఘనతను సాధించాడు. మొదట నాంటెస్ ఓస్త్యుయిజెన్ వేసిన ఓవర్ చివరి రెండు బంతులను సిక్సర్లుగా మలిచాడు. ఆ తర్వాత ఓలీ కిర్ట్లీ వేసిన తదుపరి ఓవర్లోని చివరి 4 బంతులను వరుసగా సిక్సర్లుగా మలచి వరుసగా 6 బంతుల్లో 6 సిక్సర్ల మార్కును అందుకున్నాడు. టోబీ అల్బర్ట్ 21 పరుగుల వద్ద ఉన్నప్పుడు ససెక్స్ ఫీల్డర్లు అతనికి ఒక సులువైన క్యాచ్‌ను నేలపాలు చేసి లైఫ్ లైన్ ఇచ్చారు. అక్కడి నుంచి గేర్ మార్చిన టోబీ, మైదానం నలుమూలలా బౌండరీల వర్షం కురిపించాడు. కేవలం 37 బంతుల్లో 8 సిక్సర్లు, 5 ఫోర్ల సాయంతో 86 పరుగులు సాధించి నాటౌట్‌గా నిలిచాడు. టోబీ అల్బర్ట్ కంటే ముందు హాంప్‌షైర్ ఓపెనర్లు అలీ ఓర్ (105), బెన్ మేస్ (109) కూడా అద్భుతమైన సెంచరీలతో రాణించారు.

# గంభీర్‌కు అండగా నిలిచిన హర్భజన్ సింగ్




టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌కు మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ అండగా నిలిచాడు. టీమిండియా వైఫల్యానికి గంభీర్‌ను బాధ్యుడిని చేస్తూ అతనిపై విమర్శలు గుప్పించడం సరికాదని అభిప్రాయపడ్డాడు. గంభీర్ ముక్కుసూటిగా ఉండే మనిషని, అందుకే అతన్ని నిర్ణయాలు నచ్చడం లేదని హర్భజన్ సింగ్ పేర్కొన్నాడు. గంభీర్ కోచింగ్‌లో భారత జట్టు ఐసీసీ టోర్నీలు గెలిచిందని గుర్తు చేశాడు. శ్రీలంకతో రెండు టెస్ట్‌ల సిరీస్‌కు టీమిండియా సిద్దమైంది. శనివారం నుంచి గాలే వేదికగా తొలి మ్యాచ్ ప్రారంభం కానుంది. డబ్ల్యూటీసీ ఫైనల్ బెర్త్ ఆశలు సజీవంగా ఉండాలంటే ఈ సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేయడం టీమిండియాకు కీలకం. అయితే గంభీర్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత టెస్ట్‌ల్లో టీమిండియా ఘోర పరాజయాలను చవిచూసింది. ఈ క్రమంలోనే అతని కోచింగ్ తీరుపై తీవ్ర విమర్శలు వచ్చాయి. శ్రీలంకతో సిరీస్‌కు ముందు మాట్లాడిన హర్భజన్ సింగ్.. గంభీర్‌ను వెనకేసుకొచ్చాడు. 'గౌతమ్ గంభీర్ ఎందుకు ఇంతలా ఎందుకు విమర్శలు ఎదుర్కొంటున్నాడు? జట్టు బాగా ఆడకపోతే అతన్ని నిదించడం ఏంటో ఇప్పటికీ అర్థం కావడం లేదు. గంభీర్ క్రికెట్ ఆడుతున్నప్పటి నుంచి నాకు తెలుసు. ఆట పట్ల చాలా నిబద్ధత కలిగిన వ్యక్తి. కెరీర్ ఆరంభంలో గంభీర్ చాలా తక్కువగా మాట్లాడేవాడు. సెహ్వాగ్, అమిత్ మిశ్రా, మునాఫ్ పటేల్ అతనికి మంచి ఫ్రెండ్స్. ఇప్పటికీ వారే స్నేహితులనుకుంటా. అతను ముక్కుసూటి మనిషి. వాస్తవాలను నిక్కచ్చిగా మాట్లాడుతాడు. అందుకే అతని నిర్ణయాలు కొందరికి నచ్చవు. కవర్ చూసి పుస్తకం ఎలాంటిదో చెప్పకూడదని పెద్దలు అంటారు. గంభీర్‌ను విమర్శించడం కూడా తప్పే. గెలుపు కోసమే ఆడాలని నమ్మే కోచ్ అతను. ఓటమిని ఏ మాత్రం జీర్ణించుకోడు. డ్రా కోసం ఆడేందుకు అస్సలు ఇష్టపడడు. శుభ్‌మన్ గిల్ క్రికెట్ బ్రెయిన్ గొప్పది. అతను గొప్ప ఆటగాడు. ఇంగ్లండ్‌తో టెస్ట్ సిరీస్‌లో కెప్టెన్‌గా బ్యాటర్‌గా సత్తా చాటాడు. ఫుట్‌బాల్‌లో లియోనెల్ మెస్సి, క్రిస్టియానో రొనాల్డో ఇప్పటికీ ఆడుతున్నారు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వన్డేల్లో ఆడితే తప్పేంటి? ఏ ఆటగాడికైనా సరే ప్రదర్శనే కొలమానం. వయసు ముఖ్యం కాదు. విరాట్ కోహ్లీ 37 ఏళ్ల వయసులోనూ 20 ఏళ్ల కుర్రాడిలా మైదానంలో చురుకుగా ఉంటాడు. భారత జట్టులో కోహ్లీ.. మెస్సీ లాంటి ప్లేయర్. భారత జట్టులో ఫిట్‌నెస్ విప్లవం తెచ్చింది అతనే. చివరి రోజు 400 పరుగుల లక్ష్యం ఉన్నా సరే విజయం కోసం పోరాడాలని సహచరుల్లో స్ఫూర్తి నింపుతాడు. విరాట్ కోహ్లీ, రోహిత్ మెరుగ్గా రాణిస్తున్నారు. కాబట్టి వారిని వన్డేల్లో కొనసాగించాలి.'అని హర్భజన్ సింగ్ చెప్పుకొచ్చాడు.

# ధర్మపురి క్షేత్రం అభివృద్ధితో మారనున్న రూపురేఖలు

## ● కుంభమేళా తరహాలో పుష్కరాలు నిర్వహిస్తాం: మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్





**ధర్మపురి, ఆగష్టు 13, (ది క్రైమ్ న్యూస్):** ఎన్నికల సందర్భంగా ఇచ్చిన మాట ప్రకారం ధర్మపురి క్షేత్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నా మని ధర్మపురి క్షేత్రంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలతో ధర్మపురి రూపురేఖలు మారనున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. గురువారం ధర్మపురి 15వ వార్డు అంబేద్కర్ భవన నిర్మాణ పనులను మంత్రి అడ్లూరి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ధర్మపురి పట్టణంలోని వివిధ కుల సంఘాల భవనాల నిర్మాణాలకు నిధులు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. ధర్మపురిలో భవిష్యత్ తరాలకు ఉపయోగపడే విధంగా అంబేద్కర్ భవన నిర్మాణం చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా గ్రౌండ్ ఫ్లోర్లో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేస్తామని తెలిపారు. మరో రెండు అంతస్తులు విద్యార్థుల చదువు కావలసిన ఏర్పాట్లు చేస్తామని మంత్రి వివరించారు. ధర్మపురి క్షేత్రం అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని మంత్రి తెలిపారు. గోదావరి పుష్కరాలకు ప్రభుత్వం రూ.117 కోట్లు కేటాయించగా ఇందులో ధర్మపురిలో రూ. 37 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు మంత్రి వివరించారు. వీటితోపాటు టి యు ఎఫ్ ఐ డి సి నిధులు రూ. 15 కోట్లతో పాటు అమృత పథకం ద్వారా నిధులు సాధించి ధర్మపురి లో అభివృద్ధి పనులు కొనసాగిస్తామని మంత్రి వివరించారు. ప్రజా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో ధర్మపురి క్షేత్రంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగి ధర్మపురి రూపురేఖలు మారనున్న ట్లు మంత్రి వివరించారు. మంత్రి వెంట ధర్మపురి మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంఘనభట్ల దినేష్ తోపాటు ధర్మపురి మున్సిపల్ కౌన్సిలర్లు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

# కూకట్‌పల్లిని ప్రత్యేక దృష్టితో అభివృద్ధి చేస్తాం






**మేడ్చల్ , ఆగష్టు 13(ది క్రైమ్ న్యూస్):** పట్టణ ప్రాంతాల్లో పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు తమ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ తొలివిడతలో లక్ష ఇళ్లను నిర్మించి పేదలకు అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. పేద కుటుంబాలకు గౌరవప్రదమైన నివాసాన్ని కల్పించడంతో పాటు వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. సొంతింటి కలను నిజం చేసేందుకు ప్రజలకు సోదరుడిగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. తాను పార్లమెంట్ సభ్యుడిగా పోటీ చేసిన సమయంలో కూకట్‌పల్లి ప్రజలు తనను ఆశీర్వదించి గల్లీ నుంచి ఢిల్లీకి పంపించారని రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. గత ప్రభుత్వ హయాంలో తాను ప్రతిపక్షంలో ఉన్న సమయంలో నిధులు మంజూరు చేయకపోవడంతో కూకట్‌పల్లి ప్రజలు ఆశించిన మేరకు అభివృద్ధి చేయలేకపోయానన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో తమ ప్రభుత్వం అధికారంలో ఉందని, కూకట్‌పల్లిని అభివృద్ధి చేసుకునేందుకు అన్ని రకాల అధికారం ఉందని చెప్పారు. ప్రజలకు ఎలాంటి అభివృద్ధి కావాలన్నా అడిగి చేయించుకోవాలని సూచించారు. కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని ప్రత్యేక దృష్టితో అభివృద్ధి చేయాలని మంత్రి శ్రీధర్‌బాబును ఆదేశించినట్లు తెలిపారు. గత ప్రభుత్వ పదేళ్ల పాలనను, తమ రెండేళ్ల పాలనను ప్రజలు బేరీజు వేసుకోవాలని రేవంత్‌రెడ్డి అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. తెలంగాణలో 3 కోట్ల 28 లక్షల మందికి సన్నబియ్యం అందిస్తున్నామని, ప్రతి పేద కుటుంబానికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని పేర్కొన్నారు. ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని పెంచేలా ఇందిరమ్మ చీరలను సారెగా అందిస్తున్నామని, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని చెప్పారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు స్వయం సహాయక సంఘాలకు రూ.65 వేల కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు అందించామని తెలిపారు. ఆడబిడ్డలను బస్సులకు యజమానులను చేశామని, మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేలా పెట్రోల్ బంకులు, సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకునేందుకు ప్రోత్సహిస్తూ ఆర్థిక చేయూత అందిస్తున్నామని అన్నారు. స్వయం సహాయక సంఘాలు తయారు చేసే ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు శిల్పారామంలో స్టాళ్లను ఏర్పాటు చేశామని తెలిపారు. ఒకవైపు గత ప్రభుత్వం చేసిన అప్పులను చెల్లించుకుంటూనే మరోవైపు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని సీఎం అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను చక్కదిద్దుకుంటూనే ప్రజలకు అవసరమైన సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నామని చెప్పారు. పట్టణాల్లో పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ నిర్మాణ కార్యక్రమాన్ని చేపట్టామని, తొలి విడతలో లక్ష ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. 22-ఏ భూముల విషయంలో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సీఎం స్పష్టం చేశారు. ప్రజలు తమ సొంత భూములను కోల్పోకుండా చూసే బాధ్యత ప్రభుత్వానిదేనని చెప్పారు. ఈ విషయంలో ప్రజలకు ఎలాంటి నష్టం జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. తెలంగాణను విధ్వంసం నుంచి వికాసం వైపు తీసుకెళ్తున్నామని రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో కరువు రావాలని కొంతమంది క్షుద్ర పూజలు చేశారని ఆరోపించారు. అయినా దేవుడు తమ వైపు ఉన్నాడని, వర్షాలు కురిపించాడని అన్నారు. మంచి మనసుతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలన్న తమ సంకల్పానికి దేవుడి ఆశీర్వాదం ఉందని పేర్కొన్నారు. కుటిల బుద్ధితో క్షుద్ర పూజలు చేసే వారికి అవే తిరిగి వారినే అష్టదిగ్బంధనం చేస్తాయని వ్యాఖ్యానించారు. తనకు వయసు ఉందని, ఓపిక ఉందని, తెలంగాణ ప్రజలకు మంచి చేయాలన్న సంకల్పం ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజలు ప్రభుత్వానికి అండగా నిలిస్తే రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని చెప్పారు. పదేళ్ల వారి పాలనను, రెండేళ్ల తమ పాలనను ప్రజలు స్వయంగా బేరీజు వేసుకుని ఎవరి పాలనలో అభివృద్ధి, సంక్షేమం జరుగుతోందో నిర్ణయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ అభివృద్ధిలో కార్మికుల పాత్ర గొప్పది

## కార్మికులకు నిత్యవసర సరుకులు అందజేసిన సర్పంచ్ మునగపాటి నవీన్



**మహేశ్వరం ఆగష్టు 13, (ది క్రైమ్ న్యూస్):** గ్రామపంచాయతీ అభివృద్ధిలో పంచాయతీ కార్మికుల పాత్ర ఎంతో గొప్పదని మహేశ్వరం గ్రామపంచాయతీ సర్పంచ్ మునగపాటి నవీన్ పేర్కొన్నారు. గురువారం గ్రామపంచాయతీ సిబ్బందికి యూనిఫామ్ తో పాటు నూతన దుస్తులు నిత్యావసర సరుకులను సర్పంచ్ మునగపాటి నవీన్ అందజేశారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో పారిశుద్ధ్య పనులతో పాటు తాగునీటి సరఫరా వీధి దీపాల నిర్వహణ తో పాటు వివిధ సేవలను నిరంతరం కష్టపడి నిర్వహిస్తున్నారని సిబ్బందిని కొనియాడారు. కార్మికుల సేవలను గుర్తించి వారిని ప్రోత్సహించడం గ్రామపంచాయతీ బాధ్యతగా భావిస్తున్నామన్నారు. పంచాయతీ సిబ్బందికి ఆరోగ్యం సంక్షేమం ఆత్మ గౌరవానికి ప్రాధాన్యతన ఇస్తామని తెలిపారు. మహేశ్వరం గ్రామపంచాయతీని అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్లాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జోరల రమేష్, పంచాయతీ కార్యదర్శి సుజాత,వార్డు సభ్యులు ఆజం ,కాకి పరమేష్, కాడెమోని స్వాతి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఖాళీ కడుపుతో ఈ నీళ్లు తాగండి.. దీని లాభాలు చూస్తే షాకవుతారు.!



బెండకాయ చాలా మందికి ఇష్టమైన కూరగాయ. దీంతో ఎన్నో రకాల వంటకాలు తయారుచేస్తాం. కొందరు పచ్చి బెండకాయలు కూడా తింటారు. అయితే బెండకాయను నీటిలో నానబెట్టి, ఆ నీటిని తాగితే అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని నిపుణులు చెబుతున్నారు. నాలుగు లేత బెండకాయలు తీసుకొని వాటిని శుభ్రంగా కడిగి, నిలువుగా, అడ్డంగా ముక్కలుగా కోసి మంచినీటిలో రాత్రంతా నానబెట్టి, ఉదయం ఆ నీటిని వడపోసి తాగాలి. దీంతో కలిగే లాభాలు తెలిస్తే ఆశ్చర్యపోతారు.. బెండకాయలో ప్రోటీన్, కార్బోహైడ్రేట్లు, ఫైబర్, మాంగనీస్, విటమిన్ సి,బి, ఫోలిక్ యాసిడ్, పుష్కలంగా ఉంటాయి. ఇది ఆకలిని తగ్గిస్తుంది. తద్వారా బరువు తగ్గడానికి సహాయపడుతుంది. అలాగే, ఫెన్నెల్ వాటర్ శరీరాన్ని హైడ్రేట్ గా ఉంచడానికి, జీవక్రియను పెంచడానికి సహాయపడుతుంది. బెండకాయలో మాంగనీస్ ఉంటుంది. ఇది జీవక్రియ, రక్తంలో చక్కెర నియంత్రణకు కీలకమైన ఖనిజం. బెండకాయలో విటమిన్ మరియు యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. ఇది రక్తాన్ని శుద్ధి చేయడంతోపాటు టాక్సిన్స్‌ను బయటకు పంపుతుంది. ఇది చర్మం వృద్ధాప్య ఛాయలు తగ్గిస్తుంది. మచ్చలు ఇతర చర్మ సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది. బెండకాయ రోగనిరోధక వ్యవస్థపై సానుకూల ప్రభావాన్ని చూపుతుంది. బెండకాయలో ఫ్లేవనాయిడ్స్, పాలీఫెనాల్స్ వంటి యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. కళ్లకు , ఎముకలకు బెండకాయ చాలా మంచిది. మధుమేహ వ్యాధిగ్రస్తులకు బెండకాయ మంచి ఔషధం. ఉదయాన్నే ఖాళీ కడుపుతో బెండకాయలు నానబెట్టిన నీటిని తాగితే రక్తంలో చక్కెర స్థాయి అదుపులో ఉంటుంది. కొలెస్ట్రాల్ స్థాయిలను అదుపులో ఉంచడంలో సహాయపడుతుంది. గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది. బెండకాయలో క్యాన్సర్ నిరోధక గుణాలు ఉన్నాయి. పేగు క్యాన్సర్ వచ్చే ప్రమాదాన్ని తగ్గిస్తుంది. కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరుచడంలో బెండకాయ సహాయపడుతుంది. బరువు తగ్గడానికి, రక్తపోటు నియంత్రణలో బెండకాయ సహాయపడుతుంది. ముఖ్య గమనిక ఏంటంటే ఇప్పుడు మనం చెప్పుకున్న విషయాలన్నీ కేవలం అవగాహన కోసం మాత్రమే.. వీటిని ప్రయోగించేముందు నిపుణుల సలహా తీసుకోవడం మంచిది.

## అనారోగ్య బాధితుడికి రూ.4 లక్షల ఎల్ఓసీ అందజేత



**మేడ్చల్, ఆగష్టు 13(ది క్రైమ్ న్యూస్):** మీర్పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ కృష్ణానగర్ కాలనీకి చెందిన పి. నాగరాజు అనే నిరుపేద అనారోగ్య బాధితుడికి వైద్య ఖర్చుల కోసం రూ.4 లక్షల ఎల్ఓసీ లెటర్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అందించారు. మాజీ కార్పొరేటర్లు జెరిపోతుల ప్రభుదాస్, గుండారపు శ్రీనివాస్‌రెడ్డితో కలిసి గురువారం నాగరాజుకు ఎల్ఓసీ లెటర్‌ను అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న నాగరాజు కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న ఎమ్మెల్యే వైద్య చికిత్సకు ఆర్థిక సహాయం అందించేందుకు ఎల్ఓసీ మంజూరుకు చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్య సహాయాన్ని అర్హులైన నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, స్థానిక నాయకులు ఉమా వెంకటేశ్వరరావు, చారి, శ్రీపతి, వీరభద్రరావు, శేఖర్ గౌడ్, వెంకట్, నరేందర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ సత్యానందం కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన మధిర ప్రెస్ క్లబ్ సభ్యులు

### జర్నలిస్టుకు ఆపద వస్తే అందరం అండగా ఉంటాం



**మధిర ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్)** జర్నలిస్టులకు ఆపదొస్తే అందరం అండగా ఉంటాం" అనే నినాదాన్ని మధిర ప్రెస్ క్లబ్ మరోసారి చేతల్లో చూపించింది. బోనకల్ విజన్ ఆంధ్ర రిపోర్టర్ మంద సత్యానందం ఇటీవల రోడ్ ప్రమాదంలో మరణించారు. గురువారం నాడు మధిర నియోజకవర్గం బోనకల్ మండలం గోవిందాపురం గ్రామంలో జరిగిన ఆయన దశదినకర్మ లో మధిర ప్రెస్ క్లబ్ ప్రతినిధులు సత్యానందం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ దుఃఖ సమయంలో ఆ కుటుంబాన్ని ఆదుకోవాలనే సత్సంకల్పంతో మధిర ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షులు నాళ్ల శ్రీనివాసరావు మార్గదర్శనంలో, అధ్యక్ష, కార్యదర్శులు జి.వి. అరుణ్ ఆధ్వర్యంలో సహాయ కోశాధికారి శ్రీధర్, ప్రచార కార్యదర్శి అర్జున్, సహాయ కార్యదర్శి వాసులు అత్యంత చురుకైన పాత్ర పోషించి ప్రత్యేక శ్రద్ధతో ప్రెస్ క్లబ్ మిత్రుల నుండి రూ. 12,500 ఆర్థిక సాయాన్ని సత్యానందం కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యదర్శులు బాణాల శంకరాచారి, చారు గుండ్ల నరసింహమూర్తి, కార్యవర్గ సభ్యులు వేణు తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్య బాధితుడికి రూ.4 లక్షల ఎల్ఓసీ అందజేత



**మేడ్చల్, ఆగష్టు 13(ది క్రైమ్ న్యూస్):** మీర్పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ కృష్ణానగర్ కాలనీకి చెందిన పి. నాగరాజు అనే నిరుపేద అనారోగ్య బాధితుడికి వైద్య ఖర్చుల కోసం రూ.4 లక్షల ఎల్ఓసీ లెటర్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అందించారు. మాజీ కార్పొరేటర్లు జెరిపోతుల ప్రభుదాస్, గుండారపు శ్రీనివాస్‌రెడ్డితో కలిసి గురువారం నాగరాజుకు ఎల్ఓసీ లెటర్‌ను అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న నాగరాజు కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న ఎమ్మెల్యే వైద్య చికిత్సకు ఆర్థిక సహాయం అందించేందుకు ఎల్ఓసీ మంజూరుకు చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్య సహాయాన్ని అర్హులైన నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, స్థానిక నాయకులు ఉమా వెంకటేశ్వరరావు, చారి, శ్రీపతి, వీరభద్రరావు, శేఖర్ గౌడ్, వెంకట్, నరేందర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రేస్ ఫౌండేషన్ ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరాన్ని ప్రారంభించిన సర్పంచ్ అంజన్న బాబు



**మధిర ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** గ్రేస్ ఫౌండేషన్ వారి సహకారం తో గురువారం నాడు మధిర మండలం ఖమ్మపాడు గ్రామపంచాయతీ నందు గ్రామ సర్పంచ్ బట్ట అంజనబాబు ఉచిత వైద్య సేవలు ప్రారంభించారు. ఈ ఫౌండేషన్ వారు ఉచితంగా క్యాన్సర్ పరీక్షలు వివిధ రకాల పరీక్షలు ఉచిత మందులు ఇవ్వబడుతున్నాయి. గ్రామంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సద్వినియోగం చేసుకున్నారు. ఈ కార్యక్రమం లో గ్రామ పంచాయతీ కార్యదర్శి వినోద్ ,పాలకవర్గ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మువ్వ వెంకయ్య బాబు గ్రామ వైద్య లు, ఏఎన్ఎం ఆశా వర్కర్లు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# విశ్వేజి



## పొడిజుట్టుకు ప్యాకప్!

ప్రస్తుతం చాలామంది 'హెయిర్ స్టయిలింగ్ టూల్స్'ను వాడుతున్నారు. జుట్టును స్ట్రెయిట్‌గా, కర్లీగా.. రకరకాలుగా మార్చేసుకుంటున్నారు. అయితే, ఇలా చేయడం వల్ల జుట్టు అందంగా కనిపించినా.. దీర్ఘకాలంలో సమస్యలు వస్తాయని సౌందర్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. హెయిర్ స్టయిలింగ్ టూల్స్ నుంచి వెలువడే అధిక వేడి వల్ల కుదుళ్లు, జుట్టు ఆరోగ్యం దెబ్బతింటుందని చెబుతున్నారు. వెంట్రుకల చివర్లు చిట్లిపోవడం, పొడిబారిపోవడం, తెగిపోవడం లాంటి సమస్యలు వస్తాయని అంటున్నారు. ఇలా దెబ్బతిన్న జుట్టుకు మళ్లీ పూర్వ వైభవం తీసుకురావాలంటే.. కొన్ని చిట్కాలు పాటించాలని సూచిస్తున్నారు. పొడి జుట్టు సమస్యను పరిష్కరించడంలో పెరుగు, నూనె సమర్థంగా పనిచేస్తాయి. ఒక గిన్నెలో అరకప్పు పెరుగు, రెండు టేబుల్ స్పూన్ల ఆలివ్ నూనె, ఆరు టేబుల్ స్పూన్ల కొబ్బరి నూనె వేసి బాగా కలపాలి. తక్కువ గాఢత కలిగిన షాంపూతో తలస్నానం చేసిన తర్వాత.. ఈ మిశ్రమాన్ని జుట్టు కుదుళ్లకు బాగా పట్టించాలి. ఆ తర్వాత నెత్తిని ప్లాస్టిక్ లేదా షవర్ క్యాప్‌తో కప్పి ఉంచాలి. 15-20 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేస్తే.. జుట్టు సున్నితంగా మారుతుంది. జుట్టురాలడం కూడా తగ్గుతుంది. పొడిబారిన జుట్టుకు మళ్లీ తేమను అందించడంలో కొబ్బరినూనె దివ్యౌషధమే! వెంట్రుకలు కుదుళ్ల నుంచి బలంగా పెరిగేలా ప్రోత్సహిస్తుంది. ఒక గిన్నెలో టేబుల్ స్పూన్ ఆర్గాన్ ఆయిల్, రెండు టేబుల్ స్పూన్ల కొబ్బరి నూనె తీసుకోవాలి. ఇందులో ఒక విటమిన్ ఇ క్యాప్సుల్, కొద్దిగా షియా బటర్ వేసి బాగా కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని జుట్టుకు పట్టించి.. గంట తర్వాత తక్కువ గాఢత కలిగిన షాంపూతో తలస్నానం చేయాలి. ఇలా రెగ్యులర్‌గా చేస్తే వేడివల్ల దెబ్బతిన్న జుట్టుకు తేమ అందుతుంది.

## చాట్ జీపీటీ స్టడీ మోడ్

ఉద్యోగులే కాదు.. విద్యార్థులు కూడా చాట్ జీపీటీ వాడేస్తున్నారు. హోంవర్క్ చేయాలన్నా, పరీక్షలకు సిద్ధం కావాలన్నా, కొత్త విషయాలు నేర్చుకోవాలన్నా చాలామంది దీన్నే ఆశ్రయిస్తున్నారు. అయితే, ఇది జవాబులు నేరుగా ఇవ్వడం వల్ల విద్యార్థులు సొంతంగా ఆలోచించడం తగ్గిపోతుందేమో అని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యకు పరిష్కారంగా ఓపెన్ ఏఐ చాట్ జీపీటీలో ఒక వినూత్నమైన ఫీచర్‌ను తీసుకొచ్చింది. అదే 'స్టడీ మోడ్'. ఇది విద్యార్థులకు నేరుగా జవాబులు ఇవ్వదు. బదులుగా, ప్రశ్నల ద్వారా ఒక్కో అడుగు ముందుకు వేస్తూ, విద్యార్థులు సొంతంగా ఆలోచించి, సమస్యను పరిష్కరించేలా గైడ్ చేస్తుంది. ఓపెన్ ఏఐ చెబుతున్న ప్రకారం.. విద్యార్థులు స్టడీ మోడ్‌తో కేవలం సూచనలు, సలహాలే అందుకుంటారు. అలా వారి అవగాహన పెంచుకుంటూ, పరిష్కారాలు కనుక్కోగలుగుతారు. ఇది విద్యార్థులకు నిజమైన ఇంటరాక్టివ్, ఆకర్షణీయమైన అభ్యాస అనుభవాన్ని అందించడానికి ఉద్దేశించిందని ఓపెన్ ఏఐ నిర్వాహకులు చెబుతున్నారు. అంటే, ఇకపై పిల్లలు కేవలం కాపీ-పేస్ట్ చేయకుండా, నిజంగా నేర్చుకుంటారు అన్నమాట! స్టడీ మోడ్ ఫీచర్ ప్రస్తుతం ఫ్రీ, ప్లస్, ప్రో, టీమ్ ప్లాన్‌లలో లాగిన్ అయిన వినియోగదారులందరికీ అందుబాటులో ఉంది. ఈ సరికొత్త స్టడీ మోడ్ విద్యార్థులకు ఎంతవరకు సాయపడుతుందో, వారి స్కిల్స్‌ను ఏమేరకు పెంచుతుందో చూడాలి!

# బరువు తగ్గే, షుగర్ కంట్రోల్‌లోకి వచ్చే మంచి డైటింగ్ విధానం ఇదే.. ట్రై చెయ్యండి



చాలామంది బరువు తగ్గడానికి కీటో డైట్‌ను ఫాలో చేస్తూ ఉంటారు. కీటో డైట్ అంటే తక్కువ కార్బోహైడ్రేట్లను కలిగి, ఎక్కువ కొవ్వులు మరియు కొంత ప్రోటీన్లను కలిగి ఉన్న ఆహారం. ఇది శరీరానికి శక్తిని ఇవ్వడంతోపాటు మన శరీరంలోని కొవ్వును కరిగిస్తుంది. ఇది కీటోసిస్ అనే ప్రక్రియకు దారితీస్తుంది. సహజంగా కీటో డైట్ బరువు తగ్గడం కంటే ఎక్కువ ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది.

కీటో డైట్ తో డయాబెటిస్ కంట్రోల్.. కీటో డైట్ యొక్క ఒక ముఖ్యమైన ప్రయోజనం రక్తంలో చక్కెర నియంత్రణ . కార్బోహైడ్రేట్లను తీసుకోవడం తగ్గించడం ద్వారా, రక్తంలో చక్కెర స్థాయిలు నియంత్రణలోకి వస్తాయి. ఇది టైప్ 2 మధుమేహం లేదా ఇన్సులిన్ రెసిస్టెన్స్ ఉన్న వారికి ప్రత్యేకంగా ప్రయోజనకరంగా ఉండవచ్చు. కీటో డైట్ అనుసరించే అనేక మంది మెరుగైన మానసిక స్పష్టత మరియు దృష్టిని పొందినట్టు చెప్తారు. శక్తికి, మెదడు ఉత్తేజానికి కీటో డైట్.. మన మెదడు కీటోన్లను సమర్థవంతమైన ఇంధన వనరుగా ఉపయోగిస్తుంది. ఇది మెరుగైన జ్ఞాపకశక్తికి దారితీస్తుంది. ఇది మెదడుకు సంబంధించి ఏకాగ్రత సమస్యలను ఎదుర్కొంటున్న వారికి ప్రత్యేకంగా సహాయపడుతుంది.కీటో డైట్ తీసుకోవడం వల్ల మరో ప్రయోజనం శక్తి స్థాయిలు పెరుగుతాయి. శరీరం శక్తి కోసం కొవ్వును కరిగించడానికి అనుకూలంగా మారినప్పుడు, చాలా మంది రోజంతా నిరంతర శక్తి పెరుగుదలను గమనిస్తారు. ఈ ఆరోగ్య సమస్యలకు కీటో డైట్ తో ఉపశమనం ఇది మెరుగైన శారీరక పనితీరును కనబరుస్తుంది. కీటో డైట్ తీసుకోవడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. కీటో డైట్ మన శరీరంలోని మంచి కొలెస్ట్రాల్ అయిన హెచ్డిఎల్ ను పెంచడంతోపాటు, ఎల్డిఎల్ కొలెస్ట్రాల్ ను తగ్గించడం, ట్రై గ్లిజరైడ్స్ ను తగ్గించడం చేస్తుంది. కొలెస్ట్రాల్ స్థాయిలను మెరుగుపరుస్తుంది. ఆర్థరైటిస్, ఆటో ఇమ్యూన్ వ్యాధులు ఉన్నవారికి శరీరంలో వచ్చే నొప్పులు మంటలను తగ్గించడానికి కీటో డైట్ దోహదం చేస్తుంది. మధుమేహ బాధితులు ఇవి నిర్లక్ష్యం చేస్తే మంచంలోనే జీవితం

కీటో డైట్ పాటించాలంటే వైద్యుల సలహా తప్పనిసరి.. కీటో డైట్ మన ఆకలిని తగ్గిస్తుంది. కేవలం బరువు తగ్గడం మాత్రమే కాదు కీటో డైట్ ఎక్కువ ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. ఇందులో రక్తంలో చక్కెరను నియంత్రించడంతో పాటు శక్తిని అందించడం వంటి ఫలితాలు ఉన్నాయి. మొత్తంగా కీటో డైట్ మన శరీరానికి ఎంతగానో దోహదం చేస్తుంది. అయితే వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడేవారు వైద్య నిపుణుల సలహాలు లేకుండా కీటో డైట్ ను పాటించడం మంచిది కాదు.

# చిత్త వైకల్యాన్ని చిత్తుచేద్దాం!



చిత్త వైకల్యాన్ని సకాలంలో నిర్ధారించడం.. ప్రధాన సవాలుగా మారుతున్నది. మనిషి జ్ఞాపకశక్తిని దెబ్బతీసే ఈ మానసిక రుగ్మత.. చాలా ఆలస్యంగా బయటపడుతున్నది. లక్షణాలు కనిపించినా.. సంపూర్ణంగా నిర్ధారించడానికి సగటున మూడున్నరేండ్ల సమయం పడుతున్నది. 'ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ జెరియాట్రిక్ సైకియాట్రీ'లో ప్రచురితమైన తాజా అధ్యయనం ఈ విషయాన్ని వెల్లడించింది. డైమెన్షియా నిర్ధారణపై 'యూనివర్సిటీ కాలేజ్ లండన్'లోని సైకియాట్రీ విభాగానికి చెందిన పరిశోధకులు తాజాగా ఓ అధ్యయనం నిర్వహించారు. ఇందుకోసం యూరప్, అమెరికా, ఆస్ట్రేలియా, చైనాలో ఇంతకుముందే ప్రచురితమైన 13 అధ్యయనాలను క్షుణ్నంగా పరిశీలించారు. ఈ సందర్భంగా 30,257 మందికి చెందిన డేటాను సమీక్షించారు. ఇందులో భాగంగా.. చిత్త వైకల్యం ప్రపంచవ్యాప్తంగా 57 మిలియన్లకు పైగా ప్రజలను ప్రభావితం చేస్తున్నదని గుర్తించారు. చాలా దేశాలలో రోగ నిర్ధారణ సరిగ్గా జరగడం లేదని చెబుతున్నారు. చిత్త వైకల్యం ప్రారంభ దశలో జ్ఞాపకశక్తి కోల్పోవడం, పదాలను కనుగొనడంలో ఇబ్బంది, గందరగోళంతోపాటు మానసిక స్థితి, ప్రవర్తనలో మార్పులు కనిపిస్తాయని అధ్యయనకారులు పేర్కొంటున్నారు. చాలామంది ఈ డైమెన్షియా లక్షణాలను సాధారణ వృద్ధాప్య లక్షణాలుగా భావిస్తున్నారనీ, దాంతో వారికి సరైన వైద్యసాయం అందడం లేదని అంటున్నారు. కొందరిలోనైతే.. రోగ నిర్ధారణకు 4.1 ఏళ్లు పట్టవచ్చునని పేర్కొంటున్నారు. దాంతో బాధితులకు మెరుగైన చికిత్స అందించడం ఆలస్యమవుతున్నదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిని నివారించడానికి.. డైమెన్షియా ప్రారంభ లక్షణాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలనీ, చిత్త వైకల్యం ఉన్న వ్యక్తులు, వారి కుటుంబాలు అవసరమైన సహాయం పొందగలిగేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని సిఫారసు చేస్తున్నారు. సకాలంలో రోగ నిర్ధారణ చేయడం వల్ల మెరుగైన చికిత్స అందించే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

# మార్కెట్



## వృద్ధిరేటుకు ఊచకోతే..! ట్రంప్ టారిఫ్‌లతో దేశ జీడీపీ ప్రగతికి బ్రేకులు

న్యూఢిల్లీ : వాణిజ్య ఒప్పందం కోసం భారత్ మెడలు వంచాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా విధించిన సుంకాలు.. దేశ జీడీపీ ప్రగతికి ప్రతిబంధకాలేనని మెజారిటీ ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. అమెరికాకు ఎగుమతయ్యే భారతీయ వస్తూత్పత్తులపై 25 శాతం టారిఫ్‌లుంటాయని ట్రంప్ ప్రకటించిన సంగతి విదితమే. అయితే ఈ టారిఫ్‌లు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) మొత్తం కొనసాగితే దేశ జీడీపీ ఈసారి 6 శాతం దిగువనే నమోదు కాగలదని ఎక్స్‌పర్ట్స్ అంచనా వేస్తున్నారిప్పుడు. 20 నుంచి 40 బేసిస్ పాయింట్లు దిగజారవచ్చని అంతా అభిప్రాయపడుతున్నారు. ఏఎన్‌జెడ్ ఎకనామిస్టులు ధీరజ్ నీమ్, సంజయ్ మాథూర్ స్పందిస్తూ.. 'అమెరికా 25 శాతం టారిఫ్‌లు వచ్చే ఏడాది మార్చి 31దాకా అమలైతే భారత జీడీపీ వృద్ధిరేటు 40 బేసిస్ పాయింట్లు క్షీణించవచ్చు' అంటున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం దేశ జీడీపీ 6.1 శాతంగానే ఉంటుందని వారి అంచనా. దీంతో ట్రంప్ టారిఫ్ దెబ్బకు 5.5 శాతం దరిదాపుల్లోకి చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే బార్క్‌లేస్ 30 బేసిస్ పాయింట్లు, నొమురా 20 బేసిస్ పాయింట్లు క్షీణించే వీలుందంటున్నాయి. అలాగే ఫిచ్ రేటింగ్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం భారత జీడీపీ 6.3 శాతంగానే ఉండొచ్చని అంచనా వేసింది. మునుపు 6.4 శాతంగా ఉన్నది. ఇక పెట్టుబడులకూ ఇబ్బందేనని హెచ్ఎస్‌బీసీ ఆర్థికవేత్తలు చెప్తున్నారు.



# ఎలాన్ మస్క్ టెస్లా కంపెనీకి ఫ్లోరిడా కోర్టు భారీ జరిమానా.. ఎంతంటే..!



అగ్రరాజ్యం అమెరికాకు చెందిన దిగ్గజ ఎలక్ట్రిక్ ఆటోమొబైల్ కంపెనీ టెస్లాకు ఫ్లోరిడా కోర్టు భారీ జరిమానా విధించింది. 2019లో జరిగిన ఒక రోడ్డు ప్రమాదానికి సంబంధించి అప్పట్లో టెస్లా కంపెనీ పై కేసు నమోదైంది. టెస్లా కారులోని ఆటో పైలట్ వ్యవస్థలో లోపంవల్లే ఆ ప్రమాదం జరిగిందని తాజాగా ఫ్లోరిడా కోర్టు తేల్చింది. బాధిత కుటుంబానికి 240 మిలియన్ డాలర్ల పరిహారం (భారత కరెన్సీలో సుమారుగా రూ.1,996 కోట్లు) చెల్లించాలని టెస్లాను ఆదేశించింది. వివరాల్లోకి వెళితే.. ఫ్లోరిడాలోని కీ లార్గోలో 2019 లో ఒక రోడ్డు ప్రమాదం జరిగింది. జార్జ్ మెక్ గీ అనే వ్యక్తి తన టెస్లా కారులో వెళుతూ అత్యాధునిక ఆటో పైలట్ ఫీచర్‌ను ఉపయోగించాడు. ఇది టెస్లా అందించిన ఆటోమేటెడ్ డ్రైవింగ్ వ్యవస్థ. మార్గమధ్యంలో జార్జ్ మొబైల్ కారులో కింద పడిపోయింది. కారు ఆటో పైలట్ మోడ్‌లోనే ఉండటంతో జార్జ్ కిందకు వంగి ఫోన్ తీసుకునేందుకు ప్రయత్నించాడు. దాంతో ఆ కారు అదుపు తప్పి పక్కనే పార్క్‌చేసి ఉన్న మరో కారును ఢీకొట్టింది. ఆపై ఇద్దరు వ్యక్తులపైకి దూసుకువెళ్లింది. ఈ ఘటనలో 22 ఏళ్ల యువతి అక్కడికక్కడే మృతి చెందగా, ఆమె స్నేహితుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటనపై బాధిత కుటుంబాలు కోర్టును ఆశ్రయించాయి. సుదీర్ఘ విచారణ అనంతరం తాజాగా ఫ్లోరిడా కోర్టు తీర్పు వెల్లడించింది. ఈ ప్రమాదానికి నష్టపరిహారంగా బాధిత కుటుంబాలకు మొత్తం 329 మిలియన్ డాలర్లు చెల్లించాలని కోర్టు కారు యజమానిని ఆదేశించింది. అయితే ప్రమాదానికి ఆటో పైలట్ వ్యవస్థ లోపం కూడా ఒక కారణమని గుర్తించిన కోర్టు.. ఆ మొత్తం పరిహారంలో 242 మిలియన్ డాలర్లను టెస్లా కంపెనీ చెల్లించాలని తన ఆదేశాల్లో పేర్కొన్నది. ప్రమాదానికి కారకుడైన కారు యజమాని మిగతా మొత్తం చెల్లించాలని స్పష్టంచేసింది. అయితే ఫ్లోరిడా కోర్టు తీర్పుపై పై కోర్టులో అప్పీల్ చేయనున్నట్లు టెస్లా సంస్థ తెలిపింది.



## అనిల్ అంబానీపై లుకౌట్ నోటీసులు.. ఈ నెల 5న హాజరుకావాలని ఆదేశం

### జారీ చేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్

న్యూఢిల్లీ : బ్యాంకుల రుణాల ఎగవేత కేసుల్లో రిలయన్స్‌గ్రూపు చైర్మన్ అనిల్ అంబానీకి గట్టి షాక్ తగిలింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) లుకౌట్ నోటీసులు జారీ చేసింది. రూ.3 వేల కోట్ల రుణ మోసం కేసుకు సంబంధించి ఈడీ శుక్రవారం సర్క్యూలర్ జారీ చేసింది. లుకౌట్ నోటీసుల కంటే ముందు బ్యాంక్ రుణ ఎగవేత కేసులో అనిల్ అంబానీకి ఈడీ సమన్లు జారీ చేసింది. ఈ నెల 5న న్యూఢిల్లీలోని ఈడీ ప్రధాన కార్యాలయంలో హాజరుకావాలని ఆదేశించింది. ఈ కేసులో కంపెనీకి చెందిన ఇతర ఉన్నతాధికారులకు కూడా త్వరలో సమన్లు జారీ చేసే అవకాశాలున్నట్టు ఈడీ వర్గాలు వెల్లడించాయి.

# ఆంధ్రప్రదేశ్

## జగన్ పర్యటనలో అడుగడునా ఉల్లంఘనలు

### తీవ్ర ఇబ్బందులకు గురైన వాహనదారులు

కర్నూలు,ఆగస్ట్13 : వైకాపా అధినేత జగన్ కర్నూలు పర్యటనలో అడగడుగునా పోలీసు ఆంక్షలను ఉల్లంఘించారు. అనుమతి లేకపోయినా బళ్లారి చౌరస్తాలో జాతీయ రహదారిపై డీజే పెట్టుకుని బైక్‌లతో స్టంట్స్ చేస్తూ జనానికి చుక్కలు చూపించారు. ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కర్నూలు జిల్లా కారాగారంలో ఉన్న ఆలూరు వైకాపా ఎమ్మెల్యే విరూపాక్షిని పరామర్శించేందుకు జగన్ ఓర్వకల్లు విమానాశ్రయానికి చేరుకున్నారు. అనుమతులు లేకపోయినా అక్కడి నుంచి భారీ ర్యాలీతో కర్నూలు బయల్దేరారు. దీంతో పలు వాహనాల రాకపోకలు స్తంభించాయి. ర్యాలీకి అనుమతి లేదని పోలీసులు హెచ్చరించినా.. వైకాపా నాయకులు ఖాతరు చేయకుండా భారీ జనసమీకరణ చేసినట్లు సమాచారం. జగన్ కాన్వాయ్ తొందరగా వెళ్లాలని రూరల్ సీఐ చంద్రబాబు కోరగా.. వైకాపా కార్యకర్తలు వాగ్వాదానికి దిగారు. ఆయన వాహనానికి అడ్డుగా నిలిచి ఆందోళన చేపట్టారు.

## గిరిజన ప్రాంత ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

### ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి

విజయనగరం,ఆగస్ట్13 : గ్రామీణ, గిరిజన ప్రాంత ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. గురువారం కురుపాం మండలం సీతంపేట గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన రేషన్ సబ్ డిపోను జిల్లా కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. లబ్దిదారులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. గతంలో రేషన్ సరుకుల కోసం 2 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వచ్చేదని, ఈ కొత్త సబ్ డిపో ప్రారంభంతో గ్రామంలోని దాదాపు 200 మంది కార్డుదారులకు స్వగ్రామంలోనే సరకులు పొందే వెసులుబాటు లభించిందన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పౌర సరఫరాల వ్యవస్థను నిరంతరం పర్యవేక్షిస్తూ బలోపేతం చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. వ్యవసాయ రంగాన్ని మరింత లాభసాటిగా మార్చేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు నిరంతరం అందుబాటులో ఉంటూ అవసరమైన సాంకేతిక సలహాలు, సహాయ సహకారాలు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ డొంకాడ రామకృష్ణ, తెదేపా రాష్ట్ర కార్యానిర్వాహక కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్, జిల్లా వ్యవసాయ, ఉద్యాన, మత్స్యశాఖల అధికారులు టి. భవానీ శంకర్, జి.సత్యనారాయణ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు నిర్మాణాలు పూర్తయ్యాకనే బిల్లులు: కలెక్టర్

విజయనగరం,ఆగస్ట్13 : గిరిజన ప్రాంతాల్లో రోడ్డు నిర్మాణ పనులు పూర్తిగా చేశాకే బిల్లులు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర్ రెడ్డి సూచించారు. గురువారం కురుపాం మండలం ఎంపీడీవో కార్యాలయంలో డోలీ రహదారి నిర్మాణ పనులపై పలు శాఖల ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా నిధులు వృథా అవుతున్నాయని, పాత పనులు పూర్తిచేయకుండా నూతన పనులు మంజూరు చేయలేమన్నారు. డోలీ మోత రహదారి పనులు ఏకథాటిపై చేసే స్థాయి ఉన్న వారికే పనులు కేటాయించాలన్నారు. అవసరమైతే నామినేషన్ వెండర్లను రద్దు చేసి టెండర్లు పిలవలన్నారు.

## రాజధాని నిర్మాణంలో మరో కీలక ఘట్టం

### ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ టవర్లు ప్రారంభించిన చంద్రబాబు

అమరావతి,ఆగస్ట్13 : అమరావతి రాజధాని నిర్మాణంలో మరో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. రాజధానిలో నిర్మాణం పూర్తయిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల భవన సముదాయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. గురువారం నూతన భవన సముదాయాన్ని సీఎం చేతుల మీదుగా సాధారణ పరిపాలన శాఖ జీఏడీకి సీఆర్డీఏ అప్పగించింది. రాయపూడి వద్ద 12 టవర్లుగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల నివాస భవన సముదాయాన్ని నిర్మించారు. ఒక్కొక్కటి 3,500 చదరపు అడుగుల వైశాల్యంతో 288 ఫ్లాట్లను సీఆర్డీఏ నిర్మించింది. అత్యాధునిక వసతులతో భవనాలను నిర్మించిన సీఆర్డీఏ.. టవర్స్ మధ్య ప్రత్యేక లాన్స్‌ను పెంచింది. అధునాతనంగా నిర్మించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఫ్లాట్లను మంత్రులు నారాయణ, నాదెండ్ల మనోహర్లతో కలిసి సీఎం చంద్రబాబు పరిశీలించారు. ఇక, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల భవనాల అప్పగింత అనంతరం వాటి నిర్వహణ బాధ్యతలను సాధారణ పరిపాలన శాఖ చూసుకోనుంది. అనంతరం ప్రభుత్వం నిర్ణయించే విధానానికి అనుగుణంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కేటాయింపు ప్రక్రియ చేపట్టే అవకాశం ఉంది.

## సీడ్ యాక్సెస్ రహదారిపై దుష్ప్రచారం

### అపోహలకు ఎలాంటి తావు లేదన్న పురపాలక శాఖ

అమరావతి,ఆగస్ట్13 : ఏపీ రాజధాని అమరావతి సీడ్ యాక్సెస్ రహదారిలోని ఎస్ ఆకారపు మలుపుపై కొందరు పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ తెలిపింది. అమరావతిని ఇతర ప్రాంతాలతో కనెక్ట్ చేసే ప్రధాన సీడ్ యాక్సెస్ రహదారి నిర్మాణంపై అపోహలకు తావులేదని స్పష్టం చేసింది. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా సీడ్ యాక్సెస్ రహదారి నిర్మాణం ఉంటుందని పేర్కొంది. ఈ రహదారి మూడో దశలో విజయవాడ- చెన్నై నేషనల్ హైవే కనెక్టివిటీకి అనుగుణంగా ఈ నిర్మాణం ఉంటుందని చెప్పింది. సీడ్ యాక్సెస్ రహదారిని మణిపాల్ హాస్పిటల్ దగ్గర జాతీయ రహదారితో అనుసంధానం చేసేలా ప్రణాళికలు చేస్తున్నట్లు పురపాలక శాఖ వెల్లడించింది. ఎలివేటెడ్ కారిడార్ నిర్మించేందుకు అనువుగా ప్రస్తుత సీడ్ యాక్సెస్ రహదారి నిర్మాణం ఉంటుందని తెలిపింది. 2017 ప్రణాళిక ప్రకారమే దొండపాడు నుంచి తాడేపల్లి వరకూ ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మిస్తున్నట్లు పేర్కొంది. రాజధాని అమరావతికి, మంగళగిరి, విజయవాడలతో కనెక్టివిటీ పెంచేలా స్టీల్ బ్రిడ్జి, సీడ్ యాక్సెస్ రహదారులు అందుబాటులోకి వచ్చాయని తెలిపింది. సీడ్ యాక్సెస్ రహదారి కనెక్టివిటీ అందుబాటులోకి రావటంతో కృష్ణా కరకట్టపై వాహనాల రద్దీ తగ్గనుందని పేర్కొంది.

# గ్రూప్-1 పరీక్షల్లో అక్రమాలు

### జగన్ హయాంలో అనుయాయులకు పోస్టులు

### అక్రమాలపై ఎక్కడిక్కడ నిలదీయండి

### మంత్రులకు చంద్రబాబు దిశానిర్దేశం

అమరావతి,ఆగస్ట్13 : ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-1 మూల్యాంకనంతో వైసీపీ అడ్డంగా దొరికిపోయిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. తమ వారికి ఉద్యోగాలు ఇప్పించుకునేందుకు అర్హులను బలి చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సచివాలయంలో అందుబాటులో ఉన్న మంత్రులతో సీఎం చంద్రబాబు గురువారం మధ్యాహ్నం లంచ్ మీటింగ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రూప్-1 అంశం చర్చకు వచ్చింది. గ్రూప్-1 మూల్యాంకనంలో 97 శాతం జవాబు పత్రాలు దిద్ది ఉండటంపై సీఎం చంద్రబాబు, మంత్రులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లతో జవాబు పత్రాలు దిద్దించడంపై పలు పత్రికలు, ఛానళ్లలో వచ్చిన వార్తలను చూసి అందరూ



ఆశ్చర్యపోతున్నారని సీఎంకు మంత్రులు వివరించారు. ఈ సందర్భంగా త్వరలో జరుగనున్న అసెంబ్లీ సమావేశాల్లోనూ గ్రూప్-1 వ్యవహారంపై వైసీపీని ఎండగట్టాలని సీఎంను కోరారు. సిట్ ఇచ్చిన నివేదిక ఆధారంగా గత వైసీపీ ప్రభుత్వం, అప్పటి ఏపీపీఎస్సీ కార్యదర్శి పీఎస్ఆర్ ఆంజనేయులు పాత్రపై మరింత లోతైన దర్యాప్తు చేయాలని మంత్రులు పేర్కొన్నారు. మరికొంతమంది అధికారుల పాత్రా ఉందని, దీనిపైనా దర్యాప్తు జరపాలని చంద్రబాబుకు మంత్రులు విజ్ఞప్తి చేశారు.

2011లో మహారాష్ట్రలోనూ ఇలానే జరిగితే అక్కడ అభ్యర్థులు పోరాటం చేశారని మంత్రులు గుర్తు చేశారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి.. సిట్ నివేదిక కోర్టు పరిధిలో ఉందని, న్యాయస్థానం నిర్ణయం ఏమిటో చూద్దామని మంత్రులకు సూచించారు. ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షల వ్యవహారంలో ఎవరెవరి పాత్ర ఉందనే అంశంపై సమాచారం సేకరించేందుకు కొంతమంది పోలీస్ శాఖ అధికారులకు ప్రభుత్వం టాస్క్ ఇచ్చిందన్నారు. తమకు అన్యాయం జరిగిందని కోర్టుకు వెళ్లిన గ్రూప్-1 అభ్యర్థులతో మాట్లాడితే పూర్తి సమాచారం వస్తుందని మంత్రి అనగాని సత్యప్రసాద్ వివరించారు. వారితో వెంటనే మాట్లాడాలని, సమాచారం సేకరించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. అలాగే, డీఎస్సీలో ఎటువంటి అవకతవకలు జరగలేదని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ అంశాన్ని శాసన మండలిలో వైసీపీ లేవనెత్తితే దీటుగా సమాధానం చెబుదామని పేర్కొన్నారు. వైసీపీ చేసే ప్రతి ఆరోపణకు సాక్ష్యాధారాలతో సహా అగ్రెసివ్‌గా కౌంటర్ ఇవ్వాల్సిందేనని మంత్రులకు స్పష్టం చేశారు. పొలిటికల్ ఎటాక్ స్టాం÷-రగ్‌గా ఉండాలన్నారు. కౌన్సిల్‌లో డీఎస్సీపై చర్చకూ సిద్ధమని, ఆరోపణలు చేసే వారు ఆధారాలు తీసుకురావాలని సవాల్ చేయాలని మంత్రులకు సీఎం సూచించారు. ఇప్పటికే అధికారులు అన్ని విషయాలు చెప్పారని, అయినా కావాలని బురద చల్లితే మాత్రం రాజకీయంగా వదిలిపెట్టవద్దని తేల్చి చెప్పారు. రాజధాని అమరావతిలో నిర్మాణాలు ఊపందుకున్నాయని, ఇక వరుసగా ప్రారంభోత్సవాలు చేద్దామని సీఎం చెప్పారు. ఈ సందర్భంగా సైబరాబాద్ నిర్మాణం, హైదరాబాద్ ఓఆర్ఆర్, హైటెక్ సిటీ వంటి ప్రాజెక్టుల్లో తన అనుభవాలను మంత్రులతో సీఎం చంద్రబాబు షేర్ చేసుకున్నారు.

## ఓటరు ధృవీకరణను మరింత ఫ్రెండ్లీగా మార్చాలి

### ఓటరే నేరుగా కలవాల్సిన అవసరం లేకుండా చేయాలి

### ఎన్నికల సంఘానికి వైసిపి నేత లేళ్ల అప్పిరెడ్డి లేఖ

అమరావతి,ఆగస్ట్13 : ఓటర్ల ధృవీకరణ ప్రక్రియను మరింత ఓటర్ ఫ్రెండ్లీగా మార్చాలని వైఎస్సార్‌సీపీ భారత ఎన్నికల సంఘాన్ని కోరింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌కు లేఖ రాశారు. అన్‌మ్యాప్డ్, మిస్‌మ్యాచ్డ్ ఓటర్ల ధృవీకరణలో పలు కీలక మార్పులు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఓటరు స్వయంగా హాజరు కాలేని పరిస్థితుల్లో తల్లిదండ్రులు లేదా రక్త సంబంధీకుల ద్వారా అవసరమైన పత్రాలను సమర్పించేందుకు అవకాశం కల్పించాలని కోరారు. ఉద్యోగం, చదువు, వలస కూలీలుగా ఇతర ప్రాంతాల్లో ఉన్న ఓటర్లకు కూడా వెసులుబాటు కల్పించాలని సూచించారు. ఓటరు తరపున పత్రాలు సమర్పించే బంధువులకు రిలేషన్‌షిప్ ప్రూఫ్, అధికారిక అనుమతితో అవకాశం ఇవ్వాలని పేర్కొన్నారు. అలాగే వెరిఫికేషన్ నోటీసుల్లో ధృవీకరణ జరిగే ప్రదేశం, తేదీ, సమయం, సంబంధిత అధికారి వివరాలను స్పష్టంగా పేర్కొనాలని వైఎస్సార్‌సీపీ కోరింది. వెరిఫికేషన్ ప్రదేశం వివరాలు లేకుండా నోటీసులు జారీ చేయడం వల్ల ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అభ్యంతరం వ్యక్తం చేసింది. బూత్ లెవల్ ఆఫీసర్ల ద్వారా స్థానికంగానే ఓటర్ల ధృవీకరణకు అవకాశం కల్పించాలని, పత్రాల స్వీకరణతో పాటు ప్రాథమిక, ఫీల్డ్ వెరిఫికేషన్‌లోనూ వారిని భాగస్వామ్యం చేయాలని సూచించింది. ప్రతి ఓటరు ఉన్నతస్థాయి ఎన్నికల అధికారిని వ్యక్తిగతంగా కలవాల్సిన అవసరం లేకుండా స్థానిక స్థాయిలోనే సమస్యలను పరిష్కరించే వ్యవస్థ ఉండాలని కోరింది. ఇదిలా ఉండగా, సర్ ప్రక్రియలో గన్నవరం నియోజకవర్గంలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ కూడా చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌కు లేఖ రాశారు. బూత్‌ల వారీగా 32,524 మంది ఓటర్ల జాబితాను సమర్పించలేదని ఆయన పేర్కొన్నారు. విజయవాడ రూరల్ మండలంలోని 24 నుంచి 70 వరకు ఉన్న పోలింగ్ స్టేషన్లలో పునఃపరిశీలన లేదా ఆడిట్ ఎందుకు జరగలేదో వివరించలేదని వంశీ తన లేఖలో పేర్కొన్నారు. ప్రసాదంపాడులోని 58, 59, 53 పోలింగ్ స్టేషన్లలో 'నో మ్యాపింగ్' కేసులు అసమానంగా ఉన్నాయని తెలిపారు. ఓటర్ల ధృవీకరణకు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా ఒకే విధమైన స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని వైఎస్సార్‌సీపీ కోరింది. కేవలం ప్రక్రియాపరమైన ఇబ్బందులు, నియోజకవర్గానికి దూరంగా ఉండటం లేదా నోటీసులో స్పష్టత లేకపోవడం వంటి కారణాలతో ఒక్క నిజమైన ఓటరు కూడా ఓటర్ల జాబితా నుంచి తొలగిపోకూడదని ఎన్నికల సంఘాన్ని విజ్ఞప్తి చేసింది.

## ఇంద్రకీలాద్రిపై మొబైల్ ఫోన్లు నిషేధం

### దర్శనానికి ముందే డిపాజిట్ చేయాల్సిందే

విజయవాడ,ఆగస్ట్13 : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గమ్మ ఆలయంలో భక్తులకు కొత్త భద్రతా నిబంధనలను ఆలయ అధికారులు అమలులోకి తీసుకొచ్చారు. ఆలయ ప్రాంగణంలోకి మొబైల్ ఫోన్లపై పూర్తిస్థాయిలో నిషేధిస్తూ నిర్ణయం తీసుకున్నారు. స్కానింగ్ పాయింట్ వద్ద కొత్త భద్రతా గేట్ ఏర్పాటు చేశారు. స్కానింగ్ తర్వాత మొబైల్ ఫోన్ లోపలికి వెళ్లకుండా కఠినంగా తనిఖీలు చేయనున్నారు. ఈ నిబంధనల ప్రకారం, క్యూ లైన్లలోకి వెళ్లే ముందే ఫోన్లను డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. మొబైల్ ఫోన్ల కోసం ప్రత్యేక డిపాజిట్ కౌంటర్లను ఏర్పాటు చేశారు. భద్రతా తనిఖీలను కట్టుదిట్టం చేయాలని ఆలయ ఈవో శీనా నాయక్ ఆదేశాలు జారీ చేశారు. హోంగార్డులు, అజైల్ సెక్యూరిటీ సిబ్బందితో పటిష్ఠమైన భద్రతను కల్పించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రద్దీ నియంత్రణకు దర్శన లైన్లలో మార్పులు చేపట్టారు. దర్శన టికెట్ల జారీ కౌంటర్ల స్థానాల్లో మార్పులు చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఉచిత లడ్డూ ప్రసాదం కౌంటర్లను కూడా అధికారులు మార్చేశారు. భక్తులకు ఇబ్బంది లేకుండా నేరుగా దర్శనానికి వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. కొత్త నిబంధనలకు భక్తులు సహకరించాలని ఆలయ అధికారులు విజ్ఞప్తి చేశారు.

## డిఎస్సీ కాదు...గ్రూప్ 1 అవతకవకలపై మాట్లాడండి

### వైకాపా నేతలకు మంత్రి డోలా సూటి ప్రశ్న

అమరావతి,ఆగస్ట్13 : ఏపీలో 16 వేలకుపైగా డీఎస్సీ ఉద్యోగాలను కూటమి ప్రభుత్వం పారదర్శకంగా భర్తీ చేసిందని మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. మెరిట్ అభ్యర్థికి అన్యాయం జరగకూడదన్నదే చంద్రబాబు ప్రభుత్వ సిద్ధాంతమని స్పష్టం చేశారు. 20 లక్షల ఉద్యోగాల హామీలో భాగంగానే భారీగా ఉద్యోగాలను భర్తీ చేస్తున్నట్లు చెప్పారు. డీఎస్సీపై వచ్చిన వందల కేసులను చట్టపరంగా అధిగమించి నియామక ప్రక్రియను ముందుకు తీసుకెళ్లామని చెప్పారు. ఉద్యోగాల భర్తీని అడ్డుకునేందుకు ప్రతిపక్షం అనవసర రాద్ధాంతం చేస్తోందని మండిపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో గ్రూప్ 1పై సిట్ నివేదిక తీవ్రమైన ప్రశ్నలు లేవనెత్తిందని మంత్రి తెలిపారు. 'అర్హత లేని వ్యక్తులతో మూల్యాంకనం చేయించారన్న ఆరోపణలపై సమాధానం ఏదని ప్రశ్నించారు. ప్రైవేట్ రిసార్టులో ఆన్సర్‌షీట్ల మూల్యాంకనం ఎందుకు జరిగింది? సీసీ కెమెరాలు, అధికారిక పర్యవేక్షణ లేకుండా మూల్యాంకనం ఎలా జరిగింది? ఙఖాఅ ఆధీనంలో ఉండాల్సిన ఆన్సర్‌షీట్లు ప్రైవేట్ ప్రదేశానికి ఎలా చేరాయి? వ్యక్తిగత ఉపజీతి ఖాతాలు, ఉనీనీణ్గ÷ ఆసతిలఞల ద్వారా మూల్యాంకనం జరిగిందన్న ఆరోపణలకు వివరణ ఏది?' అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. మూల్యాంకన ప్యానల్ అర్హతలపై వచ్చిన ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సిట్ గుర్తించిన మార్కుల వ్యత్యాసాలపై పూర్తి వాస్తవాలు బయటపెట్టాలని మంత్రి అన్నారు. ఓఎంఆర్ షీట్లలో దిద్దుబాట్లు, వైట్‌నర్ వినియోగంపై ఫోరెన్సిక్ నివేదిక ఏమి చెబుతోందని అడిగారు. సంతకాలు సరిపోని దిద్దుబాట్లు, వేర్వేరు ఇంకుల వినియోగంపై విచారణ అవసరమన్నారు. ఒకే ఆన్సర్‌షీట్‌లో వేర్వేరు ఇంకులు ఎందుకని ప్రశ్నిస్తూ.. దీనిపై బాధ్యత ఎవరిదని నిలదీశారు. నియామక ప్రక్రియలో అవకతవకలు జరిగాయంటే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. యువత భవిష్యత్తుతో చెలగాటం చేసే హక్కు ఎవరికీ లేదని అన్నారు. రాజకీయ ఆరోపణలు కాదని.. డీఎస్సీపై వాస్తవాలు, ఆధారాలు ఉంటే చూపించాలని సవాల్ విసిరారు. 'మెరిట్, పారదర్శకత, న్యాయం.. కూటమి ప్రభుత్వ నియామకాలలో ఇవే ప్రామాణికాలు' అని మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి స్పష్టం చేశారు.

## సమగ్ర ఏనుగు సంరక్షణ ప్రణాళిక

### ఏనుగుల సంరక్షణతో పాటు జీవనోపాధి

### ఏనుగులతో పంటనష్టం, ప్రాణనష్టంపై ఆందోళన

### కేంద్ర పర్యావరణ సహాయక శాఖ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్

విశాఖపట్నం,ఆగస్ట్13 : ఏనుగుల సంరక్షణతో పాటు ప్రజల ప్రాణాలు, జీవనోపాధి రక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్ర పర్యావరణ సహాయక శాఖ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ తెలిపారు. విశాఖలో జరిగిన ప్రపంచ ఏనుగుల దినోత్సవం-2026 ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పాల్గొని ప్రసంగించారు. మానవ-ఏనుగు మధ్య ఘర్షణలు తీవ్రమైన సమస్యగా మారాయన్నారు. దీనికి తాత్కాలిక చర్యలకంటే శాస్త్రీయ పరిశోధన ఆధారిత సమగ్ర ప్రణాళిక అవసరమని తెలిపారు. ఏనుగుల సంరక్షణలో పురోగతి సాధించినప్పటికీ పంట నష్టం, ప్రాణనష్టం, అలాగే ఏనుగుల మృతి వంటి ఘటనలు పెరుగుతున్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం సమగ్ర ఏనుగు సంరక్షణ ప్రణాళికను రూపొందించిందని కేంద్ర మంత్రి వెల్లడించారు. శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞాన వినియోగాన్ని పెంపొందిస్తూ బందీ ఏనుగుల డీఎన్ఏ డేటాబేస్‌తో పాటు ఏనుగుల కదలికలను పర్యవేక్షించే 'గజ సూచన' యాప్‌ను వినియోగిస్తున్నామని తెలిపారు.

## భారతీయ సంస్కృతి పరిరక్షణెలి లక్ష్యం

### హర్ ఘర్ తిరంగాలో ఎమ్మెల్యే సుజనా చౌదరి

విజయవాడ,ఆగస్ట్13 : భారతీయ సంస్కృతి పరిరక్షణెలి లక్ష్యమని ఎమ్మెల్యే సుజనా చౌదరి వ్యాఖ్యానించారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఎంతోమంది త్యాగాలు చేశారని కొనియాడారు. వారు దేశ స్వాతంత్ర్యాన్ని ఎంతో కష్టపడి తీసుకువచ్చారని పేర్కొన్నారు. 'హర్ ఘర్ తిరంగా' యాత్ర దేశంలో గత పదేళ్ల నుంచి జరుగుతుందని ప్రస్తావించారు. గురువారం విజయవాడలోని భవానీపురంలో 60 అడుగుల త్రివర్ణ పతాకంతో తిరంగా రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సుజనా చౌదరి, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుజనా చౌదరి మాట్లాడారు. భారతదేశం మీద ప్రతి ఒక్క పౌరుడికి కూడా ఒక అభ్యుదయ భావం, భక్తి ఉందని ఎమ్మెల్యే తెలిపారు. మన దేశ సంప్రదాయాలు, సంస్కారాలను మరిచిపోకుండా ఉండటానికి తిరంగా రన్‌ను ప్రారంభించారని పేర్కొన్నారు. పిల్లలందరితో ఈ భవానీపురం రోడ్డులో తిరంగా యాత్ర గొప్పగా జరిగిందని చెప్పుకొచ్చారు. పిల్లలందరికీ దేశభక్తి ఎందుకు ముఖ్యమనేది కూడా తెలియజేయాల్సిన అవసరం ఉందని అన్నారు. స్కూళ్లలో, కాలేజీల్లో కూడా తిరంగా యాత్ర గురించి వివరించాలని తెలిపారు. మన భారతీయ సంస్కృతి సంస్కారాన్ని ఎలా కాపాడుకోవాలనే ఉద్దేశంతో ఈ 'హర్ ఘర్ తిరంగా' యాత్ర చేపట్టామని ఎమ్మెల్యే సుజనా చౌదరి పేర్కొన్నారు.

## విజయవాడలో తిరంగా ర్యాలీ

### కార్యక్రమంలో పాల్గొన్న వెయ్యిమంది విద్యార్థులు

విజయవాడ,ఆగస్ట్13 : 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. దాదాపు వెయ్యి మంది విద్యార్థులతో సాగిన ఈ ర్యాలీలో కలెక్టర్ లక్ష్మీశా, సీపీ రాజశేఖర్ బాబు, మున్సిపల్ కమిషనర్ ధ్యాన్ చంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని 'పార్ట్నర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్' కార్యక్రమంలో భాగంగా మెగా ర్యాలీ నిర్వహించామని తెలిపారు. అన్ని రంగాల ప్రజలను మమేకం చేస్తూ, రానున్న 21 సంవత్సరాల్లో ఊరు, రాష్ట్రం, దేశం ఎలా ఉండాలనే ఆలోచనతో 'నేను నా లక్ష్యం' కోసం పని చేస్తాను అనే సంకల్పంతో ముందుకు సాగాలన్నారు. ప్రతి ఒక్కరూ భాగస్వాములై 'పార్ట్నర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్' కార్యక్రమంలో పాల్గొనాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. 80 సంవత్సరాలుగా ఆగస్టు15న ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరుపుకుంటున్నామని సీపీ రాజశేఖర్ బాబు అన్నారు. ప్రజలందరినీ మమేకం చేసి, అందరిలో దేశభక్తిని పెంపొందించేలాగా పలు కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా చేస్తున్నామని చెప్పారు. అందులో భాగంగానే తిరంగా ర్యాలీని నిర్వహించినట్లు తెలిపారు. 2047 లక్ష్యాలకు అనుగుణంగా అందరం ముందుకు కదలాల్సిన అవసరం ఉందన్నారు. దేశ పౌరులందరూ నడుంకట్టి, మంచి సమాజం కోసం పాటుపడాలని సీపీ రాజశేఖర్ బాబు పేర్కొన్నారు.

## 25.970 కేజీల గంజాయి పట్టివేతీ

రాజమండ్రి,ఆగస్ట్13 : రాజానగరం పోలీస్ స్టేషన్ పరిధిలో 25.970 కేజీల గంజాయి పట్టుబడింది. ఏజెన్సీ ప్రాంతం సీలేరు నుంచి విజయవాడ వెళ్తున్న కారులో గంజాయిని పోలీసులు గుర్తించారు. మూడు పాలిథిన్ సంచుల్లో 25.970 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.4.29 లక్షలు ఉంటుందని అంచనా. అలాగే, గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులు ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం సారిప్లలెకు చెందిన దులపల్లి సుజీవ్ కుమార్, మోదుగు నరేష్‌గా గుర్తించారు. విచారణలో నిందితులు చెప్పిన సమాచారం మేరకు, విజయవాడలో గంజాయి తీసుకునే వ్యక్తి చినమ్సెట్టి రాజేష్ కోసం గాలింపు ముమ్మరం చేశారు. గంజాయి సేకరించిన సీలేరు సమీపంలోని చింటు అనే వ్యక్తి పరారీలో ఉన్నారు. నిందితుల నుంచి కారు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంపై రాజానగరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



# అలా ..రజనీకాంత్ గారితో జతకట్టా

## శ్రియా శరణ్ అనుభవాలు

టాలీవుడ్, కోలీవుడ్ తార నటి శ్రియ శరణ్ సూపర్ స్టార్ రజనీకాంత్ తో నటించిన 'శివాజీ: ది బాస్' సినిమా బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. శ్రియ కెరీర్ లోనే అత్యధిక కలెక్షన్స్ సాధించిన చిత్రాలలో ఒకటిగా నిలిచింది. అయితే ఈ సినిమా షూటింగ్ సమయంలో జరిగిన ఒక మధురమైన జ్ఞాపకాన్నిశ్రియ తాజాగా పంచుకున్నారు. దర్శకుడు శంకర్ తనకు ఆ అవకాశం ఇచ్చిన వైనం గురించి ఆమె మాట్లాడుతూ..ఒకరోజు శంకర్ సర్ నాకు ఫోన్ చేసి, 'ఒక సినిమా ఉంది, అందులో పనిచేస్తావా?' అని అడిగారు. నేను సరేనని చెప్పాను, ఆయన 'సరే' అన్నారు. నేను అక్కడికి వెళ్లేసరికి చాలా మంది ప్రముఖులు వచ్చారు. ఎ.ఆర్. రెహమాన్ సర్, రజనీకాంత్ సర్ వచ్చారు. అప్పుడు నేను శంకర్ గారిని చూసి, 'ఇది కచ్చితంగా చాలా పెద్ద సినిమా అయి ఉంటుంది' అనుకున్నాను, ఎందుకంటే అక్కడ అంత పెద్ద వాళ్ళంతా గుమిగూడారు. అప్పుడు ఆయన నన్ను చూసి, 'మీ కో-స్టార్ రజనీకాంత్ సర్‌ని కలవండి' అని చెప్పారు. దానికి నేను షాక్ అయ్యి 'అవునా? సరే!' అన్నాను. ఆ తర్వాత అక్కడ ఎ.ఆర్. రెహమాన్ సర్ ఉన్నారు, అలాగే సినిమాటోగ్రాఫర్ కే.వి. ఆనంద్ సర్ కూడా ఉన్నారు' అంటూ రజనీకాంత్‌తో తన మొదటి పరిచయ క్షణాలను శ్రియ ఎంతో సరదాగా గుర్తుచేసుకున్నారు.





# రాకాలో మరో ముగ్గురు ముద్దుగుమ్మలు

## జాన్వీ, రష్మిక, మృణాల్ ఉన్నట్లుగా ప్రచారం

అల్లు అర్జున్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'రాకా' సినిమాకి సంబంధించి చిత్రబృందం ఇప్పటివరకూ అధికారికంగా బయట పెట్టింది కొన్ని విషయాలే! ఇందులో నటిస్తున్న తారాగణంపై కూడా ఇంకా పూర్తిగా స్పష్టత లేదు. కథానాయికగా దీపికా పదుకొణె పేరు మాత్రమే ఇప్పటివరకూ ఖరారైంది. ఆమెతోపాటు... మరో ముగ్గురు ప్రముఖ కథానాయికలు ఇందులో కీలక పాత్రలు పోషిస్తున్నట్టుగా ప్రచారం సాగుతోంది. అతిథి పాత్రల గురించి కూడా ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. ఆ పరంపరలోనే షారుక్ ఖాన్, షాహిద్ కపూర్ పేర్లు కూడా వినిపిస్తున్నాయి. ఈ సినిమాలోని కథానాయికల పాత్రలపై కూడా కొన్ని కీలకమైన విషయాలు వెలుగులోకి వచ్చినట్టుగా బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. మొదట్నుంచీ ముంబయిలోనే ఈ సినిమా చిత్రీకరణ సాగుతుండడం, అక్కడ్నుంచి పలు విషయాలు ప్రచారంలోకి వస్తుండడంతో సినీ ప్రేమికులు వాటి గురించి ప్రత్యేకమైన ఆసక్తిని కనబరుస్తూ చర్చించుకుంటున్నారు. దీపిక ఇందులో గర్భవతిగా కనిపించనున్నారని, ఆమె ప్రస్తుతం గర్భంతోనే ఉండటం సినిమాకి కలిసొచ్చిందని బాలీవుడ్ వర్గాలు చెప్పుకుంటున్నాయి. ఆమె ఈ నెలలోనే ఈ సినిమా చిత్రీకరణ పూర్తి చేయనున్నట్టు తెలుస్తోంది. అలాగే ఇందులో మరో కథానాయికగా నటిస్తున్న జాన్వీ కపూర్ ఓ గిరిజన యువతిగా శక్తిమంతమైన పాత్రలో కనిపిస్తారని, రష్మిక పాత్ర దీపికా పాత్ర చేసే పోరాటానికి మార్గ నిర్దేశనం చేసే పాత్రలో కనిపించనున్నారన్న ప్రచారం సాగుతోంది. ఇందులో మృణాల్ ఠాకూర్ కూడా ఓ కీలకపాత్రని పోషిస్తున్నట్టు సమాచారం. 'రాకా' ప్రపంచంపైనా, ఇందులోని పాత్రలపైనా స్పష్టత రావడానికి మరింత సమయం పడుతుంది. పురాణాలు, ఆధునిక కాలం మేళవింపుగా ఈ చిత్రం రూపొందుతున్నట్టు తెలుస్తోంది. అట్లీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ సంస్థ అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తోంది.



# అతిగా ఫోన్ వాడకంతో 3 లక్షలు బొక్క


## నటి షకీలాకు చేదు అనుభవం


ప్రముఖ నటి షకీల ఇటీవల తనకు ఎదురైన ఒక భయంకరమైన ఆరోగ్య సమస్య గురించి అభిమానులతో పంచుకున్నారు. రీల్స్ మోజులో అతిగా మొబైల్ ఉపయోగించడం వల్ల తాను తీవ్రమైన మెడ నొప్పితో బాధపడ్డానని, దీనివల్ల రూ.3 లక్షల ఖర్చుతో శస్త్రచికిత్స చేయించుకోవాల్సి వచ్చిందని ఆమె వెల్లడించారు. ఈ విషయాన్ని తెలుపుతూ అభిమానులకు జాగ్రత్తలు చెప్పారు. ఫోన్‌లో చాలాసేపు గేమ్స్ ఆడటం, యూట్యూబ్, ఇన్‌స్టాలో రీల్స్ చూడటం వల్ల తనకు ఈ పరిస్థితి వచ్చిందని షకీల తెలిపారు. నిద్రపోయే సమయంలో కూడా ఒక పక్కకు వాలి గంటలు గంటలు ఫోన్ చూడటంతో మెడలోని నరాలపై తీవ్ర ప్రభావం పడిందని, అందుకే శస్త్రచికిత్స చేయించుకోవాల్సి వచ్చిందని ఆమె పేర్కొన్నారు 'ఫోన్ చాలా ముఖ్యం. కానీ, అవసరానికి మించి దాన్ని వాడకండి. ఉపయోగం లేని వీడియోలను చూస్తూ సమయం వృథా చేయకండి. సరిగ్గా వాడకపోతే డబ్బులు పోవడమే కాకుండా, భరించలేని నరకయాతన అనుభవించాల్సి వస్తుంది. చిన్న పిల్లలకు ఫోన్ ఇవ్వడంలో తల్లిదండ్రులు చాలా జాగ్రత్తగా ఉండాలి. మొబైల్ వాడకాన్ని తగ్గించాలి' అని షకీల కోరారు. 18 ఏళ్ల వయసులో 'ప్లే గర్ల్స్' అనే తమిళ చిత్రంతో షకీల ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. 2000 సంవత్సరంలో వచ్చిన మలయాళ చిత్రం 'కిన్నార తుంబికల్' ఆమె కెరీర్‌ను మలుపు తిప్పింది. డైరెక్టర్ తేజ రూపొందించిన 'జయం' సినిమాతో తెలుగులో ఎంట్రీ ఇచ్చారు. ఆ తర్వాత నిజం, బంగారం, తొట్టిగ్యాంగ్ వంటి పలు చిత్రాల్లో ఆమె నటించారు.




# లోకేశ్ కనగరాజ్ చిత్రం డిసికి పెరుగుతున్న కలెక్షన్లు

కోలీవుడ్ ప్రముఖ దర్శకుడు లోకేష్ కనగరాజ్ హీరోగా అరంగేట్రం చేసిన తొలి చిత్రం 'డీసీ' బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన కలెక్షన్లతో దూసుకుపోతోంది. అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వం వహించిన ఈ తమిళ యాక్షన్ డ్రామా ఇండియన్ మార్కెట్లో మొదటి రోజు నుంచే మంచి వసుళ్లను రాబడుతున్న సంగతి తెలిసిందే. ఫస్ట్ డేనే రూ. 6 కోట్లకు పైగా వసుళ్లను రాబట్టిన ఈ చిత్రం అనంతరం వరుసగా కలెక్షన్స్‌తో దూసుకుపోతుంది. తాజాగా ఆరో రోజు కూడా బాక్సాఫీస్ వద్ద తన జోరును కొనసాగించింది. వర్కింగ్ డేస్‌లోనూ ఈ చిత్రం పట్టుసడలించకుండా మంచి వసూళ్లను రాబడుతోంది. కేవలం ఆరో రోజే భారతదేశంలో సుమారు రూ. 5 కోట్లు నెట్ రాబట్టగా, ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా కలెక్షన్లు రూ. 58.62 కోట్లకు పైగా చేరుకున్నాయి. వీకెండ్ కల్లా ఈ చిత్రం రూ. 60 కోట్ల మార్కును దాటే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. 'విక్రమ్', 'లియో', 'కూలీ' వంటి బ్లాక్‌బస్టర్ సినిమాలతో స్టార్ డైరెక్టర్‌గా గుర్తింపు తెచ్చుకున్న లోకేష్ కనగరాజ్, ఈ చిత్రంతో పూర్తి స్థాయి నటుడిగా మారడం విశేషం. ప్రస్తుతం లోకేష్ అల్లు అర్జున్‌తో 'ఏఏ23' ప్రాజెక్ట్‌ను తెరకెక్కించడానికి సన్నాహాలు చేస్తున్నారు.









# సినీ లవర్స్‌కు పండగే పండగ

నేడు ఒక్కరోజే ఆరు సినిమాలు విడుదల పంద్రాగాస్ట్ సినీ లవర్స్‌కు పండగ చేయబోతోంది. పలు సినిమాలు 14న శుక్రవారం విడుదల కాబోతున్నాయి. ఇందులో సూర్య కథానాయకుడిగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందిన తాజా చిత్రం 'విశ్వనాథ్ అండ్ సన్స్'. మమితా బైజు కథానాయిక. రాధికా శరత్ కుమార్ కీలక పాత్ర పోషించారు. ఈ చిత్రం ఈనెల 14న థియేటర్లలోకి రానుంది. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మించారు. ఇటీవల విడుదల చేసిన ప్రచార చిత్రం సినిమాపై అంచనాలను పెంచింది. పిస్టల్ షూటర్ సంజయ్ విశ్వనాథ్ (సూర్య) కొడుక్కి ఉన్న ఆరోగ్య సమస్య ఓ సవాల్‌గా మారుతుంది. ఆ బాబు ఆపరేషన్‌కి అవసరమైన అవయవదాతను వెతుకుతుండగా మ్యాడీ అనే యువతి పరిచయమవడం.. ఆమె రాకతో ఆ తండ్రీకొడుకుల జీవితాలు ఎలా మారాయన్నది చిత్ర కథ. విచిత్రమైన పాత్రలు... సరదా సంఘటనలు... ఊహించని మలుపులతో రూపొందుతున్న సినిమానే మా 'పళ్ళ బురుసు' అంటున్నారు ఉదయ్ చౌహాన్. ఆయన దర్శకత్వంలో.. సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రమిది. అన్నపూర్ణ స్టూడియోస్, ఎపిక్ స్టూడియోస్ సంయుక్త నిర్మాణంలో రూపొందింది. 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. కామెడీ, భావోద్వేగాల మేళవింపుగా ఓ పల్లెటూరి కథతో మూవీని తీర్చిదిద్దినట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది.'ఆధ్యాత్మిక అంశాలతో మిళితమై ఉన్న మిస్టిక్ థ్రిల్లర్ 'అగథ' అంటున్నారు హీరో శ్రవణ్ రెడ్డి. ఆయన కీలక పాత్రలో కామాక్షి భాస్కర్ల, ఉల్కా గుప్తా, జోవికా విజయ్ కుమార్ ప్రధాన పాత్రధారులుగా నటించిన చిత్రమిది. ఎంఎస్ రాజు తెరకెక్కించారు. ఆగస్టు 14న ఈ మూవీ విడుదల కానుంది. ఇందులో భయపెట్టే అంశాలు మాత్రమే కాదు... అంతకుమించిన కథ ఉందని చిత్ర బృందం చెబుతోంది. 'నేటి యువతరానికి కనెక్ట్ అయ్యే సినిమా 'హుషార్ పిట్టలు'. తప్పకుండా అందరికీ నచ్చేలా ఉంటుంది' అంటున్నారు నిర్మాత డి.సురేశ్‌బాబు. అన్షు, వాసవి గణెళిశన్ జంటగా నటించిన ఈ చిత్రాన్ని బిక్షు తెరకెక్కించారు. వెంకట్ యాదవ్ నిర్మించారు. ఏషియన్ సురేశ్ ఫిల్మ్స్ సంస్థ విడుదల చేస్తోంది. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది. 'ఈ సమాజంలో కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా దీన్ని రూపొందించినట్లు దర్శకుడు చెబుతున్నారు. ఇకపోతే విశాల్ కథానాయకుడిగా నటిస్తూ.. స్వయంగా తెరకెక్కించిన చిత్రం 'మకుటం'. ఆర్బీ చౌదరి నిర్మాత. దుషార విజయన్, అంజలి కథానాయికలు. ఈ మూవీ తమిళ, తెలుగు భాషల్లో 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. లింగ, కృపాకర్ అనే రెండు వైవిధ్యమైన పాత్రల్లో మూడు విభిన్న గెటప్పులలో విశాల్ కనిపించిన విధానం.. యాక్షన్ అలరిస్తున్నాయి. బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ ప్రధాన పాత్రలో 2007లో దర్శకుడు మోహిత్ సూరి తెరకెక్కించిన సినిమా 'ఆవారాపన్'. ఇప్పుడీ సినిమాకి సీక్వెల్‌గా రూపొందిన చిత్రం 'ఆవారాపన్ 2'. ఇమ్రాన్ హష్మీ, దిశా పటానీ జంటగా నటిస్తున్నారు. నితిన్ కక్కర్ దర్శకుడు. ఆగస్టు 14న ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే విడుదల చేసిన ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాలను పెంచాయి. ఇమ్రాన్ డైలాగ్స్‌తో పాటు దిశా నటన అలరిస్తోంది. ఇమ్రాన్ ఇందులో శివమ్ పండిట్ పాత్రలో కనిపించనున్నారు. సన్నీ డియోల్ ప్రధాన పాత్రలో రాజ్‌కుమార్ సంతోషి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'బట్వారా 1947' ప్రీతి జింటా, షబానా అజ్మీ తదితరులు కీలక పాత్రలు పోషించారు. బాలీవుడ్ కథానాయకుడు ఆమిర్ ఖాన్ నిర్మాణ సంస్థ రూపొందించిన చిత్రమిది. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఆగస్టు 14న విడుదల కానుంది. దేశ విభజన కాలం నాటి హింసాత్మక పరిస్థితుల మధ్య చిక్కుకున్న ఓ కుటుంబ నేపథ్యంలో భావోద్వేగభరితంగా ఈ సినిమాను తీర్చిదిద్దారు.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com